మహాభాగవత కల్పకుసుమమా

లలిత స్కంధము కృష్ణమూలము
శుకాలాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణ సుమన
స్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల
వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు
వుర్విన్ సద్విజ శ్రేయమై.

కూర్పరి
డా॥ (శ్రీమతి) పి. యశోదారెడ్డి



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - సైఫాబాదు,
హైదరాబాదు-4

MAHA BHAGAVATHA KALPA KUSUMAMALA-
A volume containing 500 selected verses of Bammera Pothana of 15th century A. D. Verses selected by Dr. (Smt) P. Yasoda Reddi, Reader in Telugu, Osmania University, Hyderabad, A.P.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
హైదరాబాదు - 500 004

ప్రచురణ : **327**

ప్రథమ ముద్రణ : **1982**

ప్రతులు : **5000**

వెల రూ. 3-25

ప్రతులకు :
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
కళాభవన్, సైఫాబాద్,
హైదరాబాదు-500 004.

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,
హైదరాబాదు.

Paper used for the Printing of this book was made available by the Government of India at Concessional rate.

తొలి పలుకు

తన మహనీయమైన వ్యక్తిత్వంతో, తన రసవత్కవితావేశంతో తెలుగు సంస్కృతినీ, తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన మహాకవి బమ్మెర పోతన. కవిత్వానికి అజరామరత్వం, పాపనిర్మూలనా సామర్థ్యం, ఉత్తమ సంస్కార ప్రసరణయోగ్యత కవిసౌశీల్యంవల్ల, ఆత్మాభిమానంవల్ల సంప్రాప్తమౌతాయి. పోతన భాగవతం వ్యాసకృతికి తెనుగే అయినా అందులో పోతన మహోదాత్త వ్యక్తిత్వ ముద్రలు కనిపిస్తాయి. అనంత కవితాశక్తి సాక్షాత్కరిస్తుంది. పోతన తాను నమ్మిన దానినే, తన బ్రతుకులో అనుభవించినవానినే కావ్యబద్ధం చేయడానికి ప్రయత్నించినాడు. ఆయన భాగవతంలోని శబ్దాలంకారాలు తెలుగు భాషకే తెలుగు ఛందస్సులకే శ్రవణపేయతను సంపాదించిపెట్టినవి. నిర్భయుడై, నిర్మోహుడై కాయకష్టానికి విలువకట్టి ఆ కరకు రాచరికపు దినాలలోనే "ఇమ్మనుజేశ్వరాధములు" అనగలిగిన ధైర్యశాలి ఆ మహాకవి. పోతన్న వ్రాసిన ఒక్క పద్యమైనా రాని తెలుగువాడు కొంచెం వెలితిగల తెలుగుతనం ఉన్నవాడే. పోతన భాగవతం చదివితే తెలుగు కవితాసౌందర్యంతో చక్కని పరిచయం ఏర్పడుతుంది. అచ్చమైన కవి తీరు తెన్నులను అవగతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

బమ్మెర పోతన పంచశతి జయంతి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ "మహాభాగవత కల్ప కుసుమమాల" ను తెలుగు దేశానికి సమర్పించు కుంటున్నది. భాగవతంలోని వేలకొలది పద్యాలలో నుంచి 500 పద్యాలను ఏరి ఈ పుస్తకంగా మలచి అందిస్తున్నాము. ఈ పద్యాలైనా తెలిస్తే బమ్మెర పోతనను కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. డా॥ (శ్రీమతి) పి. యశోదారెడ్డి గారు ఈ పద్యాలను ఏర్చికూర్చినారు. ఈ కుసుమ మాలను కొన్ని గుచ్ఛాలుగా వింగడించి పోతన బహుముఖీన కవితా పాటవాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా కూర్చినారు. ఇందులోని 108 పద్యాలను శ్రీమతి యశోదారెడ్డి గారి వ్యాఖ్యానంతో అకాడమీ త్వరలోనే అందించబోతున్నది.

1981 ఆగస్టు 30 వ తేదీన జరిగిన కార్యవర్గ సమావేశంలో చేసిన నిర్ణయం ప్రకారం ఈ పద్యాల ఎంపికలో అనువైన సలహాలను శ్రీమతి యశోదా రెడ్డిగారికి అందజేసినవారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావు, ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి డా॥ దాశరథి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంయుక్త కార్యదర్శి శ్రీ పేర్వారం జగన్నాథం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి. అకాడమీ పక్షాన వీరికి కృతజ్ఞతాభివందనములు సమర్పించుకుంటున్నాను.

"మహాభాగవత కల్ప కుసుమమాల"కు రూపకల్పన చేసి పద్యాలను మంచి క్రమంలో ఏర్చి కూర్చి అందించిన డా॥ (శ్రీమతి) పి. యశోదారెడ్డి గారికి అకాడమీ పక్షాన ధన్యవాదాలు.

హైదరాబాదు
9–3–1982

ఇరివెంటి కృష్ణమూర్తి
కార్యదర్శి

మహాభాగవత కల్పకుసుమమాల

క. భూషణములు వాణికి నఘ
పేషణములు మృత్యుచిత్త భీషణములు హృ
త్తోషణములు గల్యాణ వి
శేషణములు హరిగుణోపచిత భాషణముల్. 1-44

ఆ. వేదకల్పవృక్ష విగళితమై శుక
ముఖ సుధాద్రవమున మొనసియున్న
భాగవత పురాణఫల రసాస్వాదన
పదవి గనుఁడు రసికభావవిదులు.

ఈ సృష్టిలో సకల జీవకోటికి ప్రాణాధారమైంది అన్నం; కానీ మానవుడు కేవలం ఈ అన్నాన్ని సంపాదించినంత మాత్రంతో తృప్తిని పొందడు. అంతకు మించి ఏదో సాధించాలనీ, ఏదో రహస్యం కనిపెట్టాలనీ తహతహ లాడుతూ ప్రయత్నిస్తుంటాడు. మానవునిలో ఉన్న ఈ జిజ్ఞాసాఫలమే ఆ మానవుణ్ణి సకల జంతు సామాన్యం నుండి వేరుచేస్తూ సంస్కృతీ నాగరికతల నిర్మాణానికి కారణ భూతమై నిలిచింది. కానీ సాలీడు తాను చుట్టుకున్న వలలో తానే చిక్కుకున్నట్లు మానవుని ఈ విజ్ఞానం అఖండమైన భౌతిక సంపత్తిని సమకూర్చి అతనికే ఊపిరి ఆడకుండా చేసింది. అప్పుడాజ్ఞాని పరమశాంతమైన సుఖంకోసం దృష్టిని మళ్లించినాడు. ఆధివ్యాధిజరామృత్యురూపమైన మానవ లోకం భయంకరంగా కనిపించింది. తాపత్రయ నివారణకు తరుణోపాయాన్ని గూర్చి ఆలోచన ప్రారంభమైంది. ఆ ఫలితంగానే పారమార్థిక చింతనా రూపమైన వాఙ్మయం వెలసి తత్వ చింతనవైపు దృష్టి సాగింది.

ఉపనిషద్రూపమైన మహావిజ్ఞానం అందరికీ సులభసాధ్యం కాదు. అమూర్తమైన మహాపదార్థం మీద సామాన్యునికి దృష్టి లగ్నమై మనస్సుకు నిలుకడ ఏర్పడదు. అందుకే ఆ పరతత్త్వానికి నామ గుణరూపాది విశేషాలు కల్పించి లోకాన్ని ఆస్తికంగా తీర్చడానికి ప్రయత్నించింది పురాణ వాఙ్మయం. ఈ పురాణాలన్నిటిలో శ్రీహరి ప్రాధాన్యంతో లీలా మానుష విగ్రహుడై వెలసిన శ్రీకృష్ణుని అవతారాన్ని ఆధారంగా గ్రహించి లోకమోహనమైన కథలతో భక్తిని ప్రధానంగా బోధించింది భాగవతం.

నారద మహర్షిచేత ప్రబోధితుడైన వేదవ్యాసుడు భక్తియుక్తమైన తన చిత్తంలో నిండుకున్న పరమేశ్వరుని చూచి నారాయణ భక్తియోగం కన్నా భవ బంధాలను తొలగించే సాధనం వేరొక్కటి లేదు అంటూ తలంచి, లోకహితాన్ని కాంక్షిస్తూ భాగవత మహాపురాణాన్ని రచించి, కుమారుడైన శుకయోగిచేత చదివించినాడు. ఆ శుకయోగీంద్రుడు, కాలం ఆసన్నం కాగా విరక్తచిత్తుడైన పరీక్షిత్తు అనే మహారాజుకు ఈ భాగవత మహాపురాణాన్ని వినిపించినట్లు సంప్రదాయం ఉంది.

భాగవత మాహాత్మ్యము :- భాగవత శబ్దాన్ని నిర్వచిస్తూ పెద్దలు 1. 'భాగవతానాం చరితం భాగవతమ్' అన్నారు. భాగవతుల చరిత్ర భాగవతం ఐనప్పుడు, భాగవతులంటే ఎవరు ? అనే సందేహం రాకుండా 'భగవతిభక్తాః భాగవతాః' అంటూ సమాధానం చెప్పి విష్ణుభక్తులను భాగవతులుగా నిర్ణయించినారు.

2. ఇట్లే 'భగవతం తం ప్రతికృతం అయం గ్రంథః భాగవతః, తదిదం భాగవతమ్' అనే నిర్వచనం కానవస్తుంది. భగవంతుని పురస్కరించుకుని రచింపబడిన గ్రంథం భాగవతం అని చెప్పినప్పుడు భగవంతుడు అంటే ఎవరు? అనే జిజ్ఞాస బయలుదేరుతుంది. అందుకే 'భగ' శబ్దానికి నిర్వచనం చెప్పవలసి వచ్చింది. సమగ్రమైన ఐశ్వర్యమూ, పరాక్రమమూ, యశస్సూ, సంపదా, జ్ఞాన,

వైరాగ్యాలు అనే ఆరింటికి 'భగం' అనే వ్యవహారముంది. ఈ షడ్విధ రూపాల 'భగా'ల కలయికే భగవత్త్వం; ఆ దర్శనమే భాగవతం అంటూ పెద్దలు నిర్ణయించినారు. ఇట్లే ఉత్పత్తి, లయ, భూతసృష్టి, భూతప్రళయ, విద్యావిద్యలు అనే ఆరింటిని ఎరిగినవాడు భగవంతుడు. ఈయన సనాతనుడు, అచ్యుతుడు, అనంతుడు, సర్వజగత్స్రష్ట, సర్వజగన్నియామకుడు, సకలయజ్ఞరూపి, సర్వయజ్ఞభోక్త, యోగప్రియుడు, యోగీశ్వరేశ్వరుడు, భక్తజనప్రియుడూ ఐనవాడు. అట్టి ఆదిమధ్యాంత రహితమైన పరతత్త్వాన్ని లోకమోహనమైన శ్రీకృష్ణ పరమాత్మ రూపంలో నిరూపించి అతని మహిమాభివర్ణనం చేయడంలో ప్రధానమైంది భాగవతం. ఈ భాగవతం ధర్మప్రబోధక మగుటతో 'సాత్వత సంహిత' అనీ, పరమాత్మ స్వరూప ప్రతిపాదక మగుటచేత 'పరమహంస సంహిత' అనీ, మోక్షశాస్త్రమనీ, ధర్మమూలమైన మహాపురాణం అనీ, 'గీతార్థ నిర్ణయసారం' అని అనేకులు అనేక విధాలుగా సంభావించినారు. ఈ గ్రంథం, త్రిమతాల వారికీ అవలంబనీయమై జీవేశ్వర తత్త్వాన్ని ఆవిష్కరించడంలో దీనికి ఇదే సాటిగా నిలిచింది. విజ్ఞులు ఈ గ్రంథాన్ని సకల శ్రుతిసారంగా భావిస్తూ నిగమకల్పతరువుగా సంభావించినారు. పరాభక్తితో తెలియదగిన బ్రహ్మవిద్యగా పూజింపబడుతున్న భాగవత గ్రంథాన్ని తెలుగు చేసిన మహాకవి పోతనామాత్యుడు.

ఆంధ్ర మహాభాగవత ప్రశస్తి :- భక్తి, జ్ఞాన, వైరాగ్యాల చేత మోక్షమార్గాన్ని సుగమం చేయగలిగిన వ్యాసకృత మహాభాగవతాన్ని భక్తాగ్రగణి ఐనట్టి పోతనామాత్యుడు సర్వం భగవదాయత్తంగా భావిస్తూ తెలుగించినాడు, అందుకే ఆ మహామనీషి అద్వైతివలె-

'పలికెడిది భాగవతమఁట
పలికించు విభుండు రామభద్రుండఁట నే
బలికిన భవహరమగునఁట
పలికెద వేఱొండు గాథఁ బలుకఁగనేలా.' (ఆ. మహా.భాగ.1-16)

అంటూ భాగవత గ్రంథకర్తృత్వానికి రామభద్రుణ్ణే అధికారిగా నిలుపుతూ తాను కేవలం ఉపకరణంగా మాత్రమే ఉపకరించినట్లు వినమ్రుడై తెలిపినాడు. ఈ మహాపురాణాన్ని తెలుగు చేయడం తన పూర్వజన్మ కృతసుకృత విశేషంగా భావిస్తూ ఆ కారణం చేతనే-

'ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విం బురాణావళుల్
తెనుఁగుల్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనింగించి నా
జననంబున్ సఫలంబు చేసెదఁ బునర్జన్మంబు లేకుండగన్.' (1-19)

నన్నయ తిక్కనాది మహాకవులు ఈ భాగవత పురాణాన్ని తెలుగు చేయలేదంటూ ప్రకటించి, తన జన్మసాఫల్యం కోసం భాగవతాన్ని తెలుగిస్తున్నట్లు చెప్పినాడు. జన్మసాఫల్యం అంటే, పోతనదృష్టిలో మోక్షమే. మోక్షసిద్ధి కలిగిన వాడికి మళ్లీ జన్మ అంటూ ఉండదు కదా! సకల పురుషార్థసారభూతమై ఉన్న సంస్కృత భాగవతాన్ని ప్రశంసిస్తూ-

ఆ. 'భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధజనుల వలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత తేటపఱుతు.' (1-17)

చెప్పిన పద్యంలో ఈ మహాగ్రంథం యొక్క అర్థాన్ని సంపూర్ణంగా గ్రహించి చెప్పడం, సర్వజ్ఞుడైన ఈశ్వరు నంతటి వాడికైనా, సకల వేదముఖుడైన బ్రహ్మ అంతటి వాడికైనా సాధ్యం కాదని చెబుతూ తాను కూడ పెద్దలవలన వినీ, తనకు తెలిసినంత మట్టుకు తెల్పుతానంటూ స్పష్టం చేసినాడు.

అట్లే తాను భాగవతాన్ని తెలుగు చేసే విధానాన్ని గూర్చి

''కొందఱికిఁ దెనుఁగు గుణమగుఁ
గొందఱికిని సంస్కృతంబు గుణమగు రెండున్

కొందఱికి గుణములగు నే
నందఱ మెప్పింతుఁ గృతులనయ్యై యెడలన్.'' (1-18)

అంటూ చెప్పి, లోకంలో ఉన్న విభిన్న రుచులకు అనుగుణంగా తాను తెనుగు సంస్కృత భాషల శైలీరమ్యతలను సమకూరుస్తూ రచిస్తానంటూ భాషపై తనకున్న అధికారాన్ని ప్రకటించినాడు.

పోతనామాత్యుని దృష్టిలో భాగవతం 'భక్తిరసామృతం'. అందుకే ఆయన 'భాగవతంబు సద్భక్తి తోడ వినగోరు వారల విమల చిత్తంబుల జెచ్చెర నీశుండు చిక్కఁగాక, యితర శాస్త్రంబుల నీశుండు చిక్కునే?'' అంటూ ప్రశ్నించినాడు. ఇంతేకాదు, తత్త్వబుద్ధి అంటే ఏదో దాన్ని నిర్వచించినట్లు ''మంచి వారలకు నిర్మత్సరులకు గపటనిర్ముక్తులై కాంక్ష సేయక యిందు దగిలియుండుట మహాతత్త్వబుద్ధి'' అంటూ ప్రకటించినాడు. పైకి పోతన చెప్పిన ఈ తత్త్వరహస్యం చాల సరళంగా, సులభంగా కనబడుతుంది. కానీ, నిజానికి, సకల ఉపనిషద్రహస్యాలను మథించి తీసిన సారం ఇది. సకల పాపమూలం ఐన కాపట్యాన్నీ, మాత్సర్యాన్నీ జయించగలిగి, కోరికలూ ఫలాపేక్షా లేక కేవలం భాగవత ధర్మంలో అంటే భక్తిలో నిమగ్నం కావడం అనేది సామాన్య విషయం కాదు. అట్లా కాగలిగిన పుణ్యాత్ముడు అద్వైతసిద్ధిని పొందినట్లే కదా !

స్థిరచిత్తుడూ ముముక్షువూ ఐన పోతనామాత్యుడు తన గ్రంథాన్ని నరాంకితం చేయడానికి ఇష్టపడక-

''ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరముఁ బాసి కాలుచే
సమ్మెట పోటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్. (1-11)

అంటూ చెప్పి శ్రీమన్నారాయణ కథా ప్రపంచ రూపమైన తన గ్రంథాన్ని రాజీవపత్త్ర లోచనుడైన శ్రీరామచంద్రునికే అంకితం చేసినాడు. కృతిభర్త

శ్రీరామచంద్రుడైనా ఇష్టదేవత మాత్రం మహానందాంగన ఐన యశోదా శిశువే. అందుకే పోతనామాత్యుడు కృత్యాదిలో—

"శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో
ద్రేక స్తంభకుఁ గేళిలోల విల సద్దృగ్జాల సంభూత నా
నాకంజాత భవాండకుంభకు మహానందాంగనా డింభకున్." (1-1)

అంటూ లోకరక్షైకారంభకుడూ, భక్తపాలన సంరంభకుడూ మహానందాంగనా డింభకుడూ ఐన శ్రీకృష్ణుని శ్రీకైవల్యపదాన్ని చేరేందుకు చింతిస్తానంటూ నమస్కరించినాడు. ఈ తొలి పద్యాన్ని బాగా పరిశీలించినప్పుడు మహాజ్ఞాని ఐన పోతనామాత్యుడు.

"తాన్యేవతేఽభిరూపాణి భగవంస్తవ
యానియాని చ రోచంతే స్వజనానామరూపివాన్"

అన్నట్లుగా భక్తుల అభిరుచులను పురస్కరించుకుని భగవంతుడు భిన్న భిన్న నామరూపాలతో కొలువబడినా ఆయన ఒక్కడే అనే భావాన్ని వ్యక్తం చేసినట్లు కనిపిస్తుంది. ఇంతేకాకుండా, 'మహానందాంగనా డింభకుడు' అనే పదాన్ని ఉపయోగించి శ్రీకృష్ణుడు నందగోపుని పత్ని ఐన యశోదా శిశువు అనే కాకుండా మహానందం లేదా పరమానందం అనే అంగనకు డింభకుడు అంటే పరమ సుఖరూపమైన మోక్షపు మొలక శ్రీహరి అంటూ ధ్వనింప చేస్తూ అట్టి సృష్టి స్థితి లయకారకుడైన పరతత్త్వ స్వరూపికి నతులు చేస్తున్నట్లు వ్యక్తపరచినాడు.

పోతనామాత్యునికి సాధారణంగా సహజపాండిత్యుడు అనే బిరుదు ఉంది. ఈ విశేషణం ఆధారంగా పోతనకు శాస్త్రీయమైన లాక్షణిక విద్యాభ్యాసం కొరవడింది అని భావిస్తూ ఉంటారు. కాని భాగవతాన్ని చదివిన వారెవ్వరూ ఆ విధంగా భావించడానికి వీలులేదు. ఈయనకు ఆంధ్ర సంస్కృత భాషలపై అధికారమే కాదు, నానా పురాణ వేద వేదాంగోపనిషత్తుల పఠనంతో జీర్ణించుకున్న

సంస్కారం నిండుగా ఉంది. తాను భాగవతాన్ని తెలుగు చేసే ముందు వ్యాస కృత భాగవతాన్ని శ్రీధరాముల వ్యాఖ్యలతో సహా తన సొత్తు కావించుకున్న సాధన ఉంది. అంతేకాదు. తనకన్నా ముందున్న నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, నాచన సోమనాథుల గ్రంథాలను ఆమూలాగ్రంగా పఠించిన వ్యుత్పత్తి ఉంది. ఆ మహానుభావుల పద్యపు నడకయో, మాటలకూర్పో, అర్థపు బింకమో, సమాస గ్రథనమో తనను ఆకర్షింపగా ఆ ఛాయలలోనే నడిపించిన పద్యాలెన్నో ఉన్నాయి. పోతన కృత భాగవతంలో అక్కడక్కడ నన్నయ తొంగిచూస్తూ ఉంటే, ఎఱ్ఱన, సోమనల పద్యపు నడకలు అనేకచోట్ల దర్శనం ఇస్తూఉంటాయి. వీరేకాదు, శివకవిమండలికి గురుపీఠం అని చెప్పదగిన పాల్కురికి సోముని నీడలు కూడా పోతనపై సోకకపోలేదు. అందుకే పోతనకు ప్రతిభకు తోడు పూర్వమహాకవి కృతగ్రంథ పఠనారూపమైన వ్యుత్పత్తికి, దానికి తగిన సాధన లకు కొదువలేదు. ఐనా లక్షణాతిగతిత్వం చేయని మహాకవి లేడుకదా! అందుకే ఈ కవి హాలికునివలె తెలుగు సాహిత్య క్షేత్రంలో కృషిచేసి భక్తి పంటను పండించి భాగవతఫలాన్ని తెలుగువారికి అందించినాడు.

ఆంధ్ర మహాభాగవతంలో 'భక్తి' అంతా తన మయం చేసుకుని అపు రూపంగా దర్శనం ఇస్తుంది. పోతన ప్రవేశపెట్టిన భక్తిమార్గంలో కూడా ఒక నవ్యత, ఒక వైశిష్ట్యం భాసిస్తుంది. సాధారణంగా చెప్పబడే శ్రవణ, కీర్తన, స్మరణ, పాదసేవన, అర్చన, వందన, దాస్య, సఖ్య, ఆత్మనివేదనలే కాక శాండిల్య, నారద, మధుసూదన సరస్వతి, శ్రీ శంకర, మధ్వాచార్యుల వారి మతాలను అనుసరించి భక్తిని ఉదాహరణ పూర్వక నిదర్శనంగా నిర్వచించినట్లు పద్యాలను ఎన్నిటినో రచించినాడు. 'భక్తి' అంటే—

సర్వోపాధి వినిర్ముక్తం తత్పరత్వేన నిర్మలమ్
హృషీకేణ హృషీకేశ సేవనం భక్తి రుచ్యతే॥

నారద పంచరాత్రం

అన్నారు.

అట్లే - 'అన్యాభిలాషితా శూన్యం జ్ఞానకర్మాద్యనావృతమ్
ఆనుకూల్యేన కృష్ణానుశీలనం భక్తిరుత్తమా.'
అంటూ భక్తి రసామృత సింధువు చెప్పింది.

"యన్ముహూర్తం క్షణం వాపి వాసుదేవో న చింత్యతే
సా హానిః తన్మహాచ్ఛిద్రం సా భ్రాంతిః సైవవిక్రియా''
అంటూ లింగపురాణం చెప్పింది.

అంతెందుకూ 'మయిచ అనన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ''
అంటూ గీతలో శ్రీకృష్ణుడే స్వయంగా ప్రకటించినాడు. ఇంతకన్నా పూర్వమే-

"యథానద్యః స్యందమానాః సముద్రేఽస్తంగచ్ఛంతినామరూపే విహాయ

తథా విద్వాన్ నామరూపాది విముక్తః పరాత్పరం పురుషముపైతిదివ్యమ్"
అంటూ ముండకోపనిషత్తు సర్వ ఉపాధి వినిర్ముక్తమైన అనన్య శరణాగతిని బోధించింది.

అయితే ఈ భావాలను ఇంకా సులభతరం చేస్తూ 'రక్షిష్యతీతి విశ్వాసః' స్వామి నన్ను రక్షిస్తాడు పో నాకేమి కొదువ అనే ఆత్మ విశ్వాసమే భక్తి అని చెప్పి సామాన్యునికి మరింత బలాన్ని చేకూర్చినారు.

ఇట్లే నారదుడు 'సా తస్మిన్ పరమప్రేమ రూపా' అంటూ భగవంతుని ఎడల పరమమైన ప్రేమే భక్తి అని చెబితే శాండిల్యుడు 'సాపరానురక్తిరీశ్వరీ' అంటూ ఆ భావానికి గట్టి ముడివేసి భక్తి శృంగారాలకు కొత్త అనుబంధాన్ని జత చేసినాడు. అప్పుడు జగత్తు సర్వం ప్రేమమయం, దివ్యరసమయం ఐ గోచరించింది. అందుకే "భక్తి రమృత స్వరూపా చ'' అంటూ చెప్పి ఆ భక్తికి రససిద్ధిని, శాశ్వతత్వాన్ని ఆపాదించినారు పెద్దలు. అందుకే పోతనామాత్యుడు తొలుత-

"హరివార్తలెఱుఁగు వారికి
హరి పదములు దలఁచువారి కనవరతంబున్
హరికథలు వినెడువారికి
మరణాగత మోహసంభ్రమము లేదనఘా.'' (1-433)...

అంటూ చెప్పి తరువాత -

'ఏ విభు వందనార్చనము లే విభు చింతయు నామకీర్తనం
బే విభులీల లద్భుతము లెవ్వని సంశ్రవణంబు సేయ దో
షావలిఁబాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగునండ్రు నే
నా విభు నాశ్రయించెద నఘౌఘ నివర్తను భద్రకీర్తనున్.' (2-60)

అంటూ శ్రీహరి నామ కీర్తన శ్రవణ వందనార్చనాదులు భక్తుల పాపపుంజాన్ని పటాపంచలు చేయగల సామర్థ్యం గలవి అంటూ ప్రకటించి శాండిల్యుడు చెప్పినట్లుగా భక్తి చేయుటకు స్త్రీ పురుష, వయోవృద్ధ, జాతిమత, విద్యావిద్యాది భేదం లేకుండా సమస్త జనావళికి అధికారం ఉంది అని ప్రకటించుటే కాక పోతన-

"కులహీనుఁడు నారాయణ
విలసత్కథనములు దగిలి వినిపించినఁ ద
త్కులహీనతఁ బాసి మహో
జ్జ్వల కులజత్వమును బొందు సన్మునులారా." (1-44)

అంటూ సర్వమానవ సమానాధికారాన్ని హరిసేవలో అంగీకరించినాడు.

పోతనామాత్యుడు భాగవతంలో భక్తికి విశ్వరూపాన్ని కల్పించి విశ్వజనీనం కావించినాడు. అంతేకాక గోపికలు, శ్రీకృష్ణుని ఎడ ప్రదర్శించిన భక్తి విచిత్రమై రాగరంజితమై, మధురమై జాలువారి దైవరతికమైన దివ్య శృంగార రూపంలో మధుర భక్తిగా పరిణతి చెందింది. ఉదాహరణకు శ్రీహరి విరహము సహింపలేని గోపికలు —

ఉ. నీవడవిన్ బవల్ దిరుగ నీ కుటిలాలక లాలితాస్య మి
చ్ఛావిధిఁ జూడకున్న నిమిషంబులు మాకు యుగంబులై చనుం
గావున రాత్రులైనఁ నినుఁ గన్నుల నెప్పుడుఁ జూడకుండ ల
క్ష్మీపర ! ఱెప్పలడ్డముగఁ జేసెనిదేల విధాత క్రూరుఁడై. (10–1049)

అంటూ తలచినవిధానం కడురమణీయమై స్వామి ఎడబాటును క్షణం కూడా సహింపలేని పరమభక్తి రీతిని ధ్వనింపచేస్తుంది. గోపికలు శ్రీకృష్ణుని ప్రియుడుగా భావించిన భావనలో కూడా ఆయన దైవత్వమే ప్రకటితమైంది. ఉదాహరణకు-

"నీ పాదకమలంబు నెమ్మిడగ్గఱఁగాని తరలిపోవంగఁ బాదములు రావు"
"ఈ చరణంబులే యిందునిభానన! సనకాది మునియోగ సరణినొప్పు"

అంటూ రచించిన పద్యాలను పేర్కొనవచ్చు.

గోపీకృష్ణుల ప్రేమను గూర్చి సందేహించిన వారికి సమాధానంగా పోతన తన భాగవతంలో-

'గోపజనములందు గోపికలందును
సకల జంతులందు సంచరించు
నా మహాత్మునకుఁ బరాంగనలెవ్వరు
సర్వమయుడు లీల సలిపెగాక.' (10-1107)

అంటూ సమాధానం చెప్పి, తిరిగి-

'పరమయోగి హృదయ భద్రపీఠంబుల
నుండు మేటి వ్రజవధూత్తరీయ
పీఠమున వసించి పెంపారెఁ ద్రిభువన
దేవలక్ష్మి మేనఁ దేజరిల్ల.' (10-1070)

అంటూ వ్రాసి భక్తజనసులభుడై హరికి యోగివరులూ, గోపాంగనలూ అంటూ భేదం లేదు, భక్తుల ఎదలే ఆతనికి భద్రపీఠాలు అనే సత్యాన్ని స్థాపించినాడు.

భాగవతంలో మధురభక్తి విధానమేకాకుండా "విరోధ భక్తి" అనే ఇంకొక విచిత్రమైన భక్తివిధానం కూడా పరిపూర్ణత్వాన్ని పొందింది. పోతన తన భాగవతంలో ఈ విషయాన్ని గూర్చి-

"బాంధవమునసైనఁ బగనైన వగనైనఁ
బ్రీతినైనఁ బ్రాణభీతినైన
భక్తినైన హరికిఁ బరతంత్రులై యుండు
జనులు మోక్షమునకుఁ జనుదురధిప !" 10-971

అంటూ వ్రాసి, ఇంకా ఆ విషయాన్ని విపులీకరిస్తూ-

'కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్
ప్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్లైన ను
ద్దామధ్యాన గరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా !' 7-18

అంటూ స్పష్టంచేసి ఆయా ఉపాఖ్యానాలను తీర్చిదిద్దినాడు. ప్రహ్లాదుని నోట పోతన గావించిన 'భక్తి' బోధ అనితర సాధ్యమైంది. ఈ సందర్భంలో మూలభాగవతంలో ఉన్న నిగూఢమూ అత్యంత గహనమూ ఐన అద్వైత రహస్య సిద్ధాంతాలను సుబోధతరం చేస్తూ ఎవరి శక్తులను అనుసరించి వారు అర్థస్వారస్యాన్ని గ్రహించే విధానంలో రచన చేసినాడు. "ఇందుగల డందు లేడను సందేహము వల" దంటూ చెప్పుట మాత్రమే కాక ఆయన ఉన్న తావులను తప్పక చూపినట్లు "చక్రి సర్వోపగతుండెందెందు వెదకి చూచిననందందే గలడు" అంటూ సమాధానం చెప్పి వెదుకని వానిదే లోపం అని తీర్మానించినాడు.

అట్లే ప్రహ్లాదుని ముఖతః భక్తిని గూర్చి-

'చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచశీల తపములన్
జిక్కఁడు యుక్తిని భక్తినిఁ
జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ-

'చాలదు భూదేవత్వము
చాలదు దేవత్వ మధిక శాంతత్వంబున్
చాలదు హరి మెప్పింప వి
శాలోద్యములార ! భక్తిచాలిన భంగిన్.' (7-243-44)

అంటూ చెప్పించి 'భక్తి'కి గట్టి ప్రచారం చేసినాడు.

పోతనశైలీ రమ్యత :- భగవదనుగ్రహ విశేషంతో లభించిన కావ్య కళను అపారమైన సాధనతో ఉపాసించిన వాడు పోతన. పూవుకు తావి అబ్బినట్లు పుణ్యవస్తు సంకీర్తనంతో కూడిన భాగవతం పరమ భాగవతోత్తముడైన పోతన చేతిలో రసధునిగా ప్రవహించింది. ఆయా ఘట్టాలను వర్ణించేప్పుడు పోతన మూలాన్ని అతిక్రమిస్తూ రసలోలుప బుద్ధితో తన గంటాన్ని మకరందంలో ముంచి మాధుర్యాన్ని ఒలికిస్తూ సర్వజగత్తునూ రసమయం చేసినాడా ? అని తోస్తుంది. తేనెపెరల వంటి పదబంధాలు శ్రుతికి సుబంధంగా ఒక దానివెంట ఒకటి ఘల్లుఘల్లున స్వామి చిరుగజ్జెల చప్పుడువలె ధ్వనిస్తూ రాసమండలిలో గోపీకృష్ణులవలె పద్యంలో పొందుపడుతూ ఉంటాయి. అందుకే పోతన పద్యం ఒక్కటైనారాని తెలుగువాడు లేడు అంటూ పెద్దలు గట్టి నమ్మకంతో చెప్పగలుగుతున్నారు. పోతన భాగవతారామంలో ఏ కొమ్మను కదల్చినా, ఏ పండును చవి చూచినా, ఏ పువ్వును ఆఘ్రాణించినా, కమ్మని వాసనలతో కూడిన మకరందాన్నే అందిస్తాయి. అందుకే—

"మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు పోవునే మదనములకు"

అంటూ చెప్పి శ్రీహరిభక్తి ఎంతటి రుచ్యమైన పదార్థమో మకరంద మాధుర్యాన్ని అందుకో గలిగిన సహృదయులకు చవి చూపించినాడు. ఇట్లే మరుపు రాని పద్యాలు కోకొల్లలు:

1. 'నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు'-
2. 'కర్ణాంచిత కాకపక్షములతో'-
3. 'శంపాలతికతో మెఱుఁగుదంబుకై వడి'-
4. 'కంటిన్ మున్నురథంబుపై'-
5. 'శ్రీయుతమూర్తి ! యో పురుషసింహము'-
6. 'ప్రాణేశ నీ మంజుభాషలు వినలేని'-
7. 'నమ్మితి నా మనంబున'-
8. 'ఏలా బ్రహ్మపదంబు'-
9. 'గురు పాఠీనమవై'-
10. 'కుప్పించి యెగసిన కుండలంబులకాంతి'-
11. ''అల వైకుంఠ పురంబులో''-
12. 'సిరికింజెప్పడు'-
13. 'వడుగా ఎవ్వరివాడవు'-
14. 'ఆదిన్ శ్రీసతి కొప్పుపై'-
15. 'రవిబింబం ముపమింపఁ బాత్రమగు-'

మొదలైన పద్యాలకు కరుగని రసిక హృదయం ఉండదనుటలో సందేహం లేదు.

అంతేకాదు, పోతనామాత్యుడు గజేంద్రమోక్షణ, ప్రహ్లాద చరిత్రల్లో రచించిన పద్యాలు విశ్వకాలీనతను సంపాదించుకున్నవి. కేవలం గజేంద్రుడు ఒక్కడేకాక ఆపదలో చిక్కుకుని దిక్కుతోచని ప్రతివాడూ సర్వరక్షకుడూ చివరిదిక్కూ ఐన ఆ జగన్నాయకుని శరణు వేడుతూ—

అంటూ చెప్పి శ్రీహరిభక్తి ఎంతటి రుచ్యమైన పదార్థమో మకరంద మాధుర్యాన్ని అందుకోగలిగిన సహృదయులకు చవి చూపించినాడు. ఇట్లే మరుపురాని పద్యాలు కోకొల్లలు:

1. 'నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు'-
2. 'కర్ణాలంబిత కాకపక్షములతో'-
3. 'శంపాలతికతో వెజలదంబులై పడి'-
4. 'కంటిన్ మున్నురథంబుపై'-
5. 'శ్రీయుతమూర్తి ! యో పురుషసింహమ'-
6. 'ప్రాణేశ నీ మంజుభాషలు వినలేని'-
7. 'నమ్మితి నా మనంబున'-
8. 'ఏలా బ్రహ్మపదంబు'-
9. 'గురు పాఠీనమవై'-
10. 'కుప్పించి యెగసిన కుండలంబులకాంతి'-
11. ''అల వైకుంఠ పురంబులో''-
12. 'సిరికింజెప్పడు'-
13. 'వడుగా ఎవ్వరివాడవు'-
14. 'ఆదిన్ శ్రీసతి కొప్పుపై'-
15. 'రవిబింబం ముపమింపఁ బాత్రమగు-'

మొదలైన పద్యాలకు కరుగని రసిక హృదయం ఉండదనుటలో సందేహం లేదు.

అంతేకాదు, పోతనామాత్యుడు గజేంద్రమోక్షణ, ప్రహ్లాద చరిత్రల్లో రచించిన పద్యాలు విశ్వకాలీనతను సంపాదించుకున్నవి. కేవలం గజేంద్రుడు ఒక్కడేకాక ఆపదలో చిక్కుకుని దిక్కుతోచని ప్రతివాడూ సర్వరక్షకుడూ చివరిదిక్కూ ఐన ఆ జగన్నాయకుని శరణు వేడుతూ—

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవేతప్ప నితఃపరంబెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా !"

అంటూ మొరపెట్టుకునే పద్యం ఇది. ఈ విధమైన ఆత్మనివేదనతో కొంత ఉపశమనం పొందిన భక్తుడు మరింత ఉత్సాహాన్ని పుంజుకుని భారమంతా ఆ హరిదే అంటూ దిగివచ్చి కాపాడక ఆ నాథునికి తప్పదన్నట్లుగా-

"ఓ కమలాప్త! యో వరద! యో ప్రతిపక్ష విపక్షదూర! కు
య్యో! కవియోగివంద్య ! సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వర మనోహర! యో విపులప్రభావ! రా
వే కరుణింపవే, తలఁపవే, శరణార్థిని నన్నుఁ గావవే. (7-12)

అంటూ ప్రార్థించినాడు. ఈ పద్యం మాత్రం నిత్య ప్రార్థనగా చదువుకునే తెలుగువారు చాలామంది ఉన్నారు. ఇట్లే ప్రహ్లాద చరిత్రలోని పద్యాలల్లో ప్రధానంగా

'కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ'

అనే పద్యమూ "కలఁడంభోధిఁ గలండు గాలిఁ గలఁడాకాశంబునం గుంభినిన్" అనే పద్యం రెండూ వీధిబళ్లల్లో, పల్లెటూళ్లలో ఓనమాలు నేర్చిన ప్రతి పిల్ల వానితో తప్పక కంఠస్థం చేయించే ఆచారం ఉండేది మొన్న మొన్నటివరకు.

శ్రీకృష్ణావతార సందర్భంలో యశోదాదేవిపై పోతన వర్ణించిన అభిమానం ఎనలేనిది. యశోదా కృష్ణుల లీలలు చదువుతూ ఉంటే మోడులు సయితం చిగురించవలసిందే।

తుంటరి చేష్టలు మానుమంటూ శ్రీకృష్ణుని రోలి గట్టి యశోద ప్రయత్నించగా గజ్జెలు ఘల్లని మ్రోగుతూ ఉండే వేగంతో పరుగులు పెట్టే కొడుకును వెంబడిస్తున్న యశోదను—

'స్తనభారంబువడన్ని క్రుస్సి యసదై జవ్వాడు మధ్యంబుతో
జనిత స్వేదముతోఁ జలత్కబరితో స్రస్తోత్తరీయంబుతో
వనజాతేక్షణ కూడఁబాఱె తిరిగెన్ వారించుచున్ వాకిటన్
ఘనయోగీంద్ర మనంబులన్ వెనుకొనంగా లేని లీలారతున్.' 10-369

అంటూ వర్ణించాడు. మహాయోగీంద్రుల మనస్సులే వెంబడించలేని ఆ పరబ్రహ్మమూర్తిని బంధిస్తానంటూ యశోద వెంబడించిన దృశ్యాన్ని తల్లీ కొడుకుల లీలను హేలగా మనకు దర్శింప చేస్తూనే ఆ తల్లి ధన్యతను చాటినాడు. సూచన మాత్రంగానే కాకుండా స్పష్టంగా ఆ దేవి సౌభాగ్యాన్ని గూర్చి-

"జగదధీశ్వరునకుఁ జన్నిచ్చు తల్లిగా
నేమి నోము నోఁచె నీ యశోద"

అంటూ ప్రశంసించి, చివరకు—

"చిక్కఁడు సిరి కౌగిటిలోఁ
జిక్కఁడు సనకాది యోగి చిత్తాబ్జములన్
జిక్కఁడు శ్రుతిలతికావళి
జిక్కెనతఁడు లీలఁ దల్లిచేతన్ ఱోలన్."

అంటూ వ్రాసి అందుకు కారణాన్ని గూర్చి—

'జ్ఞానులచే మౌనులచే
దానులచే యోగసంవిధానుల చేతన్
బూని నిబద్ధుండగునే
శ్రీనాథుఁడు భక్తియుతుల చేతం బోలెన్.' 10-388

అంటూ చెప్పి యశోదను పరమ భక్తకోటిలో చేర్చినాడు. శ్రీహరిలీలావతారాభి వర్ణనంలో-

'ఓ యమ్మ ! నీ కుమారుడు
మాయిండ్లను పాలు పెరుఁగు మననీఁడమ్మా
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభులాన మంజులవాణీ !'

అంటూ గోపికలు యశోదకు నివేదించిన విధానం సిసలైన గ్రామీణ వాతావరణాన్ని కన్నుల కట్టిచేస్తుంది.

ఇట్లే శ్రీకృష్ణుడు తాను మన్నుతినలేదంటూ-

'అమ్మా ! మన్ను దినంగ నే శిశువునో యాఁకొంటినో వెఱ్ఱినో'
అని అంటూ తనతప్పులేమికి రుజువుగా నోరు తెరిచినప్పుడు ఆ నోట బ్రహ్మాండాన్ని దర్శించిన యశోద స్థితిని వర్ణిస్తూ-

"కలయో వైష్ణవమాయయో యితర సంకల్పార్థమో సత్యమో'' అంటూ మహాశ్చర్యంలో మునిగినట్లు చెప్పిన పద్యం, సందేహాద్భుతాలకు కూడలిపట్టై అలంకారోక్తితో పరిపుష్టమైన అద్భుతరసంగా పరిణమించింది.

ఇట్లే రుక్మిణీ కల్యాణం కల్యాణాత్మకమైన విష్ణుకథలన్నిటిలో తెలుగువారి మన్ననలను అందుకున్నది. సాధారణంగా ఉత్తమ వర లాభాన్ని కాంక్షించి యుక్త వయస్క ఐన కన్యచేత పోతనకృత భాగవంతలోని రుక్మిణీ కల్యాణాన్ని పారాయణం చేయించడంకానీ, కులబ్రాహ్మణుడు పఠించగా నిష్ఠతో వినడం కానీ ఈనాటికీ ఆచారంలో ఉంది. ఈ సందర్భంలో రుక్మిణీదేవి "నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్'' అంటూ ఆదిమ దంపతులను గూర్చి అందు ప్రధానంగా సర్వశుభంకరి ఐన గౌరీదేవిని కొల్చిన ఈ పద్యం తప్పకుండా వివాహ మంగళ కౌతుకాన్ని అభిలక్షించి కన్యచేత పఠింప చేయడం జరుగుతుంది. దీన్నిబట్టి పోతనకృత భాగవతం ఆర్ష గ్రంథంవలె పరమ ప్రామా

ణీకమై మరింత పూజ్యతను సంతరించుకున్నది. కల్యాణాత్మకమైన వస్తు శ్రవణ పఠనాదు లెప్పుడూ శుభాలనే వర్షిస్తాయి.

పోతనామాత్యుడు మధురభక్తినీ, శృంగార రసాన్నీ, శ్రీకృష్ణలీలాది వర్ణనం చేయడంలోనేకాదు; పాత్రోచితమైన సంభాషణలు కల్పించడంలో కూడా నేర్పరి. ఉదాహరణకు-

1. 'అన్నా! ఫల్గున! భక్తవత్సలుండు బ్రహ్మణ్యుండు'- 1-348
2. 'హరిజూడన్ నరుదేగినాడు'- 1-331
3. 'మన సారథి మన సచివుడు'- 1-356
4. 'ఉద్రేకంబున రారు శస్త్రధరులై'- 1-161
5. 'ఓడితివో శత్రువులకు, నాడితివో'- 1-352
6. 'అన్నవు నీవు చెల్లెలికి నక్కట! మాడలు చీరలిచ్చుటో'- 10-23
7. 'రా పూర్ణచంద్రిక! రా గౌతమీ గంగ'- 10-601
8. 'వీరెవ్వరు కృష్ణులుగాదా! యెన్నడును వెన్నగానరట'- 10-372

మున్నగు పద్యాలెన్నో పేర్కొనవచ్చు.

అట్లే జానపద వాతావరణాన్ని అచ్చంగా కండ్లకు కట్టినట్లు రచన చేస్తూ పోతన-

'కంచుకములు తలచుట్లును
గాంచనభూషాంబరములుఁ గడు మెఱయగ నే
తెంచిరి గోపకులందఱు
మంచి పదార్థములు గొనుచు మాధవుఁజూడన్'

అంటూ వారి వేష భూషణాదులను వర్ణించినాడు.

స్త్రీల సంబరాన్ని వర్ణిస్తూ

"ఏమి నోముఫలమొ యింత ప్రొద్దొకవార్త
వింటిమబలలార! వీనులలర

మస యశోద చిన్ని మగవానిఁ గనెనఁట
చూచివత్తమమ్మ! సుదతులార!"

అంటూ రచించినాడు. తరువాత ఆ వచ్చిన స్త్రీలు

"పాపనికి నూనెఁ దలయంటి పసుపుఁబూసి
బోరుకాడించి హాతిరక్ష పొమ్మటంచు
జలములొకకొన్ని చుట్టిరాఁజల్లి తొట్ల
నునిచి దీవించి పాడిరయ్యువిదలెల్ల." (10-188)

అంటూ అనాటి వారి ఆచార వ్యవహారాలను తప్పక చెప్పినాడు. పోతన తన భాగవతంలో ప్రధానంగా కేవలం తన భక్తులేకాక పాపులు సయితం తన అనుగ్రహ విశేషంచేత పరమపదాన్ని పొందుతారన్న నమ్మకాన్ని లోకానికి కలిగిస్తూ-

బాలఘాతిని ఐన పూతన మరణ సందర్భాన్ని పురస్కరించుకుని-

"హరి దనమీఁదం బదములు
గరములు నిడి చన్నుఁగుడిచి కదిసినమాత్రన్
హరిజనని పగిదిఁ బరగతి
కరిగెను దురితములు వాసి యసురాంగనయున్." (10-239)

అంటూ చెప్పి ఆ మహాపాతకి సయితం స్వామికి చన్నిచ్చిన ఫలంతో పరమ పదాన్ని పొందగలిగిందని నిర్ధరించినాడు.

అట్లే అఘాసురుని గూర్చి-

"తనరూపొకమాత్రైనను
మనమున నిడుకొనినఁ బాపమంతయుఁదనలో
గొని చను హరి తను మ్రింగిన
దనుజునిఁ గొనిపోవకున్నె తనలోపలికిన్." (10-487)

అంటూ రచించి సర్వపాప ప్రమోచనీయమైనది శ్రీహరి అనుగ్రహ విశేషం, నశ్వరమైన శరీరం నశింపగా జీవుడు పరమాత్మను చేరుట అన్నది సామాన్యమైన

విషయంకాదు, అట్టి పరమ పదాన్ని స్వామిచేతి స్మృతివలన పాపస్వభావులు కూడా పొందగలుగుట భాగవతం చెప్పిన విశేషం.

ఈవిధంగా భాగవత పఠనం జ్ఞానదాయకమూ, సహృదయులకు రసానందకరమూ, అందరికీ ఉత్తమ ఫలదాయకమూ ఐనట్టిది. అందుకే పోతన భాగవత పంచశతిని పురస్కరించుకుని ఈ ప్రచురణం సంకల్పింప బడింది.

ముగింపుకు ముందు ఒక్కమాట. నా పూర్వజన్మ సుకృత విశేషం ఎట్టిదో కాని పోతన పంచశతిని జరుపుకునే శుభవేళ ఆయన భాగవతంలోని రసగుళికలు దాదాపు 500 సేకరించే భాగ్యం నాకు దక్కింది. సమర్థులెందరో ఉండగా ఈ విశిష్టమైన అవకాశాన్ని నాకు కల్పించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పెద్దలకు సర్వదా కృతజ్ఞురాలను. ద్వాదశస్కంధాలతో కూడిన తెలుగు భాగవతం అంతా పోతనకృతం కాదు. మొదటి రెండూ, మూడూ, నాలుగులో కొంత భాగం, ఆ తరువాత 7, 8, 9, మళ్లా దశమస్కంధ ఉత్తర భాగంలో కొంతవరకే పోతన తెలుగు చేసిన గ్రంథభాగం. అందుకే తొలుత ఒక వేయి పద్యాలు ఎన్నిక చేయవలసి వచ్చింది. తరువాత పూజ్యులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు, సోదరులు శ్రీ దాశరథి గారు, శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి గారు, డా॥ పేర్వారం జగన్నాథరావు గారు నేనూ కలిసి పరిశీలించినాము. అనుకోకుండా నేను చేసిన ఎన్నికతో మా అందరికీ ఏకీభావం కుదిరింది. ఐదు వందలంటూ ఖచ్చితంగా సంఖ్యానియమం లేకుండా కొన్ని తగ్గినా మంచి పద్యాలే ఉంచవలెనంటూ పెద్దలు శ్రీ రామానుజరావుగారు సూచిస్తూ తదితర భారం అంతా నాపై పెట్టినారు.

ఆమోదం కుదిరిన పద్యాలన్నీ ఒకచోట కూర్చినప్పుడు నాకెందుకో రుచించలేదు. ఆణిముత్యాలవంటి పద్యాలు శీర్షికలు లేకుండా కుప్పగా కూర్చినా ప్రకరణశుద్ధిలేక పాఠకునికి చర్వితచర్వణంగా విసుగు కలిగించే ప్రమాదం కనిపించింది. అందుకే బాగా ఆలోచించి పోతనకృత భాగవత గ్రంథం అంతా సందర్భశుద్ధితో సంక్షిప్త భాగవత రూపంలో కుదిరేందుకు ప్రయత్నించినాను. అందుకే ఈ పద్యాలను పన్నెండు గుచ్ఛాలుగా విభజిస్తూ అవతారికా రూపంతో ఇష్టదేవతా ప్రార్థన, భాగవత ప్రాశస్త్యం, పోతన వ్యక్తిత్వం మొదలైన అంతా

లున్న పద్యాలను మొదటి గుచ్ఛంగా పేర్కొన్నాను. అట్లే రెండవ దాంట్లో శ్రీహరి ప్రశంసాభివర్ణన పద్యాలున్నవి. మూడవ గుచ్ఛం సముద్రమథనం. నాల్గవది ప్రహ్లాదచరిత్రం. అయిదవది గజేంద్రమోక్షం, ఆరవది వామనావతార ఘట్టం, ఏడవది శ్రీరామచరిత్ర కథనం, ఎనిమిదవది శ్రీకృష్ణలీలావతార ఘట్టం. తొమ్మిది రుక్మిణీ కల్యాణం, పది నరకాసురవధోపాఖ్యానం, పదకొండవది నానా వస్తు సంకీర్ణ గుచ్ఛం. పన్నెండవది శ్రీకృష్ణమహిమాభివర్ణన గుచ్ఛం. ఈ విధంగా గుచ్ఛ విభజనం చేయబడింది. ఈ విధమైన ఏర్పాటులో భాగవతంలోని స్కంధాల క్రమంలో కాని, పద్య సంఖ్యాక్రమంలో కాని పూర్వాపరనియమాన్ని పాటించలేదు. సందర్భశుద్ధినీ ప్రకరణాది ఔచిత్యాన్నీ పురస్కరించుకుని ఒక సంవిధానం కల్పిస్తూ ఏరిన పద్యాలకు వస్తుగతంగా నిండుతనాన్ని కల్పించే తలంపుతో కొంత శ్రమైనా ఈ పని చేయవలసి వచ్చింది. ఇంతేకాక కథాగమనానికి అతుకని కొన్ని పద్యాలు రసగుళికల వంటివాటినీ, పోతన అభిమానంతో వర్ణించిన ఆశ్రమ, నదీ, సముద్ర, స్వర్గ, ఋతువర్ణనాదులనూ ఒక్కచో కూర్చి సంకీర్ణ గుచ్ఛంగా పేర్కొన్నాను.

భాగవతం అనగానే భక్తుల చరిత్రలేకాక పరమ పురుషుడైన శ్రీకృష్ణ భగవానుడు స్మృతి పథంలో ప్రధానంగా మెదుల్తాడు. అందుకే శ్రీహరి ప్రశంసతో ప్రారంభించిన ఈ సంక్షిప్త భాగవతాన్ని శ్రీకృష్ణ ప్రశంసాభివర్ణన గుచ్ఛంతో పూర్తి కావించినాను. సంక్షిప్తరూపంలో ఉన్న ఈ పోతన భాగవతానికి 'మహాభాగవత కల్పకుసుమమాల' అనే పేరుంచితే ఉచితంగా ఉంటుందని తోచింది. త్వరలోనే నూరు పద్యాలకు సరళంగా తాత్పర్య రూపంలో వ్యాఖ్యానం వ్రాయ వలసిన బాధ్యత కూడా పెద్దలు నాపై ఉంచినారు. భగవంతుని లీలావిలాసం అమోఘం. పోతన భక్తాగ్రణి; గ్రంథం హరిలీలా విలసితం. నా ఇష్టదైవం శ్రీహరి. ఆ జగన్నాయకుడు నన్ను అనుగ్రహించి నన్నొక ఉపకరణంగా స్వీకరించి నాచేత ఈ పని చేయింప సంకల్పించినప్పుడు కాదనే సామర్థ్యం నాకు లేదు. అందుకే ఆ పుస్తకం కూడా త్వరలో అందిస్తానంటూ పెద్దలకు మరొక్కసారి నమస్కరిస్తున్నాను.

ఇట్లు

పి. యశోదా రెడ్డి.

ఓమ్

మహాభాగవత కల్పకుసుమమాల

ప్రథమ గుచ్ఛము

పోతన కృత ఇష్టదేవతాస్తుతి

శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో
ద్రేక స్తంభకుఁ గేళిలోలవిలసద్దృగ్జాల సంభూత నా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్. 1

ఉ. వాలిన భక్తి మ్రొక్కెద నవారిత తాండవ కేళికిన్ దయా
శాలికి శూలికిన్ శిఖరిజాముఖపద్మ మయూఖమాలికిన్
బాలశశాంకమౌళికిఁ గపాలికి మన్మథగర్వ పర్వతో
న్మూలికి నారదాది మునిముఖ్య మనస్సరసీరుహాళికిన్. 2

ఉ. ఆదరమొప్ప మ్రొక్కిడుదు నద్రిసుతాహృదయానురాగసం
పాదికి దోషభేదికిఁ బ్రపన్నవినోదికి విఘ్నవల్లికా
చ్ఛేదికి మంజువాదికి నశేషజగజ్జననందవేదికిన్
మోదకఖాదికిన్ సమదమూషకసాదికి సుప్రసాదికిన్. 3

ఉ. క్షోణితలంబు నెన్నుదురు సోఁకఁగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయసుందరవేణికి రక్షితానత

శ్రేణికిఁ దోయజాతభవ చిత్తవశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామ శుక వారిజ పుస్తక రమ్యపాణికిన్. 4

ఉ. అమ్మలఁగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడిపుచ్చినయమ్మ తన్ను లో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యీవుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్. 5

మ. హరికిన్ బట్టపుదేవి పున్నెములప్రో వర్థంబు పెన్నిక్క చం
దురు తోఁబుట్టువు భారతీగిరిసుతల్ తోనాడు పూఁబోణి తా
మరలం దుండెడి ముద్దరాలు జగముల్ మన్నించు నిల్లాలు భా
సురతన్ లేములు వాపు తల్లి సిరియిచ్చున్ నిత్యకల్యాణముల్. 6

సీ. మెఱుఁగు చెంగట నున్న మేఘంబు కైవడి
నువిద చెంగటనుండ నొప్పువాఁడు
చంద్రమండల సుధాసారంబు పోలిక
ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు
వల్లియుతతమాల వసుమతీజముభంగి
బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు
నీలనగాగ్ర సన్నిహితభానుని భంగి
ఘనకిరీటము దలఁ గల్గువాఁడు

ఆ. పుండరీకయుగముఁ బోలు కన్నులవాఁడు,
వెడఁద యురమువాఁడు విపులభద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁడొకరుఁడు నా
కన్నుఁగవకు నెదురఁగానఁబడియె. 7

పోతన వ్యక్తిత్వము

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరముఁ బాసి కాలుచే
సమ్మెటవాటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్. 8

క. పలికెడిది భాగవతమఁట,
పలికించువిభుండు రామభద్రుండఁట నే
బలికిన భవహరమగునఁట,
పలికెద వేఱొండుగాథఁ బలుకఁగ నేలా. 9

ఆ. భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు,
శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధజనులవలన విన్నంత కన్నంత,
తెలియవచ్చినంత తేటపఱుతు. 10

క. కొందఱికిఁ దెనుఁగు గుణమగుఁ,
గొందఱికిని సంస్కృతంబు గుణమగు రెండున్
గొందఱికి గుణములగు నే
నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్. 11

మ. ఒనరన్ నన్నయ తిక్కనాదికవు లీ యుర్విం బురాణావళుల్
తెనుఁగుల్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనింగించి నా
జననంబున్ సఫలంబు చేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్. 12

తే. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని,
నోరునొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగా దలఁపఁడేని,
గలుగనేటికిఁ దల్లుల కడుపుచేటు. 13

భాగవత ప్రశంస

సీ. శ్రీమంతమై మునిశ్రేష్ఠకృతంబైన
భాగవతంబు సద్భక్తితోడ
వినఁగోరువారల విమలచిత్తంబులఁ
జెచ్చెర నీశుండు చిక్కుఁ గాక
యితర శాస్త్రంబుల నీశుండు చిక్కునె?
మంచివారలకు నిర్మత్సరులకుఁ
గపటనిర్ముక్తులై కాంక్ష సేయక యుండు
వగలియుండుట మహాతత్త్వబుద్ధి
తే. పరఁగ నాధ్యాత్మికాది తాపత్రయంబు,
నడఁచి పరమార్థభూతమై యఖిల సుఖద
మై సమస్తంబుగాకయు నయ్యునుండు,
వస్తువెఱుగంగఁ దగు భాగవతమునందు. 14

ఆ. వేదకల్పవృక్షవిగళితమై, శుక
ముఖసుధాద్రవమున మొనసియున్న
భాగవతపురాణఫల రసాస్వాదన
పదవిఁ గనుఁడు రసికభావవిదులు. 15

ప్రథమ గుచ్ఛము

షష్ఠ్యంతములు

ఉ. హారికి నందగోకుల విహారికిఁ జక్రసమీరదైత్య సం
హారికి భక్తదుఃఖపరిహారికి గోపనితంబినీ మనో
హారికి దుష్టసంపదపహారికి ఘోషకుటీపయోఘృతా
హారికి బాలకగ్రహ మహాసురదుర్వనితా ప్రహారికిన్. 16

ఉ న్యాయికి భూసురేంద్రమృతనందనదాయికి రుక్మిణీ మన
స్థాయికి భూతసమ్మద విధాయికి సాధుజనానురాగ సం
ధాయికిఁ బీతవస్త్ర పరిధాయికిఁ బద్మభవాండ భాండ ని
ర్మాయికి గోపికానివహమందిరయాయికి శేషశాయికిన్. 17

నైమిశారణ్య వర్ణనము

క. పుణ్యంబై మునివల్లభ
గణ్యంబై కుసుమఫలనికాయోత్థిత సౌ
గుణ్యమయి నైమిశాఖ్యా
రణ్యంబు నుతింపఁదగు నరణ్యంబులలోన్. 18

శ్రీశుక ప్రశంస :

తరల. శుకుఁడు గోఁచియులేక పైఁజనఁ జూచి తోయములందు ల
జ్జకుఁ జలింపక చీరలొల్లక చల్లులాడెడి దేవక
న్యలు ''హా శుక'' యంచు వెన్కఁ జనంగ వ్యాసుని జూచి యం
శుకములన్ ధరియించి సిగ్గున ప్రుక్కి రందఱు ధీనిధీ! 19

మ సముఁడై యెవ్వఁడు ముక్తకర్మచయుఁడై సన్న్యాసియై యొంటిఁబో
వ మహాభీతి నాహో కుమార యనుచున్ వ్యాసుఁడు సీరంగ వృ

క్షములుం దన్మృయతం బ్రతిధ్వనులు సక్కం జేసె మున్నట్టి భూ
తమయున్ మ్రొక్కెద బాదరాయణిం దపోధన్యాగ్రణిన్ ధీమణిన్. 20

వేదవ్యాస ప్రశంస

మ. అవనీచక్రములోన నే పురుషుం డే యామ్నాయమున్ విన్న మా
ధవుపై లోకశరణ్యుపై భవములం దప్పించఁగాఁ జాలు భ
క్తివిశేషంబు జనించు నట్టి భువన క్షేమకరంబైన భా
గవతామ్నాయము బాదరాయణుఁడు దాఁ గల్పించె నేర్పొప్పఁగన్. 21

ఉ. ధాతవు భారతశ్రుతివిధాతవు వేదపదార్థజ్ఞాత వి
జ్ఞాతవు గామముఖ్యరిపుషట్కవిజేతవు బ్రహ్మతత్త్వ ని
ర్ణేతవు యోగినేతవు వినేతవు నీవు చలించి చెల్లరే
కాతరు కైవడిన్ వగవఁ గారణమేమి పరాశరాత్మజా ? 22

ఉత్తమ కావ్యవస్తు ప్రశంస

ఉ. అంచితమైన ధర్మచయ మంతయుఁ జెప్పితి వందులోన నిం
చించక గాని విష్ణుకథలేర్పడఁ జెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరిఁ గోరి నుతింపమి నార్యపూజితా ! 23

మ. హరినామస్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ
సురుచిభ్రాజితమైన మానస సరస్స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ
హరినామస్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ
కరమైయుండ దయోగ్య దుర్మదసద త్కాకోల గర్తాకృతిన్. 24

పౌరాణిక (సూత) ప్రశంస

మ. వరగోవింద కథాసుధారస మహా వర్షోరుధారా పరం
పరలంగాక బుధేంద్రచంద్ర ! యితరోపాయానురక్తిం బ్రవి

స్తర దుర్దాంతదురంత దుస్సహజనుస్సంభావితానేక దు
స్తర గంభీర కఠోరకల్మష కనద్దావానలం బాఱునే. 25

సీ. హరినామకథన దావానల జ్వాలలఁ
గాలవే ఘోరాఘ కాననములు
వైకుంఠదర్శన వాయుసంఘంబుచేఁ
దొలఁగవే బహుదుఃఖ తోయదములు
కమలనాభధ్యాన కంఠీరవంబుచేఁ
గూలవే సంతాప కుంజరములు
నారాయణ స్మరణ ప్రభాకరదీప్తిఁ
దీఱవే షడ్వర్గ తిమిరతతులు
ఆ. నళిననయనభక్తి నావచేఁగాక సం
సార జలధిదాఁటి చనఁగరాదు
వేయునేల మాకు విష్ణుప్రభావంబు,
దెలుపవయ్య సూత ! ధీసమేత ! 26

హరికథా ప్రశంస

క. భూషణములు వాణికి నఘ
పేషణములు మృత్యుచిత్త భీషణములు హృ
త్తోషణములు గల్యాణ వి
శేషణములు హరిగుణోపచితభాషణముల్. 27

నారద ప్రశంస

క. వాయించు వీణ నెప్పుడు
మ్రోయించు ముకుంద గీతములు జగములకున్
జేయించుఁ జెవులపండువు,
హాయించు నఘాళి నిట్టి మతి మఱి గలఁడే ! 28



మహాభాగవత కల్పకుసుమమాల

ద్వితీయ గుచ్ఛము

శ్రీహరి ప్రశంసాభివర్ణనం

తరల. పరమపూరుషుఁడొక్కఁ డాద్యుఁడు పాలనోద్భవ నాశముల్
సొరిదిఁజేయు ముకుంద పద్మజ శూలి సంజ్ఞలఁ బ్రాకృత
స్ఫురిత సత్త్వరజస్తమంబులఁ బొందు నందు శుభస్థితుల్
హరి చరాచరకోటి కిచ్చు ననంత సత్త్వ నిరూఢుఁడై. 1

చ. జగదధినాథుఁడైన హరి సంతతలీలలు నామరూపముల్
దగిలి మనోవచోగతులఁ దార్కికచాతురి యెంతగల్గినన్
మిగిలి కుతర్కవాది దగ్గ మేరలుచేసి యెఱుఁగనేర్చునే
యగణిత నర్తనక్రమము నజ్ఞుఁడెఱిఁగి నుతింపనోపునే. 2

ఉ. ఇంచుక మాయలేక మది నెప్పుడు వాయని భక్తితోడ వ
ర్తించుచు నెవ్వఁడేని హరి దివ్యపదాంబుజ గంధరాశి సే
వించు సతం డెఱుంగు నరవిందభవాదులకైన దుర్లభో
దంచితమైన యా హరి యుదార మహాద్భుత కర్మమార్గముల్. 3

క. ధీరులు నిరపేక్షులు నా
త్మారాములు నైన మునులు హరిభజనము ని
ష్కారణము చేయుచుందురు,
నారాయణుఁ డట్టివాఁడు నవ్యచరిత్రా ! 4

ద్వితీయ గుచ్ఛము

క. విను మీ సంసారంబను
వననిధిలో మునిఁగి కర్మవాంఛలచే వే
దనఁ బొందెడువానికి వి
ష్ణుని గుణవర్ణనము తెప్పసుమ్ము మునీంద్రా ! 5

క. హరివార్త లెఱుఁగువారికి,
హరిపదములు దలఁచువారి కనవరతంబున్
హరికథలు వినెడివారికి,
మరణాగత మోహసంభ్రమము లే దనఘా ! 6

సీ. ఎవ్వని గుణజాల మెన్న జిహ్వాలులేక
నళినగర్భాదు లనంతుఁ డంద్రు
కోరెడు విబుధేంద్రకోటి నొల్లక లక్ష్మి
ప్రార్థించె నెవ్వని పాదరజము
బ్రహ్మ యెవ్వని పాదపద్మంబు గడిగిన
జలము ధన్యత నిచ్చె జనుల కెల్ల
భగవంతుఁ డనియెడి భద్రశబ్దమునకు
నెవ్వఁ డర్థాకృతి నేపుమిగులు
ఆ. నే మహాత్ము నాశ్రయించి శరీరాది
సంగకోటినెల్ల సంహరించి
ప్రాభవమున మునులు పారమహంస్యంబు,
నొంది తిరిగి రాకయుండు రెలమి. 7

తరల. హరి నెఱంగక యింటిలో బహుహాయినంబులు మత్తుఁడై
పొరలుచుండెడి వెఱ్ఱి ముక్తికిఁ బోవనేర్చునె? వాఁడు సం-

సరణముం బెడబాయఁ డెన్నఁడు సత్య మా హరినామ సం
స్మరణ మొక్క ముహూర్తమాత్రము సాలు ముక్తిదమౌ నృపా! 8

క. హరిమయము విశ్వమంతయు,
హరి విశ్వమయుండు సంశయము పనిలే దా
హరిమయము గాని ద్రవ్యము,
పరమాణువు లేదు వంశపావన! వింటే. 9

మ. హరిఁ జింతింపక మత్తుఁడై విషయ చింతాయత్తుఁడై చిక్కి వా
సరముల్ ద్రొబ్బెడు వాఁడు కింకర గదాసంతాడితోరస్కుఁడై
ధరణీశోత్తమ! దండభృన్నివసన ద్వారోపకంఠోగ్ర వై
తరణీ వహ్నిశిఖా పరంపరలచే దగ్ధుండు గాకుండునే? 10

సీ. విష్ణు కీర్తనములు వినని కర్ణంబులు
కొండల బిలములు కువలయేశ!
చక్రి పద్యంబులు చదువని జిహ్వలు
కప్పల జిహ్వలు కౌరవేంద్ర!
శ్రీమనోనాథు వీక్షింపని కన్నులు
కేకి పింఛాక్షులు కీర్తియుత!
కమలాక్షు పూజకుఁ గాని హస్తంబులు
శవము హస్తంబులు సత్యవచన!

ఆ. హరిపద తులసీదళామోదరతి లేని
ముక్కు పందిముక్కు మునిచరిత్ర!
గరుడగమను భజనగతి లేని పదములు,
పాదపముల పాదపటల మనఘ! 11

ద్వితీయ గుచ్ఛము

సీ. నారాయణుని దివ్య నామాక్షరములపైఁ
గరఁగని మనములు కఠిన శిలలు
మురవైరి కథలకు ముదితాశ్రు రోమాంచ
మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడుని యౌదల నున్న
కనక కిరీటంబు గట్టిమోపు
మాధవార్పితముగా మనని మానవు సిరి
వన దుర్గ చంద్రికా వైభవంబు
ఆ. కైటభారి భజన గలిగి యుండని వాఁడు,
గాలిలోననుండి కదలు శవము
కమలనాభు పదము గననివాని బ్రతుకు,
పసిఁడికాయలోని ప్రాణిబ్రతుకు. 12

మ. పరుఁడై యీశ్వరుఁడై మహామహిముఁడై ప్రాదుర్భవ స్థాన సం
హరణ క్రీడనుఁడై త్రిశక్తి యుతుఁడై యంతర్గత జ్యోతియై
పరమేష్ఠి ప్రముఖామరాధిపులకున్ బ్రాపింప రాకుండు దు
స్తర మార్గంబునఁ దేజరిల్లు హరికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్. 13

ఉ. ఏ విభు వందనార్చనము లే విభు చింతయు నామకీర్తనం
బే విభు లీల లద్భుతము లెవ్వని సంశ్రవణంబు సేయ దో
షావలిఁ బాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగు సంద్రుడు నే
నా విభు నాశ్రయించెద నఘౌఘ నివర్తను భద్రకీర్తనున్. 14

చ. తపములు సేసియైన మఱి దానము లెన్నియుఁ జేసియైన నే
జపములు సేసియైన ఫల సంచయ మెవ్వనిఁ జేర్పకున్న హే
యపదములై దురంత విపదంచిత రీతిగ నొప్పుచుండు న
య్యపరిమితున్ భజించెద నఘౌఘ నివర్తను భద్రకీర్తనున్. 15

మ. అణువో కాక కడు న్మహావిభవుఁడో యచ్ఛిన్నుఁడో ఛిన్నుఁడో
గుణియో నిర్గుణియో యటంచు విబుధుల్ గుంఠీభవ త్తత్త్వమా
ర్గణులై యే విభు పాదపద్మ భజనోత్కర్షంబులన్ దత్త్వవీ
క్షణముం జేసెద రట్టి విష్ణుఁ బరమ న్ సర్వాత్మ సేవించెదన్. 16

శా. నీ పాదాబ్జము బ్రహ్మపూజ్యము గదా ! నీ సేవ సంసార సం
తాపధ్వంసిని యౌఁ గదా ! సకల భద్రశ్రేణులం బ్రీతితో
నాపాదింతు గదా ! ప్రపన్నులకుఁ గాలాధీశ ! కాలంబు ని
ర్వ్యాపారంబు గదయ్య ! చాలరుగదా ! వర్ణింప బ్రహ్మాదులున్. 17

మ. అరవిందాక్ష పదారవింద మకరందాసక్తులై యున్న స
త్పురుష శ్రేష్ఠుల వృత్తముల్ వినక దుర్బుద్ధిన్ విలంఘించి దు
ర్భర వార్తా కథన ప్రపంచములు గర్ణప్రాప్తముల్ సేసి వా
సరముల్ వ్యర్థతఁ ద్రొబ్బుచుండఁ జన దీ సంసార మోహంబునన్. 18

క. మందునకు మందబుద్ధికి
మందాయువునకు నిరర్థమార్గునకును గో
వింద చరణారవింద మ
రందముఁ గొనఁ దెఱపిలేదు రాత్రింబవలున్. 19

క. కులహీనుఁడు నారాయణ
విలసత్కథనములు దగిలి వినిపించినఁ ప
త్కులహీనతఁ బాసి మహో
జ్జ్వల కులజత్వమును బొందు సన్మునులారా ! 20

చ. నగుమొగమున్ సుమధ్యమును నల్లనిదేహము లచ్చికాటప
ట్టగు నురమున్ మహాభుజము లంచిత కుండలకర్ణముల్ మదే
భగతియుఁ నీలవేణియుఁ గృపారస దృష్టియుఁ గల్గు వెన్నుఁ డి
మ్ముగఁ బొడసూపుఁ గాతఁ గను మూసిన యప్పుడు విప్పునప్పుడున్. 21



మహాభాగవత కల్పకుసుమమాల

తృతీయ గుచ్ఛము

(సముద్ర మథనము)

క. రాజీవ పత్ర లోచన !
రాజేంద్ర కిరీటఘటిత రత్న మరీచి
భ్రాజిత పాదాంభోరుహ !
భూజనమందార ! నిత్య పుణ్యవిచారా ! 1

కూర్మావతార వర్ణనము

సీ. సవరనై లక్షయోజనముల వెడలుపై
కడుఁ గఠోరం బైన కర్పరమున
నదనైన బ్రహ్మాండమైన నాహారించు
ఘనతరంబగు ముఖ గహ్వరంబు
సకల చరాచర జంతురాసుల నెల్ల
మ్రింగి లోఁగొనునట్టి మేటి కడుపు
విశ్వంబుపై వేఱు విశ్వంబు పైఁబడ్డ
నాఁగినఁ గదలనియట్టి కాళ్ళు
తే. వెలికి లోనికిఁ జనుదెంచు విపులతుండ
మంబుజంబులఁ బోలెడి యక్షియుగము
సుందరంబుగ విష్ణుండు సురలతోడి
కూర్మి చెలువొంద నొక మహాకూర్మ మయ్యె. 2

మ. కమఠంబై జలరాశిఁ జొచ్చి లఘు ముక్తాశుక్తి చందంబునన్
నసు దద్రీంద్రము నెత్తె వాసుకి మహానాగంబుతో లీలతో
నమరేంద్రాదులు మౌళికంపములతో నౌ నౌఁ గదే బాపురే
కమలాక్షా! శరణంచు భూ దిశలు నాకాశంబునున్ మ్రోయఁగాన్. 3

సముద్రమథన ప్రారంభము

క. తరిగాండ్రలోన నొకఁడఁట,
తరికడవకుఁ గుదురు నొకఁడు త్రాడును జేరుల్
దరిగవ్వంబును దానఁట,
హరి హరి హరిచిత్రలీల హరియే యెఱుఁగున్. 4

ఆ. జలధిఁ గడవసేయ శైలంబు కవ్వంబు
సేయ భోగిఁ ద్రాడు సేయఁ దరువ
సిరియు సుధయుఁ బడయ శ్రీవల్లభుఁడు దక్క-
నొరుఁడు శక్తిమంతుఁ డొకఁడు గలఁడె. 5

ఆ. గొల్లవారి బ్రతుకు గొఱఁతన వచ్చునే
గొల్లరీతిఁ బాలకుప్పఁ దచ్చి
గొల్లలైరి సురలు గొల్లయ్యె విష్ణుండు
చేటులేనిమందు సిరియుఁ గనిరి. 6

హాలాహల నివారణకై దేవతలు శివుని ప్రార్థించుట

సీ. భూతాత్మ! భూతేశ! భూతభావనరూప!
దేవ! మహాదేవ! దేవవంద్య!
యీ లోకములకెల్ల నీశ్వరుండవు నీవ
బంధమోక్షములకుఁ బ్రభుఁడ వీవ

యార్తి శరణ్యుండ వగు గురుండవు నిన్నుఁ
గోరి భజింతురు కుశలమతులు
సకల సృష్టి స్థితి సంహార కర్తవై
బ్రహ్మ విష్ణు శివాఖ్యఁ బరఁగు దీవు

ఆ. పరమగుహ్యమైన బ్రహ్మంబు సదసత్త
మంబు నీవ శక్తిమయుఁడ వీవ
శబ్దయోని వీవ జగదంతరాత్మవు
నీవ ప్రాణ మరయ నిఖిలమునకు. 7

క. నీయంద సంభవించును,
నీ యంద వసించి యుండు నిఖిలజగంబుల్,
నీ యంద లయముఁ బొందును,
నీ యుదరము సర్వభూత నిలయము రుద్రా! 8

సీ. అగ్ని ముఖంబు, పరాపరాత్మక మాత్మ,
కాలంబు గతి, రత్నగర్భ పదము,
శ్వసనంబు నీ యూర్పు, రసన జలేశుండు,
దిశలు కర్ణంబులు, దివము నాభి,
సూర్యుండు గన్నులు, శుక్లంబు సలిలంబు,
జఠరంబు జలధులు, చదలు శిరము,
సర్వౌషధులు రోమచయములు, శల్యంబు
లద్రులు, మానస మమృతకరుఁడు,

తే. ఛందములు ధాతువులు, ధర్మసమితి హృదయ,
మాస్యపంచక ముపనిషదాహ్వయంబు,
లైన నీరూపు పరతత్త్వమై శివాఖ్య
మై స్వయంజ్యోతి యై యొప్పు నాద్య మగుచు. 9

సీ. తలఁపఁ బ్రాణేంద్రియ ద్రవ్య గుణ స్వభా
　　　వుఁడవు, కాల క్రతువులును నీవ
సత్యంబు ధర్మ మక్షరము ఋతంబును
　　　నీవ ముఖ్యుండవు నిఖిలమునకు
ఛందోమయుండవు స_త్త్వ రజ _స్తమ
　　　శ్చక్షుండ వై యుందు సర్వరూప !
కామపురాధ్వర కాలగతాది భూ
　　　తద్రోహిజయము చోద్యంబుగాదు
తే. లీల లోచనవహ్ని స్ఫులింగ శిఖల
నంతకాదులఁ గాల్చిన యట్టి నీకు
రాజఖండావతంస! పురాణపురుష!
దీనరక్షక! కరుణాత్మ! దేవదేవ! 10

శివుడు విషమును మ్రింగుట

మ. అమరన్ లోకహితార్థ మంచు నభవుం డాఁగాక యం చాడెఁ బో
యమరుల్ భీతిని మ్రింగుమీ యనిరి వో యంభోజ గర్భాదులుం
దముఁ గావన్ హర! లెమ్ము లె మ్మనిరి వో తాఁ జూచి కన్గంట న
య్యుమ ప్రాణేశ్వరు నెట్లు మ్రింగు మనె న య్యుగ్రానల జ్వాలలన్. 11

మ. తన చుట్టున్ సురసంఘముల్ జయజయ ధ్వానంబులన్ బొబ్బిడన్
ఘన గంభీర రవంబుతో శివుఁడు లోకద్రోహి! హుం! పోకు ర
మ్మని కేంగేలఁ దెమల్చి కూర్చి కడిగా నంకించి జంబూఫలం
బన సర్వంకషమున్ మహావిషము నాహారించె హేలాగతిన్. 12

మ. కదలంబారవు పాఁపపేరు లొడలన్ ఘర్మాంబుజాలంబు పు
ట్టదు నేత్రంబులు నెఱ్ఱగావు నిజ జూటార్ధేందుఁడున్ గందఁడున్

పదనాంభోజము వాడ దా విషము నాహ్వానించువా డాయువాఁ
బదిలుం డై కడిసేయువాఁ డిపుడహో భక్షింపువా మ్రింగువాఁడెన్. 13

క. ఉదరము లోకంబులకు౯
సదనం బగు టెఱిఁగి శివుఁడు చటులవిషాగ్నిన్
గుదురుకొనఁ గంఠబిలమునఁ
బదిలంబుగ నిలిపె సూక్ష్మ ఫలరసము క్రియన్. 14

క. మెచ్చిన మచ్చిక గలిగిన,
నిచ్చిన నీవచ్చుఁ గాక యిచ్చ నొరులకుం
జిచ్చుఁ గడిఁ గొనఁగ వచ్చునె,
చిచ్చఱచూ పచ్చువడిన శివునకుఁ దక్కన్. 15

ఆ. హరుఁడు గళమునందు హాలాహలము వెట్టఁ
గప్పు గలిగి తొడవు కరణి నొప్పె
సాధురక్షణంబు సజ్జనులకు నెన్న
భూషణంబు గాదె భూవరేంద్ర! 16

పార్వతి ప్రశంస

క. మ్రింగెడివాఁడు విభుం డని,
మ్రింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ,
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో! 17

లక్ష్మీదేవి పుట్టుక

క. తొలుకారు మెఱుఁగుకైవడి,
తళతళ యని మేను మెఱయ ధగధగ యనుచున్

గలుముల నీనెడు చూపుల,
చెలువంబుల మొదలిటెంకి సిరి పుట్టె నృపా ! 18

సీ. పాలమున్నీటిలోపలి మీఁది మీఁగడ
మిసిమి జిడ్డునఁజేసి మేనువడసి
క్రొక్కారుమెఱుఁగుల కొనల తళుక్కుల
మేనిచేగల నిగ్గుమెఱుఁగు చేసి
నాఁడునాఁటికిఁ బ్రోది నవకంపుఁ దీఁగెల
నునుఁబోద నెయ్యంబు నూలుకొలిపి
క్రొవ్వారు కెందమ్మి కొలఁకులఁ బ్రొద్దునఁ
బొలసిన వలపులఁ బ్రోదివెట్టి
తే. పసిఁడిచంపకదామంబు బాగుఁ గూర్చి
వ్రాలు క్రొన్నెల చెలువున వాఁడి దీర్చి,
జాణతనమునఁ జేతుల జిడ్డు విడిచి
నలువ యీ కొమ్మ నొగిఁ జేసినాఁడు నేఁడు. 19

సీ. తరుణికి మంగళస్నానంబు సేయింతు
మని పెట్టె నింద్రుఁ డనర్ఘమైన
మణిమయపీఠంబు మంగళవతు లైన
వేలుపుగరితలు విమల తోయ
పూర్ణంబు లై యున్న పుణ్యాహ కలశంబు
లిడిరి పల్లవముల నిచ్చె భూమి
కడిమి గోవులు పంచగవ్యంబులను నిచ్చె
మలసి వసంతుఁడు మధువు నొసఁగె

తే. మునులు గల్పంబుఁ జెప్పిరి మొగియుగములు
పణవ గోముఖ కాహళ పటహ మురజ
శంఖ వల్లకి వేణు నిస్వనము లిచ్చె,
పాడి రాడిరి గంధర్వపతులు సతులు. 20

క. పండిత సూక్తులతోడుతఁ,
దండంబులు సాఁచి కీర్తితోయము లెల్లన్
గుండములు ముంచి దిగ్వే
దండంబులు జలకమార్చెఁ బరమరమణికిన్. 21

సీ. కట్టంగ పచ్చని పట్టుపుట్టము దోయి
ముదితకుఁ దెచ్చి సముద్రుఁ డిచ్చె
మత్తాళినికరంబు మధు వాన మూఁగిన
వైజయంతీ మాల వరుణుఁ డిచ్చెఁ
గాంచన కేయూర కంకణ కింకిణీ
కటకాదులను విశ్వకర్మ యిచ్చె
భారతి యొక మంచి తారహారము నిచ్చెఁ
బాణిపద్మము నిచ్చెఁ బద్మభవుఁడు
ఆ. కుండలివ్రజంబు కుండలముల నిచ్చె
శ్రుతులు భద్రమైన నుతులు సేసె
నెల్లలోకములకు నేలికసాని వై
బ్రతికె దనుచు దిశలు పలికె నధిప! 22

లక్ష్మీదేవి వైభవము

సీ. భావించి యొకమాటు బ్రహ్మాండమంతయు
నాటల బొమ్మరిల్లని తలంచుఁ

పోలించి యొకమాట పుష్పసంఘము లన్నియు
దన యింటిలో దొంతులని తలంచుఁ
జాటించి యొకమాట బ్రహ్మాది సురలను
దన యింటిలో బొమ్మ లని తలంచుఁ
గొనకొని యొకమాట కుంభినీచక్రంబు
నలవడ బొమ్మపీఁటని తలంచు

ఆ. సొలసి యొక్కమాట సూర్యేందురోచుల
నచటి దీపకళిక లని తలంచు
భామ యొక్కమాట భారతీదుర్గల
నాత్మసఖు లటంచు నాదరించు.

లక్ష్మీదేవి విష్ణుమూర్తిని వరించుట

సీ. అమర ముత్తైదువ నై యుండవచ్చును
పరుసకు సవతు లెవ్వరును లేరు
వెలయంగ సత్రాంత విభవ మీతని యిల్లు
శృంగారచందన శీతలుండు
గలఁగఁ డెన్నఁడు శుద్ధ కారుణ్యమయమూర్తి
విమలుండు గదిసి సేవించవచ్చు
నెఱి నాడి తిరుగఁడు నిలుకడ గలవాఁడు
సకల కార్యములందు జడతలేదు

ఆ. సాధురక్షకుండు షడ్వర్గ రహితుండు
నాథుఁ డయ్యెనేని నడప నోపు
నితఁడె భర్త యనుచు నింతి సరోజాక్షుఁ
బుష్పదామకమునఁ బూజఁ జేసె. 24

తృతీయ గుచ్ఛము

క. ఇందీవర దామమున ము
కుందునిఁ బూజించి తనకుఁ గూడి వసింపన్
మందిరముగఁ ద ద్వక్షము
నంద సలజ్జానుదృష్టి నాలోకించెన్. 25

ఆ. మోహరసములవలన ముద్దిడు తలయెత్తు
సిగ్గు వలన వాలు శిరమువంచు
నింతి వెఱఁగువలన నెత్తదు వంపదు
తనదు ముఖము ప్రాణదయితుఁ జూచి. 26

క. హరి సూచిన సిరి సూడదు,
సిరి చూచిన హరియుఁ జూడ సిగ్గును బొందున్
హరియును సిరియును దమలో
సరి చూపులఁ జూడ మదనుఁ డందడి వెట్టెన్. 27

క. ఆ పాలవెల్లి కూతుఁరు
తీపులఁ జూపులను దోఁగి తిలకించి ప్రజల్
చేపట్టిరి సంపదలను,
ప్రాపించెను మేలు జగము బ్రతికె నరేంద్రా ! 28

క. పాలేటి రాచకన్నియ
మేలారెడు చూపు లేక మిడుమిడుకంచుం
జాలిం బురబురఁ బొక్కుచుఁ
దూలిరి రక్కసులు కీడు దోఁచిన నధిపా! 29

మాలిని. దివిజరిపు విదారీ ! దేవలోకోపకారీ !
భువనభర నివారీ ! పుణ్యరక్షానుసారీ !
ప్రవిమల శుభమూర్తీ ! బంధుపోష ప్రవర్తీ !
ధవళ బహుళ కీర్తీ ! ధర్మనిత్యానువర్తీ ! 30



మహాభాగవత కల్పకుసుమమాల

చతుర్థ గుచ్ఛము

(ప్రహ్లాద చరిత్రము)

క. చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్. 1

ఆ. అలుక నైనఁ జెలిమి నైనఁ గామంబున
నైన బాంధవమున నైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁ డగు హరిఁ
జేరవచ్చు వేఱు సేయఁ డతఁడు. 2

క. కీటకముఁ దెచ్చి భ్రమరము,
పాటవమున బంభ్రమింప భ్రాంతం బై త
త్కీటకము భ్రమర రూపముఁ
బాటించి వహించుఁ గాదె! భయయోగమునన్. 3

శా. కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్ సంబంధు లై వృష్ణులున్
బ్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్లైన ను
ద్దామ ధ్యానగరిష్ఠుఁ డైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా! 4

చతుర్థ గుచ్ఛము

హిరణ్యకశిపు వర్ణన

శా. నాకుం దమ్ముఁడు మీకు నెచ్చెలి రణ న్యాయైక దక్షుండు బా
హా కుంఠీకృత దేవయక్షుఁడు హిరణ్యాక్షుండు వానిన్ మహా
సౌకర్యాంగముఁ దాల్చి దానవ వధూ సౌకర్యముల్ సిఱుగా
వైకుంఠుండు వధించి పోయె నఁట యీ వార్తాస్థితిన్ వింటిరే ! 5

మ. దివిజానీక విరోధి మ్రొక్కెఁ గని వాగ్దేవీ మనోనేతకున్
సవిశేషోత్సవ సంవిధాతకు నమ త్సంత్రాతకున్ సత్తపో
నివహాభీష్ట వరప్రదాతకు జగ న్నిర్మాతకున్ ధాతకున్
వివిధ ప్రాణి లలాటలేఖన మహావిద్యానుసంధాతకున్. 6

శా. ఏ దిక్పాలురఁ జూచి నేఁ దలుగునో ? యే దేవు బంధించునో ?
యే దిగ్భాగము మీఁద దాడి చనునో ? యే ప్రాణులం జంపునో ?
యీ దైత్యేశ్వరుఁ డంచు నొండొరులు దా రింద్రాదు లాస్థాన భూ
వేదిన్ మెల్లన నిక్కి చూతురు భయావిర్భూత రోమాంచులై. 7

సీ. కోలాహలము మాని కొలువుఁడు సురలార !
తలఁగి దీవింపుఁడు తపసులార !
ఫణ లెత్తకుఁడు నిక్కి పన్నగేంద్రములార !
ప్రణతులై చనుఁడు దిక్పాలురార !
గానంబు సేయుఁడు గంధర్వవరులార !
సందడిఁ బడకుఁడు సాధ్యులార !
ఆఁడుఁడు నృత్యంబు లప్సరోజనులార !
చేరిక మ్రొక్కుఁడు సిద్ధులార !

తే. శుద్ధ కర్పూర వాసిత సురభి మధుర
భవ్య నూతన మైరేయ పానజనిత
సుఖ విలీనత నమరారి సౌఖ్యనాఁడు
శాంతి లేనంద్రుఁ డిచ్చుఁ బెంపు లక్ష్మిప ! 8

దేవతాకృత విష్ణుస్తుతి

ఉ. ఎక్కడ నున్నవాఁడు ? జగదీశ్వరుఁ డాత్మమయుండు మాధవుం
డెక్కడి కేగి శాంతులు మునీశులు భిక్షులు రారు ? గ్రమ్మఱన్
దిక్కుల కెల్ల నెక్కుడు తుదిం జొర దిక్కగు నట్టి దిక్కుఁడున్
మ్రొక్కెద మేము హస్తయుగముల్ ముకుళించి మదీయ రక్షకున్. 9

ప్రహ్లాదుని వర్ణన

సీ. ఆకార జన్మ విద్యార్థ వరిష్ఠుఁడై
గర్వ సంస్తంభ సంగతుఁడు గాఁడు
వివిధ మహానేక విషయసంపన్నుఁడై
పంచేంద్రియములచేఁ బట్టువడఁడు
భవ్య వయో బల ప్రాభవోపేతుఁ డై
కామ రోషాదులఁ గ్రందుకొనఁడు
కామినీప్రముఖ భోగము లెన్ని గలిగిన
వ్యసనసంసక్తి నా వంకఁ బోఁడు

ఆ. విశ్వమందుఁ గన్న విన్న యర్థములందు
వస్తుదృష్టిఁజేసి వాంఛ యుడఁడు
ధరణినాథ ! దైత్యతనయుండు హరిపర
తంత్రుఁ డై హతాన్యతంత్రుఁ డగుచు 10

చతుర్థ గుచ్ఛము

సీ. శ్రీవల్లభుఁడు దన్నుఁ జేరిన యట్లైన
చెలికాండ్ర నెవ్వరిఁ జేర మఱచు
నసురారి దనతోడ నాడిన యట్లైన
నసురబాలురతోడ నాడ మఱచు
భక్తవత్సలుఁడు సంభాషించి నట్లైన
పరభాషలకు మాఱుపలుక మఱచు
సురవంద్యుఁ దనలోనఁ జూచిన యట్లైనఁ
జొక్కి సమస్తంబు జూడ మఱచు

తే. హరి పదాంభోజయుగ చింతనామృతమున
నంతరంగంబు నిండిన యట్లైన నతఁడు
నిత్య పరిపూర్ణుఁ డగుచు నన్నియును మఱచి
జడత లేకయు నుండును జడునిభంగి. 11

శా. పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్ హాస లీ
లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేత ద్విశ్వమున్ భూవరా! 12

సీ. వైకుంఠ చింతావివర్జిత చేష్టుఁడై
యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంత హరిభావనారూఢచిత్తుఁడై
యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియ కాని వేఱొండు లేదని
యొత్తిలి నగుచుండు నొక్కచోట
నళినాక్షుఁ దను నిధానముఁ గంటి నేఁ డని
యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ

ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ
ప్రణయ హర్ష జనిత బాష్పసలిల
మిళిత పులకుఁ డై నిమీలిత నేత్రుఁ డై
యొక్కచోట నిలిచి యూరకుండు. 13

ప్రహ్లాద హిరణ్యకశిపుల సంవాదము

శా. పుత్రుల్ నేర్చిన నేరకున్న జనకుల్ పోషింతు రెల్లప్పుడున్
మిత్రత్వంబున బుద్ధి సెప్పి దురితోన్మేషంబు వారింతు రే
శత్రుత్వంబుఁ దలంప రెట్టియెడ నా సౌజన్య రత్నాకరుణ్
బుత్రుణ్ లోకపవిత్రుఁ దండ్రి నెగులుం బొందింప నె ట్లోర్చెనో ! 14

శా. ఉత్సాహ ప్రభు మంత్రశక్తి యుత మై యుద్యోగ మారూఢ సం
వి త్సంపన్నుఁడ వై తివే ? చదివితే వేదంబులున్ శాస్త్రముల్ ?
వత్సా ! రమ్మని చేరఁ జీరి కొడుకున్ వాత్సల్య సంపూర్ణుఁడై
యుత్సంగాగ్రముఁ జేర్చి దానవవిభుం డుత్కంఠ దీపింపఁగన్. 15

క. అనుదిన సంతోషణములు,
జనిత శ్రమ తాప దుఃఖ సంశోషణముల్,
తనయుల సంభాషణములు,
జనకులకుం గర్ణయుగళ సద్భూషణముల్. 16

ప్రహ్లాదుని సమాధానము

ఉ. ఎల్ల శరీరధారులకు నిల్లను చీకఁటి నూతి లోపలం
ద్రెళ్ళక వీరు నే మను మతిభ్రమణంబున భిన్ను లై ప్రవ

త్రిల్లోక సర్వము స్వతని దివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తా రతివి నుండుట మేలు నిశాచరాగ్రణీ ! 17

హిరణ్యకశిపుని ఆశ్చర్యప్రకటనము

శా. నాకుం జూడఁగఁ జోద్య మయ్యెడుఁ గదా ! నా తండ్రి యీ బుద్ధి దా
నీకున్ లోపలఁ దోఁచెనో ? పరులు దుర్నీతుల్ పఠింపించిరో ?
యేకాంతంబున భార్గవుల్ పలికిరో ? యీ దానవ శ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్ ? 18

ప్రహ్లాదుని భక్తిభావన

శా. అజ్ఞుల్ గొందఱు మేము దా మఱచు మాయం జెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్యు వరాన్వయ క్రమములన్ భాషింపఁగా నేర రా
జిజ్ఞాసా పథమందు మూఢులు గదా ! చింతింప బ్రహ్మాది వే
దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నితరులు దర్శింపఁగా నేర్తు రే ? 19

తే. ఇను మయస్కాంత సన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశు సన్నిధి నా విధమునఁ
గరఁగుచున్నది దైవయోగమునఁ జేసి
బ్రాహ్మణోత్తమ ! చిత్తంబు భ్రాంత మగుచు. 20

సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు ?
నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు
రాయంచ సనునె తరంగిణులకు ?

లలిత రసాల పల్లవ ఖాది యై చొక్కు
కోయిల సేరునే కుటజములకుఁ ?
పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక
మరుగునే సాంద్ర నీహారములకు ?
తే. అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పానవిశేష మత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల ! మాటలు వేయునేల ? 21

తండ్రి రెండవమారు పుత్రుని ప్రశ్నించుట

శా. చోద్యం బయ్యెడు నింతకాల మరిగెన్ శోధించి యే మేమి సం
వేద్యాంశంబులు సెప్పిరో ? గురువు లే వెంటం బఠింపించిరో ?
విద్యాసార మెఱుంగఁ గోరెద భవద్విజ్ఞాత శాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి చెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా ! 22

శా. నిన్నున్ మెచ్చరు నీతిపాఠ మహిమ న్నీతోడి దైత్యార్భకుల్
గన్నా రన్నియుఁ జెప్ప నేర్తురుగదా ! గ్రంథార్థముల్ దక్షులై
యన్నా ! యెన్నఁడు నీవు నీతిమతి వౌ దంచున్ మహావాంఛతో
నున్నాఁడ న్నను గన్నదండ్రి ! భవదీయోత్కర్షముం జూపవే ? 23

కొడుకు సమాధానము

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖర శాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు,
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ ! 24

మ. తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁ డై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా! 25

శా. అంధేందూదయముల్ మహాబధిర శంఖారావముల్ మూక స
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావళీ
బంధుత్వంబులు భస్మ హవ్యములు లుబ్ధ ద్రవ్యముల్ క్రోడ స
ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్. 26

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి

తే. దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
తండ్రి! హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి. 27

సీ. కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే?
పవన గుంఫిత చర్మభస్త్రి గాక

వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే ?
ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే ?
తరుశాఖ నిర్మిత దర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే ?
తను కుడ్య జాల రంధ్రములు గాక

ఆ. చక్రిచింత లేని జన్మంబు జన్మమే ?
తరళ సలిల బుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే ?
పాదయుగముతోడి పశువు గాక. 28

సీ. సంసారజీమూత సంఘంబు విచ్చునే ?
చక్రి దాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీల దావాగ్ను లాఱునే ?
విష్ణుసేవామృత వృష్టి లేక
సర్వంకషాఘౌఘ జలరాసు లింకునే ?
హరి మనీషా బడబాగ్ని లేక
ఘన విప ద్గాఢాంధకారంబు లణఁగునే ?
పద్మాక్షు నుతి రవిప్రభలు లేక

తే. నిరుప మాపునరావృత్తి నిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే ? ముఖ్యమైన
శార్ఙ్గి కోదండ చింతనాంజనము లేక
తామరస గర్భునకు నైన దానవేంద్ర ! 29

శా. శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ! వెయ్యేటికిన్
గాఫల్ మాధవశేముషీ తరణి సాంగత్యంబునం గాక దు
ర్మేధం దాటఁగ వచ్చునే ? సుత వధూ మిత్రోగ్రవాంఛా మద
క్రోధోల్లోల విశాలసంసృతి మహా ఘోరామితాంభోనిధిన్. 30

ఉ. అచ్చపుఁ జీఁకటిం బడి గృహవ్రతులై విషయ ప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మఱలఁ జర్విత చర్వణు లైన వారికిం
జెచ్చెరఁ బుట్టునే ? పరులు సెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁ గానలకు నేఁగిన నైన హరిప్రబోధముల్. 31

ఉ. కానని వాని నూఁతగొని కానని వాఁడు విశిష్ట వస్తువుల్
గానని భంగిఁ గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ గొంద ఱటఁ గందు రకించన వైష్ణవాంఘ్రి సం
స్థాన రజోఽభిషిక్తు లగు సంహృతకర్ములు దానవేశ్వరా! 32

హిరణ్యకశిపుడు చండామర్కుల దూరుట

క. ధర్మేతర వర్తనులును,
దుర్మంత్రులు నైన జనుల దురితము లొందున్
మర్మములు గలఁచి కల్మష,
కర్మల రోగములు వొందుకైవడి విప్రా! 33

చండామర్కుల ప్రతివచనము

ఉ. తప్పులు లేవు మా యెడను దానవనాథ ! విరోధిశాస్త్రముల్
సెప్పము క్రూరులై పరులు సెప్పరు మీ చరణంబు లాన సు
మ్మెప్పుడు మీ కుమారునకు నింతయు నైజమనీష; యెవ్వరుం
జెప్పెడివారు గారు ప్రతిచింతఁ దలంపుము నేర్పు కైవడిన్. 34

హిరణ్యకశిపుని రాజనీతి

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్షసేయుక్రియ నీ యజ్ఞుం గులద్రోహి దు
స్సంగుం గేశవపక్షపాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁ జరించెదన్ గులము నిర్దోషంబుఁ గావించెదన్ 35

హిరణ్యకశిపుడు కొడుకును బాధించుట

సీ. ఒకవేళ నభిచార హోమంబు సేయించు
నొకవేళ నెండల నుండఁ బంపు
నొకవేళ వానల నుపహతి నొందించు
నొకవేళ రంధ్రంబు లుక్కఁ బట్టు
నొకవేళఁ దనమాయ నొడవించి దెగడించు
నొకవేళ మంచున నొంటి నిలుపు
నొకవేళఁ బెనుగాలి కున్ముఖుఁ గావించు
నొకవేళఁ బాఁతించు నుర్వియందు 36

తే. నీరు నన్నంబు నిడనీక నిగ్రహించుఁ
గశల నడిపించు బెదిరించు గండశిలల
గదల వ్రేయించు నేయించు ఘనశరములఁ
గొడుకు నొకవేళ నమరారి క్రోధి యగుచు.

రాక్షసబాలురకు ప్రహ్లాదుని బోధ

ఆ. విషయ సక్తులైన వివిధాహితుల తోడి
మనికి వలదు ముక్తిమార్గ వాంఛ
నాదిదేవు విష్ణు నాశ్రయింపుఁడు ముక్త
సంగజనులఁ గూడి శైశవమున. 37

సీ. కంటిరే మనవారు ఘనులు గృహస్థులై
విఫలులై కైకొన్న వెట్టితనము
భద్రార్థులై యుండి పాయరు సంసార
పద్ధతి నూరక పట్టువడిరి
కలయోనులం దెల్ల గర్భాద్యవస్థలఁ
బురుషుండు దేహియై పుట్టుచుండుఁ
ద న్నెఱుంగఁడు కర్మతంత్రుఁడై కడపల
ముట్టఁడు భవశతములకు నైన

ఆ. దీన శుభము లేదు దివ్యకీర్తియు లేదు
జగతిఁ బుట్టి పుట్టి చచ్చి చచ్చి
పొరల నేల మనకుఁ బుట్టని చావని
త్రోవ వెదకి కొనుట దొడ్డ బుద్ధి. 38

రాక్షస బాలుర ఆశ్చర్య ప్రకటనము

ఉ. మంటిమి కూడి భార్గవ కుమారకు లొద్ద ననేక శాస్త్రముల్
వింటిమి లేఁడు సద్గురుఁడు వేఱొకఁ డెన్నఁడు రాజశాల ము
క్కంటికి నైన రాదు సొరఁగా వెలికిం జనరాదు నీకు ని
ష్కంటక వృత్తి నెవ్వఁడు ప్రగల్భుఁడు సెప్పె గుణాఢ్య! సెప్పుమా. 39

క. సేవింతుము ని న్నెప్పుడు,
భావింతుము రాజ వనుచు బహుమానంబుల్
గావింతుము తెలియము నీ,
కీ వింత మతిప్రకాశ మే క్రియఁ గలిగెన్. 40

భక్తి మహిమాభివర్ణనము

సీ. దనుజారి లీలావతారంబు లందలి
 శౌర్యకర్మంబులు సద్గుణములు
విని భక్తుఁ డగువాఁడు వేడ్కతోఁ బులకించుఁ
 గన్నుల హర్షాశ్రుకణము లొలుక
గద్గదస్వరముతోఁ గమలాక్ష ! వైకుంఠ !
 వరద ! నారాయణ ! వాసుదేవ !
యనుచు నొత్తిలి పాడు నాడు నాక్రోశించు
 నగుఁ జింతనముసేయు నతి యొనర్చు
తే. మరులుకొని యుండుఁ దనలోన మాటలాడు
వేల్పుసోఁకిన పురుషునివృత్తిఁ దిరుగు
బంధములు వాసి యజ్ఞానపటలిఁ గాల్చి
విష్ణుఁ బ్రాపించుఁ దుది భక్తి వివశుఁ డగుచు. 41

క. ఆడుదము మనము హరి రతిఁ
బాడుద మే ప్రొద్దు విష్ణు భద్రయశంబుల్
వీడుదము దనుజసంగతిఁ
గూడుదము ముకుంద భక్తకోటిన్ సూటిన్. 42

క. విత్తము సంసృతిపటలము
ప్రత్తము కామాది వైరివర్గంబుల నేఁ
డిత్తము చిత్తము హరికినిఁ
జొత్తము నిర్వాణపదము శుభమగు మనకున్. 42

క. చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచ శీల తపములన్
జిక్కఁడు యుక్తిని భక్తిని
జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ. 43

క. చాలదు భూదేవత్వము
చాలదు దేవత్వ మధిక శాంతత్వంబున్
చాలదు హరి మెప్పింప వి
శాలోద్యములార! భక్తి చాలిన భంగిన్. 44

ప్రహ్లాద హిరణ్యకశిపుల సంవాదము

శా. సూనుం శాంతగుణ ప్రధాను నతి సంశుద్ధాంచిత జ్ఞాను న
జ్ఞానారణ్య కృశాను నంజలిపుటీ సంభ్రాజమానుం సదా
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాదనా
ధీనున్ ధిక్కరణంబుఁ జేసి పలికెం దేవాహితుం డుగ్రతన్. 45

సీ. కాలరూపంబులఁ గల విశేషంబుల
నలఘు గుణాశ్రయుం డైన విభుఁడు
సత్త్వ బలేంద్రియ సహజ ప్రభావాత్ముఁ
డై వినోదంబుల నఖిల జగముఁ
గల్పించు రక్షించు ఖండించు నవ్యయుం
డన్ని రూపములందు నతఁడు గలఁడు
చిత్తంబు సమముగాఁ జేయుము మార్గంబు
దప్పి వర్తించు చిత్తంబు కంటె

తే. వైరు లెవ్వరు ? చిత్తంబు వైరి గాక
చిత్తమును నీకు వశముగాఁ జేయవయ్య !
మదయుతాసురభావంబు మానవయ్య !
యయ్య ! నీ మ్రోల మే లాదరయ్య ! జనులు. 46

ఉ. లోకము లన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీకముఁ జిత్తముం గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకర శత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా ! 47

క. పాలింపుము శేముషి ను
న్మూలింపుము కర్మబంధముల సమదృష్టిన్
జాలింపుము సంసారముఁ
గీలింపుము హృదయమందుఁ గేశవ భక్తిన్. 48

క. ఎక్కడఁ గలఁడే క్రియ నే
చక్కని వర్తించు నెట్టి జాడను వచ్చున్ !
జక్కడుతు నిన్ను విష్ణునిఁ
బెక్కులు ప్రేలెదవు వాని భృత్యునిపగిదిన్. 49

క. డింభక ! సర్వస్థలముల
సంభోరుహనేత్రుఁ డుండు నంచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ
స్తంభంబునఁ జూపఁగలవె చక్రిన్ గిక్రిన్. 50

మ. కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిన్
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్

గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగ వ్యక్తులం దంతటన్
గలఁ డీశుండు గలండు తండ్రి! వెదకంగా నేల యీ యా యెడన్. 51

క. ఇందుఁ గలఁ డందు లేఁ డని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన
నం దందే గలఁడు దానవాగ్రణి! వింటే. 52

శా. అంభోజాసనుఁ డాది గాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండు ప్రోడ విపుల స్తంభంబులో నుండఁడే
స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ, బ్రత్యక్ష స్వరూపంబునన్. 53

నరసింహావిర్భావము

సీ. పంచాననోద్ధూత పావక జ్వాలల
భూనభోంతర మెల్లఁ బూరితముగ
దంష్ట్రాంకు రాభీల ధగధగాయిత దీప్తి
నసురేంద్రు నేత్రము లంధములుగఁ
గంటిక సన్నిభోత్కట కేసరాహతి,
నభ్రసంఘము భిన్నమై చరింపఁ
బ్రకటాభ్ర చంచలా ప్రతిమ భాస్వరములై
ఖర నఖరోచులు గ్రమ్ముదేర

తే. సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి

జిహ్వ యాడించి లంఘించి చేత నొడిసి
పట్టె నరసింహుఁ డా దితిపట్టి నధిప! 54

మ. విహగేంద్రుం డహి వ్రచ్చుకై వడి మహోద్వృత్తి న్నృసింహుండు సా
గ్రహుఁడై యూరువులందుఁ జేర్చి నఖసంఘాతంబులన్ వ్రచ్చె దు
స్సహు దంభోళి కఠోర దేహు నచలోత్సాహున్ మహాబాహు నిం
ద్ర హుతాశాంతక భీకరున్ ఘనకరున్ దైత్యాన్వయ శ్రీకరున్. 55

సీ. వక్షః కవాటంబు వ్రక్కలు సేయుచోఁ
ఘన కుఠారంబుల కరణి నొప్పు
గంభీర హృదయపంకజము భేదించుచోఁ
గుద్దాలముల భంగిఁ గొమరు మిగులు
ధమనీ వితానంబుఁ దగిలి ఖండించుచోఁ
బటు లవిత్రంబుం పగిది మెఱయు
జఠర విశా లాంత్రజాలంబుఁ ద్రెంచుచోఁ
గ్రకచ సంఘంబుల గరిమఁ జూపు
తే. నంకగతుఁ డైన దైత్యుని నాగ్రహమున
శస్త్రచయముల నొంపక సంహరించి
యమరు నరసింహు నఖరంబు లతివిచిత్ర
సమర ముఖరంబులై యుండె జనవరేణ్య! 56

సీ ప్రళయార్క బింబంబు పగిది నున్నది గాని
నెమ్మోము పూర్ణేందు నిభము గాదు
శిఖి శిఖాసంఘంబు చెలువు చూపెడుఁ గాని
చూడ్కి ప్రసాదభాసుకము గాదు

వీర రౌద్రాద్భు తావేశ మొప్పెడుఁ గాని
భూరి కృపారస స్ఫూర్తి గాదు
భయద దంష్ట్రాంకుర ప్రభలు గప్పెడు గాని
దరహసి తాంబుజాతంబు గాదు

తే. కఠిన నఖర నృసింహ విగ్రహము గాని
కామినీజన సులభవిగ్రహము గాదు
విన్నదియుఁ గాదు తొల్లి నే విష్ణువలనఁ
గన్నదియుఁ గాదు భీషణాకార మనుచు. 57

ప్రహ్లాదుండు నరసింహమూర్తిని స్తుతించుట

మ. అమరుల్ సిద్ధులు సంయమీశ్వరులు బ్రహ్మాదుల్ సతాత్పర్య చి
త్తముల న్నిన్ను బహుప్రకారముల నిత్యంబుఁ విచారించి పా
రము ముట్ట న్నుతిసేయ నోప రఁట నే రక్షస్తనూజుండ గ
ర్వ మదోద్రిక్తుఁడ బాలుఁడఁ జడమతిఁ వర్ణింప శక్తుండనే. 58

మ. ఘన లీలాగుణ చాతురిఁ భువనముల్ గల్పించి రక్షించి భే
దనముం జేయు దురంతశక్తికి ననంతజ్యోతికిఁ జిత్రవీ
ర్యునికి న్నిత్యపవిత్రకర్మునికి నే నుత్కంఠతో నవ్యయా
త్మునికిఁ వందన మాచరించెదఁ గృపాముఖ్య ప్రసాదార్థి నై. 59

మ. తపముఁ వంశము తేజముఁ శ్రుతము సౌందర్యంబు నుద్యోగము
న్నిపుణత్వంబు ప్రతాప పౌరుషములు న్నిష్ఠా బల ప్రజ్ఞలుఁ
నుపయోగంబులుఁ గావు పీశ్వర ! భవ త్సంతుష్టికై దంతి యూ
థపు చందంబున భక్తి సేయవలయుఁ దాత్పర్య సంయుక్తుఁ డై. 60

మ. అమలజ్ఞాన సుదాన ధర్మరతి సత్యక్షాంతి నిర్మత్సర
త్వములన్ యజ్ఞ తపోఽనసూయలఁ గడున్ దర్పించు ధాత్రీసురో
త్తముకంటెన్ శ్వపచుండు ముఖ్యుఁడు మనోఽర్థ ప్రాణ వాక్కర్మముల్
సమత న్నిన్ను నయించెనేని నిజవంశ శ్రీకరుం డౌఁ దుదిన్. 61

ఉ. శ్రీమహిళా మహేశ సరసీరుహగర్భుల కైన నీ మహో
ద్దామ కరంబుచే నభయదానము సేయని నీవు బాలుఁడన్
దామస వంశ సంభవుఁడ దైత్యుఁడ నుగ్ర రజోగుణుండ ని
స్సీమదయన్ గరాంబుజము శీర్షముఁ జేర్చుట చోద్య మీశ్వరా ! 62

మ. జలజాతప్రభవాదులున్ మనములోఁ జర్చించి భాషావళిన్
బలుకన్లేని జనార్దనాహ్వయ పరబ్రహ్మంబు నీ యింటిలోఁ
జెలి యై మేనమఱంది యై సచివుఁ డై చిత్రప్రియుం డై మహా
ఫలసంధాయకుఁ డై చరించుట మహాభాగ్యంబు రాజోత్తమా ! 63



మహాభాగవత కల్పకుసుమమాల

పంచమ గుచ్ఛము

(గజేంద్ర మోక్షము)

క. ఏ కథలయందుఁ బుణ్య
శ్లోకుఁడు హరి సెప్పఁబడును సూరిజనముచే
నా కథలు పుణ్యకథ లని
యాకర్ణింపుదురు పెద్ద లతిహర్షమునన్. 1

అడవి వర్ణనము

క. భిల్లీ భల్ల లులాయక
భల్లుక ఫణి ఖడ్గ గవయ బలిముఖ చమరీ
ఝిల్లీ హరి శరభక కిటి
మల్లాద్భుత కాక ఘూకమయ మగు నడవిన్. 2

ఏనుగుల వర్ణనము

శా. అన్యాలోకన భీకరంబులు జితాశానేకపానీకముల్
వన్యేభంబులు గొన్ని మత్తతను లై వజ్యావిహా రాగతో
దన్యత్వంబున ఘోరి ఘూధర దరీ ద్వారంబులం దుండి సౌ
జన్యక్రీడల నీరుగాలిపడి గాసా రాసగాహార్థ మై. 3

ఆ. అంధకార మెల్ల నద్రి గుహాంతర
వీథులందుఁ బగలు వెఱచి దాఁగి

యెడరు వేచి సంధ్య నినుఁడు వృద్ధత నున్న
వెడలె నసఁగ గుహలు వెడలెఁ గరులు. 4

సీ. పల్వలంబుల లేఁతపచ్చిక మచ్చికఁ
జెలుల కందిచ్చు నచ్చికము లేక
నివురుజొంపములఁ గ్రొ వ్వేలయు పూఁగొమ్మలఁ
బ్రాణవల్లభలకుఁ బాలు వెట్టు
ఘన దాన శీతల కర్ణతాళంబుల
దయితల చెమటార్చుఁ దనువు లరసి
మృదువుగాఁగొమ్మల మెల్లన గళములు
నివురుచుఁ బ్రేమతో నెఱపు వలపు

తే. పిఱుఁదు చక్కట్ల దగ్గఱి ప్రేమతోడ
డాసి మూర్కొని దివిక్షిఁ దొండంబు సాపు
వెవ వివేకించుఁ గ్రీడించు విశ్రమించు
మత్త మాతంగమల్లంబు మహిమతోడ. 5

కాసార వర్ణనము

మ. అటఁ గాంచెన్ గరిజీవిభుండు నవ ఫుల్లాంభోజ కల్హారమున్
నట దిందిందిర వారమున్ గమఠ మీన గ్రాహ దుర్వారమున్
వట హింతాళ రసాల సాల సుమనో వల్లీ కుటీ తీరమున్
చటులోద్ధూత మరాళ చక్ర బక సంచారంబుఁ గాసారమున్. 6

సీ. తోయజగంధంబు దోఁగిన చల్లని
మెల్లని గాడ్పుల మేను లలరఁ

గమల నా శాహార విమల వాక్కలహంస
రవములు సెవుల పండువులు సేయ
ఫుల్ల దిందీవ రాంభోరుహామోదంబు
ఘ్రాణరంధ్రంబుల గారవింప
నిర్మల కల్లోలనిర్గ తాసారంబు
వదనగహ్వరముల వాడు దీర్పఁ

తే. త్రిజగ దభినవ సౌభాగ్య దీప్త మైన
విభవ మీక్షణములకును విందు సేయ
నరిగి పంచేంద్రియ వ్యవహారములను
మఱచి మత్తేభయూథంబు మడుఁగుఁ జొచ్చె. 7

క. తొండంబులఁ బూరింపుచు
గండంబులఁ జల్లుకొనుచు గళగళ రవముల్
మెండుకొన వలుదకడుపులు
నిండన్ వేదండకోటి నీరుం ద్రావెన్. 8

మకరి గజరాజును పట్టుట

సీ. ఘుగఘుగాయిత ఘూరి బుద్బుద చ్ఛటలతోఁ
గదలుచు దివికి భంగంబు లెగయ
ఘసన భయంకర హూత్కార రవమున
ఘోర నక్ర గ్రాహకోటి బెగడ
వాలవిక్షేప దుర్వార ఝంఝూనిల
వశమున ఘుమఘుమ మావర్త మడరఁ
గల్లోల జాల సంఘట్టనంబులఁ దటీ
తరులు మూలములతో ధరణిఁ గూల

తే. సరసిలోనుండి పొడగని సంభ్రమించి
యుదిరి కుప్పించి లంఘించి హుంకరించి
భానుఁ గబళించి పట్టు స్వర్భానుపగిది
నొక్క మకరేంద్రుఁ డిభరాజు నొడిసి పట్టె. 9

కరి మకరుల పోరు

క. కరిఁ దిగుచు మకరి సరసికిఁ
గరి దరికిని మకరిఁ దిగుచుఁ గరకరి బెరయన్
కరికి మకరి మకరికిఁ గరి
భర మన సి ట్లతల కుతల భటు లదరిపడన్. 10

శా. పాదద్వంద్వము నేల మోపి పవనున్ బంధించి పంచేంద్రియో
న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ మాఱాకు హత్తించి ని
ష్ఖేద బ్రహ్మపదావలంబన గతిం గ్రీడించు యోగీంద్రు మ
ర్యాద న్నక్రము విక్రమించెఁ గరి పాదాక్రాంత నిర్వక్రమై. 11

ఉ. ఊహ కలంగి జీవనపు టోలమునం బడి పోరుచున్ మహా
మోహలతా నిబద్ధ పదమున్ విడిపించుకొనంగలేక సం
దేహముఁ బొందు దేహిక్రియ దీనదశన్ గజ ముండె భీషణ
గ్రాహ దురంతదంత పరిఘట్టిత పాద ఖురాగ్ర శల్య మై. 12

మ. పృథుశక్తిన్ గజ మా జలగ్రహముతోఁ బెక్కేండ్లు పోరాడి సం
శిథిలంబై తనలావు వైరిబలముం జింతించి మిథ్యా మనో
రథ మింకేటికి దీని గెల్వ సరి పోరం జాలరా దంచు స
వ్యథ మై యుట్లనుఁ బూర్వపుణ్య ఫల దివ్యజ్ఞాన సంపత్తితోన్. 13

గజేంద్ర కృత ప్రార్థన

శా. ఏ రూపంబున దీని గెల్తు, నిటమీఁ దే వేల్పుఁ జింతింతు, నె
వ్వారిం జీరుదు, నెవ్వ రడ్డ మిఁక, ని వ్వారిప్రచారోత్తమున్
వారింపం దగువార లెవ్వ, రఖిల వ్యాపారపారాయణుల్
లేరే, మ్రొక్కెద దిక్కుమాలిన మొ రాలింపం బ్రపుణ్యాత్మకుల్. 14

శా. నానానేకప యూథముల్ వనములోనం బెద్దకాలంబు స
న్మానింపన్ దశలక్షకోటి కరిణీనాథుండ నై యుండి మ
ద్దానాంధః పరిపుష్ట చందన లతాంత చ్ఛాయలం దుండలే
కే నీరాశ నిదేల వచ్చితి, భయం బెట్లోకదే, యీశ్వరా! 15

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీన మై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాది మధ్య లయుఁ డెవ్వఁడు సర్వముఁ దాన యైన వాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్. 16

క. ఒకపరి జగములు వెలినిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ దానై
సకలార్థ సాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్. 17

క. లోకంబులు లోకేశులు,
లోకస్థులుఁ దెగినతుది నలోకం బగు పెం
జీఁకటి కవ్వల నెవ్వఁడు
నేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్. 18

క. నర్తకునిభంగిఁ బెక్కగు
మూర్తులతో నెవ్వఁ డాడు మునులున్ దివిజుల్
కీర్తింప నేర రెవ్వని
వర్తన మొరు లెఱుఁగ రట్టి వాని నుతింతున్. 19

ఆ. ముక్తసంగు లైన మునులు దిదృక్షులు
సర్వభూత హితులు సాధుచిత్తు
లసదృశ వ్రతాఢ్యులై కొల్తు రెవ్వని
దివ్యపదము, వాఁడు దిక్కు నాకు. 20

సీ. శాంతున కపవర్గ సౌఖ్య సంవేదికి
నిర్వాణ భర్తకు నిర్విశేష
నకు ఘోరునకు గూఢునకు గుణధర్మికి
సౌమ్యున కధిక విజ్ఞానమయున
కఖిలేంద్రియద్రష్ట కధ్యక్షునకు బహు
క్షేత్రజ్ఞునకు దయాసింధుమతికి
మూలప్రకృతి కాత్మ మూలునకు జితేంద్రి
యజ్ఞాపకునకు దుఃఖాంతకృతికి

ఆ. నెఱి నసత్య మనెడి నీడతో వెలుఁగుచు
నుండు నెక్కటికి మహోత్తమునకు
నిఖిల కారణునకు, నిష్కారణునకు న
మస్కరింతు నన్ను మనుచు కొఱకు. 21

సీ. సర్వాగమామ్నాయ జలధికి నపవర్గ
మయునికి నుత్తమ మందిరునకు

సకల గుణారణి మథిస్థ బోధాగ్నిచేఁ
దనయంత రాజిల్లు ధన్యమతికి
గుణలయోద్దీపిత గురుమానసునకు
సంవర్తిత కర్మనిర్వర్తితునకు
దిఁలేని నాబోఁటి పశువుల పాపంబు
లణఁచువానికి సమస్తాంతరాత్మునకుఁ

ఆ. దై వెలుఁగువాని, కచ్ఛిష్ణునకు, భగ
వంతునకుఁ దనుజ సువస్తు దేశ
దార సక్తు లైనవారి కందఁగరాని
వాని కాచరింతు వందనములు. 22

సీ. పాపకుం డర్చుల ఘానుండు దీప్తుల
నె బ్బంగి నిగిడింతు రె ట్లడంతు
రా క్రియ నాత్మకరావళిచేత బ్ర
హ్మాదుల వెల్పుల నఖిలజంతు
గణముల జగముల ఘన నామ రూప భే
దములతో మెఱయించి తగ నడంచు
నెవ్వఁడు మనము బుద్ధీంద్రియములఁ దాన
యై గుణ సంప్రవాహంబుఁ బఱపు

తే. స్త్రీ నపుంసక బురుష మూర్తియును గాక
తిర్యగమర నరాది మూర్తియును గాక
కర్మ గుణ భేద స దసత్ప్రకాశి గాక
వెనుక నన్నియుఁ దా నగు విభుఁ దలంతు. 23

క. కలఁ డందురు దీనులయెడఁ
గలఁ డందురు పరమయోగి గణములపాలం
గలఁ డందు రన్ని దిశలను
గలఁడు గలం డనెడువాఁడు గలఁడో లేఁడో! 24

సీ. కలుగఁడే నా పాలి కలిమి సందేహింపఁ
గలిమిలేములు లేక గలుగువాఁడు
నా కడ్డపడ రాఁడె నలి నసాధువులచేఁ
బడిన సాధుల కడ్డపడెడు వాఁడు
చూడఁడే నా పాటు చూపులఁ జూడక
చూచువారలఁ గృపఁ జూచువాఁడు
లీలతో నా మొఱాలింపఁడే మొఱఁగుల
మొఱ లెఱుంగుచుఁదన్ను మొఱఁగువాఁడు

తే. నఖిల రూపులుఁ దనరూప మైనవాఁడు
నాది మ ధ్యాంతములు లేక యడరువాఁడు
భ క్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె చూడఁడె తలఁపఁడె వేగ రాఁడె. 25

క. విశ్వకరు విశ్వదూరుని
విశ్వాత్మకు విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమపురుషు నే భజియింతున్. 26

శా. లా వొక్కింతయు లేదు, ధైర్యము విలోలం బయ్యెఁ, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్

నీవే తప్ప నితఃపరం బెఱుఁగ, మన్నింపందగున్ దీనునిన్,
రావే యీశ్వర ! కావవే వరద ! సంరక్షింపు భద్రాత్మకా ! 27

ఉ. ఓ కమలాప్త ! యో వరద ! యో ప్రతిపక్ష విపక్షదూర ! కు
య్యో ! కవి యోగి వంద్య ! సుగుణోత్తమ ! యో శరణాగతామరా
నోకహ ! యో మునీశ్వర మనోహర ! యో విపులప్రభావ ! రా
వే, కరుణింపవే, తలఁపవే, శరణార్థిని నన్నుఁ గావవే. 28

గజేంద్రుని రక్షింప శ్రీహరి పయనము

మ. అల వైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబు దా
పల మందార వనాంత రామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము "పాహి పాహి" యనఁ గుయ్యాలించి సంరంభియై. 29

మ. సిరికిం జెప్పఁడు శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తర ధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోద్ధత శ్రీ కుచో
పరి చేలాంచల మైన వీడఁడు గజప్రాణావనోత్సాహి యై. 30

మ. తన వేంచేయు పదంబుఁ బేర్కొనఁ డనాథ స్త్రీ జనాలాపముల్
వినెనో, మ్రుచ్చులు మ్రుచ్చిలించిరొ ఖలుల్ వేదప్రపంచంబులన్
దనుజానీకము దేవతా నగరిపై దండెత్తెనో, భక్తులం
గని చక్రాయుధుఁ డేఁడి చూపుఁడని ధిక్కారించిరో దుర్జనుల్. 31

మ. తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్, దాని వె
న్కను బక్షీంద్రుఁడు, వాని పొంతను ధనుః కౌమోదకీ శంఖ చ

క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండుఁ దా వచ్చి రా
య్యైన వైకుంఠపురంబునం గలుగువా రాబాల గోపాలమున్. 32

శా. తాటంకాచలనంబుతో, భుజ నట ద్ధమ్మిల్ల బంధంబుతో,
శాటీ ముక్త కుచంబుతో, నదృఢ చంచ త్కాంచితో, శీర్ణ లా
లా టాలేపముతో, మనోహర కరాలగ్నో త్తరీయంబుతోఁ
గోటీందు ప్రభతో, నురోజ భర సంకోచ ద్వలగ్నంబుతోన్. 33

క. అడిగెద నని కడువడిఁ జను
నడిగిన దను మగుడ నుడుగఁ డని నడ యుడుగున్
వెడ వెడ సిడిముడి తడఁబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్. 34

మ. వినువీథిం జనుదేరఁ గాంచి రమరుల్ విష్ణున్ సురారాతి జీ
వనసంప త్తి నిరాకరిష్ణుఁ గరుణా వర్ధిష్ణు యోగీంద్ర హృ
ద్వన వ ర్తిష్ణు సహిష్ణు భ క్తజన బృంద ప్రాభ వాలంకరి
ష్ణు నవోఢోల్లస దిందిరా పరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్. 35

మ. చనుదెంచెన్ ఘనుఁ డల్లవాఁడె హరి పజ్జం గంటిరే లక్ష్మి శం
ఖనినాదం బదె చక్ర మల్లదె భుజంగధ్వంసియున్ వాఁడె క్ర
న్నన నేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణా యేతి ని
స్వను లై మ్రొక్కిరి మింట హ స్తిదురవస్థావక్రికిం జక్రికిన్. 36

చక్ర ప్రశంస

మ. కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగా బంపె స
త్వరితాకంపిత భూమిచక్రము మహోద్య ద్విస్ఫులింగ చ్ఛటా
పరిభూ తాంబర శుక్రమున్ బహువిధ బ్రహ్మాండభాండ చ్ఛటాం
తర నిర్వక్రము బాలి తాఖిల సుధాంధ శ్చక్రముం జక్రమున్. 37

పాంచజన్య వర్ణనము

శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ, గృపాంభోరాశి సౌజన్యమున్
భూరిధ్వాన చలాచలీకృత మహాభూత ప్రచైతన్యమున్
సారోదార సితప్రభా చకిత పర్జన్యాది రాజన్యమున్
దూరీభూత విపన్న దైన్యమును, నిర్ధూత ద్విష త్సైన్యమున్. 38

భయము తప్పిన గజేంద్రుడు

మ. తమముం బాసిన రోహిణీవిభు క్రియన్ దర్పించి, సంసారదుః
ఖము వీడ్కొన్న విరక్తచిత్తుని గతిన్ గ్రాహంబు పట్టూడ్చి పా
దము లల్లార్చి, కరేణుకావిభుఁడు సౌందర్యంబుతో నొప్పె సం
భ్రమ దాశా కరిణీ కరోజ్ఝిత సుధాంభస్స్నాన విశ్రాంతుఁ డై. 39

విష్ణుభక్తి మహిమ

ఆ. కర్మతంత్రుఁ డగుచుఁ గమలాక్షుఁ గొల్చుచు
నుభయనియతవృత్తి నుండెనేనిఁ
జెడును గర్మమెల్ల శిథిల మై మెల్లనఁ
బ్రబల మైన విష్ణుభక్తి చెడదు. 40

క. చెడుఁగరులు హరులు ధనములుఁ
జెడుదురు నిజసతులు సుతులుఁజెడు చెనఁటులకున్
జెడక మను నెఱసుగుణులకుఁ
జెడని పదార్థములు విష్ణుసేవా నిరతుల్. 41

క. దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవనఁ బొందన్
దీనావన! నీ కొప్పును
దీనపరాధీన! దేవదేవ! మహేశా! 42



మహాభాగవత కల్పకుసుమమాల

షష్ఠమ గుచ్ఛము

(వామనావతార కథ)

వామన జన్మ

మ. రవి మధ్యాహ్నమునం జరింప గ్రహ తారాబద్ధ చంద్రస్థితిన్
శ్రవణ ద్వాదశినాఁడు శ్రోణ నభిజి త్సంజ్ఞాత లగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిం బుణ్య వ్రతోపేతకున్
దివిజాధీశ్వరు మాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్. 1

బలి వర్ణనము

మ. ఇతఁడే దానవచక్రవర్తి సురలోకేంద్రాగ్ని కాలాది ది
క్పతి గర్వాపనయ ప్రవర్తి గత లోభస్ఫూర్తి నానామఖ
వ్రత దాన ప్రవణానువర్తి సుమనోరామా మనోభేదనో
ద్ధత చంద్రాతపకీర్తి సత్య కరుణా ధర్మోల్లస న్మూర్తి దాన్. 2

శా. అర్థుల్ వేఁడరు దాతలుం జెడరు సర్వారంభమున్ పండుఁ బ్ర
త్యర్థుల్ లేరు మహోత్సవంబులను దేవాగారముల్ వొల్చుఁ బూ
ర్ణార్థుల్ విప్రులు వర్షముల్ గురియఁ గాలార్హంబులై ధాత్రికిన్
సార్థం బయ్యె వసుంధరాత్వ మసురేంద్రాధీశ రాజ్యంబునన్. 3

వామనమూర్తి బలియజ్ఞశాలకు వచ్చుట

క. ప్రక్షీణ దివిజవల్లభ
రక్షాపరతంత్రుఁ డగుచు రాజీవాక్షుం

డా క్షణమున బలియింటికి
భిక్షాగమనంబు సేసెఁ బేదఱికముతోన్. 4

శా. శంభుండో, హరియో, పయోజభవుఁడో, చండాంశుఁడో, వహ్నియో,
దంభాకారత వచ్చెఁ గాక, ధరణిన్ ధాత్రీసురుం డెవ్వఁ డీ
శుంభద్ద్యోతనుఁ డీ మనోజ్ఞతనుఁ డంచున్ విస్మయభ్రాంతులై
సంభాషించిరి బ్రహ్మచారిఁ గని, తత్సభ్యుల్ రహస్యంబునన్. 5

క. గుజగుజలు వోవువారును
గజిబిజి పడువారు చాలఁ గంకల పడుచున్
గజిబిజి యైరి సభాస్థలిఁ
బ్రజలెల్లను బొట్టివడుగు పాపని రాకన్. 6

సీ. చవులుగాఁ జెవులకు సామగానంబులు
సదివెడు హోతల చదువు వినుచు
మంత్రతంత్రార్థ సంబంధభావంబులు
గొనియాడు యాజులఁ గూడికొనుచు
హోమకుండంబులం దున్న త్రేతాగ్నుల
వెలిఁగించు యాజకవితతిఁ గనుచు
దక్షులై బహువిధాధ్వర విధానంబులు
సెప్పెడు సభ్యులఁ జేరఁ జనుచు

తే. బెట్టుగోరెడు వేడుక పట్టుపఱుప
సదితిపుట్టువు లచ్చికి నాటపట్టు
కోరి చరియించె సభలోనఁ గొంతతడవు
పొట్టి వెన్నుఁడు నెఱుఁగని పొట్టివడుగు. 7

బలి వామన సంవాదము

ఉ. స్వస్తి జగత్త్రయీ భువన శాసనకర్తకు హాసమాత్ర వి
ధ్వస్త నిలింపభర్తకు నుదారపద వ్యవహర్తకున్ మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధానవిహర్తకు నిర్జరీ గళ
న్యస్త సువర్ణసూత్ర పరిహర్తకు దానవలోక భర్తకున్. 8

మ. వడుగా! యెవ్వరివాఁడ వెవ్వఁడవు సంవాసస్థలం బెయ్యది
య్యెడకున్ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మమున్
గడు ధన్యాత్ముఁడ నైతి నీ మఖము యోగ్యం బయ్యె నా కోరికల్
గడతేఱెన్ సుహుతంబు లయ్యె శిఖులుం గల్యాణ మిక్కాలమున్. 9

మ. వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీఖండమొ కాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా! 10

సీ. ఇది నాకు నెలవని యేరీతిఁ బలుకుదు
నొకచో టనక నిండి యుండనేర్తు
నెవ్వనివాఁడ నం చేమని పలుకుదు
నాయంతవాఁడ నై నడవనేర్తు
నీ నడవడి యని యెట్లు పక్కాణింతుఁ
బూని ముప్పోకలఁ బోవనేర్తు
నదినేర్తు నిదినేర్తు నని యేల చెప్పఁగ
నేరుపు లన్నియు నేన నేర్తు

షష్ఠమ గుచ్ఛము

ఆ. వారలు గారు నాకు వారలకు నే నౌదు
నొంటివాఁడఁ జుట్ట మొకఁడు లేఁడు
సిరియుఁ దొల్లిఁ గలదు సెప్పెద నా వెంకి
సుజనులందుఁ దజముఁ జొచ్చియుండ్రు. 11

ఆ. ఒంటివాఁడ నాకు నొకటి రెం డడుగుల
మేర యిమ్ము సొమ్ము మేర యొల్లఁ
గోర్కెదీర బ్రహ్మకూఁకటి ముట్టెద
దానకుతుకసాంద్ర ! దానవేంద్ర ! 12

మ. వసుధాఖండము వేఁడితో గజములన్ వాంఛించితో వాజులన్
వెస నూహించితొ కోరితో యువతులన్ వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు నేర వీ వడుగ నీ భాగ్యంబు లీపాటిగా
కసురేంద్రుండు పదత్రయం బడుగ నీ యల్పంబు నీ నేర్పునే. 13

మ. గొడుగో జన్నిదమో కమండలువొ నాకున్ ముంజియో దండమో
వడు గే నెక్కడ భూము లెక్కడ కరుల్ వామాక్షు లశ్వంబు లె
క్కడ నిత్యోచితకర్మ మెక్కడ మదాకాంక్షామితం బైన మూ
డడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటయె బ్రహ్మాండంబు నాపాలికిన్. 14

సీ. సంతుష్టుఁ డీ మూఁడుజగములఁ బూజ్యుండు
సంతోషి కెప్పుడు జరుగు సుఖము
సంతోషి గాకుంట సంసారహేతువు
సంతసంబున ముక్తిసతియు దొరకుఁ
బూఁటపూఁటకు జగంబున యదృచ్ఛాలాభ
తుష్టినిఁ దేజంబు తోన పెరుఁగు

ఆ. బ్రతుకవచ్చుఁ గాక బహుబంధనము లైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనము లైనఁ జెడుఁగాక పడుఁగాక
మాట దిరుగలేరు మానధనులు. 19

క. ధాత్రిని హలికునకు సు
క్షేత్రము బీజములు లెస్స చేకుఱు భంగిం
జిత్రముగ దాత కీవియుఁ,
బాత్రము సమకూఱునట్టి భాగ్యము గలదే. 20

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వా రేరీ సిరి మూటఁగట్టుకొని పోవం జాలిరే భూమిపైఁ
బే రైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యి క్కాలమున్ భార్గవా! 21

మ. నిరయం బైన నిబంధ మైన ధరణీనిర్మూలనం బైన దు
ర్మరణం బైన కులాంత మైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
హరుఁ డైనన్ హరి యైన నీరజభవుం డభ్యాగతుం డైన నోఁ
దిరుగ న్నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య! వే యేటికిన్. 22

శా. ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపైఁ నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్న మ
ర్యాదం జెందు కరంబు గ్రిం దగుట మీఁ దై నా కరం బుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే. 23

క. మేరువు తలక్రిం దైనను
బారావారంబు లింకఁ బాఱిన లోలో
ధారుణి రజ మై పోయినఁ
దారాఢ్యముఁ బద్ధ మైనఁ దప్పక యిత్తున్. 24

పరితోషహీనతఁ బ్రభ చెడిపోవును
జలధార ననలంబు సమయునట్లు

ఆ. నీవు రాజ వనుచు నిఖిలంబు నడుగుట
తగవు గాదు నాకుఁ దగినకొలఁది
యేను వేఁడికొనిన యీ పదత్రయమును
చాల దనక యిమ్ము చాలు చాలు. 15

శుక్రాచార్యులు బలిని వారించుట

మ. కులమున్ రాజ్యము తేజమున్ నిలుపు మీ కుబ్జుండు విశ్వంభరుం
డలఁతిం బోఁడు త్రివిక్రమస్ఫురణవాఁ డై నిండు బ్రహ్మాండమున్
గలఁడే మాన్ప నొకండు నా పలుకు లాకర్ణింపు కర్ణంబులన్
వల దీ దానము గీనమున్ బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా ! 16

ఆ. వారిజాక్షులందు వైవాహికములందుఁ
బ్రాణ విత్త మాన భంగమందుఁ
జకిత గోకులాగ్రజన్మ రక్షణమందు
బొంకవచ్చు నఘము వొందదధిప ! 17

బలి సత్య వాక్పాలనము

మత్తకోకిల. ఎన్నఁడుం బరు వేఁడఁబోఁడఁట యేకలం బఁట కన్నవా
రన్నదమ్ములు నైన లేరఁట యన్నివిద్యల మూలగో
ష్ఠి న్నెఱింగిన ప్రోడ గుజ్జఁట చేతు లొగ్గి వసించ నీ
చిన్నిపాపనిఁ ద్రోసిపుచ్చఁగఁ జిత్త మొల్లదు సత్తమా ! 18

ఆ. బ్రతుకవచ్చుఁ గాక బహుబంధనము లైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనము లైనఁ జెడుఁగాక పడుఁగాక
మాట దిరుగలేరు మానధనులు. 19

క. ధాత్రిని హాలికునకు సు
క్షేత్రము బీజములు లెస్స చేకుఱు భంగిం
జిత్రముగ దాత కీవియుఁ,
బాత్రము సమకూఱునట్టి భాగ్యము గలదే. 20

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వా రేరీ సిరి మూటఁగట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
బే రైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యి క్కాలమున్ భార్గవా! 21

మ. నిరయం బైన నిబంధ మైన ధరణీనిర్మూలనం బైన దు
ర్మరణం బైన కులాంత మైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
హరుఁ డైనన్ హరి యైన నీరజభవుం డభ్యాగతుం డైన నౌఁ
దిరుగ న్నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య! వే యేటికిన్. 22

శా. ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపైఁ నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్న మ
ర్యాదం జెందు కరంబు గ్రిం దగుట మీఁ దై నా కరం బుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే. 23

క. మేరువు తలక్రిం దైనను
బారావారంబు లింకఁ బాఱిన లోలో
ధారుణి రజ మై పోయినఁ
దారాధ్వముఁ బద్ధ మైనఁ దప్పక యిత్తున్. 24

ఆ. కమలనాథు నెఱిఁగి కాలంబు దేశంబు
నెఱిఁగి శుక్రు మాట లెఱిఁగి నాశ
మెఱిఁగి పాత్ర మనుచు నిచ్చె దానము బలి
మహి వదాన్యుఁ డొకఁడు మఱియుఁ గలఁడె. 25

ఆ. పుట్టి నేర్చుకొనెనొ పుట్టక నేర్చెనో
చిట్టి బుద్ధు లిట్టి పొట్టి వడుగు
పొట్టనున్న వెల్ల బూమెలు నని నవ్వి
యెలమి ధరణిదాన మిచ్చె నపుడు. 26

వామన విజృంభణము

మ. అమరారాతి కరాక్ష తోజ్ఝిత పవిత్రాంభః కణశ్రేణికిం
గమలాధీశ్వరుఁ డొడ్డె ఖండిత దివౌకస్స్వామి జిహ్మ హస్తముం
గమలాకర్షణ సుప్రశస్తము రమాకాంతా కచోపాస్తమున్
విమల శ్రీకుచ శాత చూచుకతటీ విన్యస్తమున్ హస్తమున్. 27

మ. బలిదైత్యేంద్ర కరద్వయీకృత జలప్రక్షాళన వ్యాప్తికిన్
జలజాతాక్షుఁడు సాఁచె యోగిసుమన స్సంప్రార్థిత శ్రీదమున్
గలితానమ్ర రమాలలాట పదవీ కస్తూరికా శాదమున్
నళినామోదము రత్ననూపురిత నానావేదముం బాదమున్. 28

శా. ఇంతింతై వటుఁ డింత యై మఱియుఁ దా నింతై నభోవీథిపై
నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంత యై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధి యై. 29

మ. రవిబింబం బుపమింపఁ బాత్ర మగు ఛత్రం బై శిరోరత్న మై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణ కేయూర మై
ఛవిమ త్కంకణమై కటిస్థలి నుదంచ ద్వస్త్ర మై నూపుర
ప్రవరం బై పదపీఠ మై వటుఁడు దా బ్రహ్మాండము న్నిండుచోన్. 30

ఆ. జగము లెల్ల దాఁటి చనిన త్రివిక్రము
చరణ నఖరచంద్ర చంద్రికలను
బొనుఁగు వడియె సత్యమున బ్రహ్మతేజంబు
దివసకరుని రుచుల దివియ భంగి. 31



మహాభాగవత కల్పకుసుమమాల

సప్తమ గుచ్ఛము
(శ్రీ రామావతార వర్ణనము)

క. శ్రీకంఠచాప ఖండన !
పాకారిప్రముఖ వినుతభండన ! విలసత్
కాకుత్స్థవంశ మండన !
రాకేందుయశోవిశాల ! రామనృపాలా ! 1

క. శ్రీరాజిత! మునిపూజిత!
వారిధి గర్వాతిరేక వారణ బాణా!
సూరిత్రాణ! మహోజ్జ్వల
సారయశస్సాంద్ర! రామచంద్రనరేంద్రా! 2

క. రాజీవసదృశలోచన !
రాజీవభవాది దేవరాజవినుత ! వి
భ్రాజిత కీర్తిలతావృత !
రాజీవభవాండభాండ ! రఘుకులతిలకా ! 3

క. జనకసుతా హృచ్చోరా !
జనక వచోలబ్ధ విపిన శైల విహారా !
జన కామిత మందారా !
జనకాది మహేశ్వరాతిశయ సంచారా ! 4

శ్రీరామ జననము

మ. అమరేంద్రాశకుఁ బూర్ణచంద్రుఁ డుదితుం డై నట్లు నారాయణాం
శమునం బుట్టె మదాంధ రావణ శిరస్సంఘాత సంఛేదన
క్రమణోద్దాముఁడు రాముఁ డా గరితకున్ గౌసల్యకుం సన్నుతా
సమ నైర్మల్యకతుల్య కంచిత జను స్సంసార సాఫల్యకున్. 5

వివాహము

క. భూతలనాథుఁడు రాముఁడు
ప్రీతుం డై పెండ్లియాడె పృథుగుణమణి సం
ఘాతన్ భోగ్యోపేతన్
సీతన్ ముఖకాంతి విజిత సితఖద్యోతన్. 6

దండకారణ్యము

ఉ. పుణ్యుఁడు రామచంద్రుఁ డటు వోయి ముదంబున గాంచె దండకా
రణ్యముఁ దాపసోత్తమ శరణ్యము నుద్ధత బర్హిబర్హ లా
వణ్యము గౌతమీ విమల వాఃకణ పర్యటన ప్రభూత సా
ద్గుణ్యము నుల్లసత్తరు నికుంజ వరేణ్యము నగ్రగణ్యమున్. 7

సముద్రుడు ప్రార్థించుట

శా. ఆ రాజేంద్రుఁడు గాంచె భూరి విధ రత్నాగారమున్ మీన కుం
భీర గ్రాహ కఠోరమున్ విపుల గంభీరంబు నభ్రభ్రమ
ద్ఘోరానోకహ విభిన్న భంగ భవ నిర్ఘోష చ్ఛటాంభఃకణ
ప్రారబ్ధాంబర పారమున్ లవణ పారావారమున్ జేరువన్. 8

శా. ఓ కాకుత్స్థ కులేశ! యోగుణనిధీ! యో దీనమందార! నే
నీ కోపంబున కెంతవాఁడ జడధిన్ నీ వేమి భూరాజవే
లోకాధీశుఁడ వాదినాయకుఁడ వీ లోకంబు లెల్లప్పుడున్
నీకుక్షిన్ బ్రభవింపుచుండు నడఁగు న్నిక్కంబు సర్వాత్మకా ! 9

రావణ సంహారము

మ. బలువింటన్ గుణటంకృతంబు నిగుడన్ బ్రహ్మాండ భీమంబుగాఁ
బ్రళయోగ్రానల సన్నిభం బగు మహాబాణంబు సంధించి రా
జలలాముం డగు రాముఁ డేసె ఖర భాషాశ్రావణున్ దేవతా
బల విద్రావణు వైరిదారజన గర్భస్రావణున్ రావణున్. 10

అశోకవనిలో రాముడు సీతను దర్శించుట

శా. దైతేయ ప్రమదా పరీత నతిభీతన్ గ్రంథి బంధాలత
వ్రాతన్ విశ్వసనానిలాశ్రుకణ జీవం జీవ దారామ భూ
జాతన్ శుష్క కపోలకీలిత కరాబ్జాతన్ బ్రభూతక్షు గృశీ
భూతన్ బ్రాణసమేత సీతఁ గనియెన్ భూమీశుఁ డా ముందటన్. 11

విభీషణుని పట్టాభిషేకము

ఉ. శోషిత దానవుండు నృపసోముఁడు రాముఁడు రాక్షసేంద్రతా
శేష విభూతిఁ గల్పి సమజీవివి గమ్మని నిల్పె నర్థి సం
తోషణుఁ బాపశోషణు నదూషణు శశ్వ దరోషణున్ మితా
భాషణు నార్యతోషణుఁ గృపాగుణ భూషణు న వ్విభీషణున్. 12

రామరాజ్యము

సీ. పొలఁతుల వాలుఁజూపుల యందె చాంచల్య
మబలల నడుములయందె లేమి
కాంతాలకములందె కౌటిల్యసంచార
మతివల నడుపులయందె జడిమ
ముగుదల పరిరంభములయందె పీడన
మంగనాకుచములయందె పోరు
పడఁతుల రతులందె బంధ సద్భావంబు
సతులఁ బాయుటయందె సంజ్వరంబు

తే. ప్రియులు ప్రియురాండ్ర మనముల వెరసి కొల్ల
లందె చౌర్యంబు వల్లభు లాత్మసతుల
నాఁగి క్రొమ్ముళ్ళు పట్టుటం దక్రమంబు
రామచంద్రుడు పాలించు రాజ్యమందు. 13

క. తండ్రిక్రియ రామచంద్రుఁడు
దండ్రుల మఱపించి ప్రజలఁ దా రక్షింపన్
దండ్రుల నందఱు మఱచిరి
దండ్రిగ వా రామచంద్ర ధరణిపుఁ దనుచున్. 14

సీత

ఆ. సిగ్గువడుట గల్గి సింగారమును గల్గి
భక్తి గల్గి చాల భయము గల్గి
నయముఁ బ్రియముఁ గల్గి నరనాథు చిత్తంబు
సీత దనకు వశము చేసికొనియె. 15

ఉ. నల్లనివాఁడు పద్మనయంబులవాఁడు మహాశుగంబులన్
విల్లును దాల్చువాఁడు గడు విప్పగు వక్షమువాఁడు మేలు పైఁ
జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యశంబు దిక్కులం
జల్లెడువాఁడు నైన రఘుసత్తముఁ డీవుత మా కభీష్టముల్. 16

ఆ. రామచంద్రుఁ గూడి రాకల పోకలఁ
గదిసి తిరుగువారుఁ గన్నవారు
నంటికొన్నవారు నా కోసలప్రజ
లరిగి రాదియోగు లరుగు గతికి. 17

క. శ్రీ మహిత వినుత దివిజ
స్తోమ ! యశస్సీమ ! రాజసోమ ! సుమేరు
స్థేమ, వినిర్జిత భార్గవ
రామ! దశానన విరామ ! రఘుకులరామా ! 18



మహాభాగవత కల్పకుసుమమాల

అష్టమ గుచ్ఛము

(శ్రీకృష్ణలీలావతార కథనము)

శ్రీకృష్ణ జననము

సీ. స్వచ్ఛంబులై పొంగె జలరాసు లేడును
గల ఘోషణముల మేఘంబు లుఱిమె
గ్రహతారకలతోడ గగనంబు రాజిల్లె
దిక్కులు మిక్కిలి తెలివిఁ దాల్చెఁ
గమ్మని చల్లని గాలి మెల్లన వీచె
హోమానలంబు చెన్నొంది వెలిఁగెఁ
గొలఁకులు కమలాళి కులములై సిరి నొప్పెఁ
బ్రవిమలతోయ లై పాఱె నదులు
తే. వర పుర గ్రామ ఘోష యై వసుధ యొప్పె
విహగరవ పుష్ప ఫలముల వెలసె వనము
లలరు సోనలు గురిసి ర య్యమరవరులు
దేవదేవుని దేవకీదేవి కనఁగ. 1

వసుదేవకృత కృష్ణస్తుతి

సీ. జలధరదేహు నాజాను చతుర్బాహు
సరసీరుహాక్షు విశాలవక్షుఁ
జారు గదా శంఖ చక్ర పద్మ విలాసుఁ
గంఠ కౌస్తుభమణి కాంతిభాసుఁ

గమనీయ కటిసూత్ర కంకణ కేయూరు
శ్రీవత్సలాంఛ నాంచితవిహారు
సురకుండల ప్రభాయుత కుంతల లలాటు
వైడూర్య మణిగణ వరకిరీటు

తే. బాలుఁ బూర్ణేందు రుచిజాలు భక్తలోక
పాలు సుగుణాలవాలుఁ గృపావిశాలుఁ
జూచి తిలకించి పులకించి చోద్య మంది
యుబ్బి చెలరేఁగి వసుదేవుఁ డుత్సహించె. 2

క. ఈ పురుటి యింటి కుద్య
ద్దీపంబును బోలి చాల దీపించు నిజం
బీ పాపఁడు నలుమొగముల
యా పాపని గనినమేటి యగు నని భక్తిన్. 3

క. ఏ నిన్ను నఖిలదర్శను
జ్ఞానానంద స్వరూపు సంతతు నపరా
ధీనుని మాయాదూరుని
సూనునిఁగాఁ గంటి నిట్టి చోద్యము గలదే ! 4

క. అచ్చుగ నీ మాయల మును
వెచ్చెరఁ ద్రిగుణాత్మకముగఁ జేసిన జగముం
జొచ్చిన క్రియ జొరకుండవు
చొచ్చుటయును లేదు లేదు చొరకుండుటయున్. 5

సీ. అనిశము నెట్టిన మహాభాషలఁ బోలెడి
వై వేఱువేఱై యన్నివిధము

అష్టమ గుచ్ఛము

లగు సూక్ష్మభూతంబు లమర షోడశ వికా
రములతోఁ గూడి విరాట్టనంగఁ
బరమాత్మనకు నీకు బజపైన మేను సం
పాదించి యందులోఁ బడియుఁ బడక
యుండు సృష్టికి మున్న యున్న కారణమున
వానికి లోని భవంబు గలుగ

ఆ. దట్లు బుద్ధి నెఱుఁగ నను వైన లాగునఁ
గలుగు నింద్రియముల కడల నుండి
వాని పట్టు లేక వరుస జగంబులఁ
గలసియుండి యైనఁ గలయ వెపుడు. 6

దేవకీకృత కృష్ణస్తుతి

సీ. అట్టిట్టి దనరానిదై మొదలై నిండు
కొన్నదై వెలుఁగుచు గుణము లేని
దై యొక్కచందంబు దై కలదియై నిర్వి
శేష మై క్రియ లేక చెప్పరాని
నీ రూప మని శ్రుతు లెప్పుడు నొడివెడి
యా రూప మగుచు నధ్యాత్మదీప
మై బ్రహ్మ రెండవ యర్ధంబు తుది జగం
బులు నశింపఁగఁ బెద్ద భూత గణము

ఆ. సూక్ష్మభూతమందుఁ జొరఁగ నా భూతంబు
ప్రకృతిలోనఁ జొరఁగఁ బ్రకృతి వోయి
వ్యక్తమందుఁ జొరఁగ వ్యక్త మణంగను
శేషసంజ్ఞ నీవు చెలువ మగుదు. 7

ఉ. విశ్వము లీలఁ ద్రిప్పుచు నవిద్యకు జుట్టమ వైన నీకు నా
శాశ్వత మైన కాల మిది సర్వము వేడబ మందు రట్టి వి
శ్వేశ్వర! మేలునప్ప! నిను నెప్పుడుఁ గోరి భజించువాఁడె పో
శాశ్వత లక్ష్మి మృత్యుజయ సౌఖ్యయుతుం డభయుండు మాధవా ! 8

మత్తకోకిల. ఒంటి నిల్చి పురాణయోగులు యోగమార్గ నిరూఢు లై
కంటి మందురు గాని నిక్కము గాన రీ భవదాకృతిన్
గంటి భద్రముఁ గంటి మాంసపుఁ గన్నులం గనఁబోలదీ
తొంటి రూపుఁ దొలంగఁబెట్టుము తోయజేక్షణ! మ్రొక్కెదన్.

ఆ. విలయకాలమందు విశ్వంబు నీ పెద్ద
కడుపులోనఁ దాఁచు కడిమి మేటి
నటుఁడ వీవు నేఁడు నా గర్భజుఁడ వౌట
పరమపురుష! వేడబంబు గాదె. 10

పసికందును చంపవలదని దేవకి కంసుని ప్రార్థించుట

ఉ. అన్న! శమింపు మన్న! తగ దల్లుడు గాఁ డిది! మేనగోడ లౌ
మన్నన సేయు మన్న! విను మానినిఁ జంపుట రాచపాడి గా
దన్న! సుకీర్తివై మనఁగదన్న! మహాత్ములు వోవు త్రోవఁ బో
వన్న! భవత్సహోదరిఁ గదన్న! నినున్ శరణంబు వేఁడెదన్. 11

యశోదకు కృష్ణుడు పుట్టెనని గోపాలకులు వేడుకలు చేయుట

ఆ. ఏమి నోముఫలమొ యింత ప్రొద్దాకవార్త
వింటి మబలలార! వీను లలర
మనయశోద చిన్ని మగవానిఁ గనెనఁట
చూచి వత్తమమ్మ! సుదతులార! 12

క. పల్లవ తోరణ రాజిత
వల్లీ ధ్వజరాజ ధూప వాసనములతో
సల్లలితము లై యొప్పెను
వల్లవవల్లభుల యిండ్ల వాకిం డ్లెల్లన్. 13

క. పసుపులు నూనెలు సలఁదిన
పసఁ దనరి సువర్ణ బర్హిబర్హ ప్రభతోఁ
బసిమి గలిగి వెలుఁగొందుచుఁ
బసు లన్నియు మందలందుఁ బ్రసరించె నృపా! 14

క. క్రేళ్ళుఱికి మసలె లేఁగలు
మల్లడి గొని ఱంకె లిడియె మదవృషభంబుల్
పెల్లుగ మొదవుల పొదుఁగుల
జల్లించెఁ బాలు బాలు సంభవవేళన్. 15

క. కంచుకములు తల చుట్లును
గాంచన భూషాంబరములుఁ గడు మెఱయఁగ నే
తెంచిరి గోపకు లందఱు,
మంచిపదార్థములు గొనుచు మాధవుఁ జూడన్. 16

క. ఏతెంచి చూచి చెలఁగుచు,
నేతులఁ బెరుఁగులను బాల నీళ్ళను వెన్నం
బ్రీతి వసంతము లాడిరి
యాతుర లై సరసభాష లాడుచు గొల్లల్. 17

ఉ. వేడుకతోడఁ గ్రొమ్ముత్తులు పేఁగ నురోపరిహారరేఖ లి
ల్లాడఁ గపోలపాలికల హాటకపత్త్ర పదమ్ విరోచకం

జాడఁ బటాంచలంబు లసియాడఁగ జేరి యశోదయింటికిన్
జేడియ లేగి చూచి రాగి జిష్ణుని విష్ణునిఁ జిన్ని కృష్ణునిన్. 18

తే. పాపనికి నూనెఁ దలయంటి పసుపుఁ బూసి
బోరుకాడించి హరిరక్ష పొమ్మటంచు
జలము లొకకొన్ని చుట్టి రాఁ జల్లి తొట్ల
నునిచి దీవించి పాడి ర య్యువిద లెల్ల. 19

క. జోజో కమలదళేక్షణ!
జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!
జోజో పల్లవకరపద!
జోజో పూర్ణేందు వదన జోజో యనుచున్. 20

శ్రీకృష్ణుడు గోకులమున పెరుగుట

సీ. ఏబాము లెఱుఁగక యేపారు గట్టికిఁ
బసుల కాపరి యింటఁ బాము గలిగె
నే కర్మములు లేక యెనయు నెక్కటికిని
జాతకర్మంబులు సంభవించె
నే తల్లి చనుఁబాలు నెఱుఁగని ప్రౌఢ య
శోద చన్నుల పాలఁజొరవ యెఱిఁగె
నే హానివృద్ధులు నెఱుఁగని బ్రహ్మంబు
పొదిఁగిటితో వృద్ధిఁ బొందఁ జొచ్చె

తే. నే తపముల నైన నెఱుఁగఁ బండని పంట
వల్లవీజనముల పాలఁ బండె

నే చదువుల నైన నిట్టిట్టి దనరాని
యర్థ మసయవముల నంద మొందె. 21

మ. చెయువుల్ సేయుతఱిన్ విఘాతకరణిం జెన్నొందు సంతోష దృ
ష్టియుతుం డై నగుచున్ జనార్దనుని మాడ్కిన్ బొల్చు రోషించి యు
న్నయెడన్ రుద్రునిభంగి నొప్పును సుఖానందంబునుం బొంది త
న్మయుఁడై బ్రహ్మము భాతి బాలుఁ డమరున్ బాహుళ్య బాల్యంబునన్.22

పూతన సంహారము

క. విషధరరిపు గమనునికిని
విషగళ సఖునికిని విమల విష శయనునికిన్
విషభవభవ జనకునికిని
విషకుచ చనువిషముఁ గొనుట విషమే తలఁపన్ .23

క. వెన్నుని కొకమఱి విష మగు
చన్నిచ్చిన బాలహంత్రి చనె నఁట దివికిన్
వెన్నునిఁ గని పెంచుచుఁ దన
చన్నిచ్చిన సతికి మఱియు జన్మముఁ గలదే. 24

క. హరిఁ గని చన్నులు గుడిపెడు
తరుణులు ప్రాపించు పదము దలఁపన్ వశమే
హరి యారగింపుటకుఁ బా
ల్గురిసిన ధేనువులు ముక్తికొనలఁ జరించున్. 25

క. ఏ మధురయందుఁ బ్రియముగ
శ్రీమన్నారాయణుండు వెలుఁగును నిత్యం

బా మధుర సకలయాదవ
భూమీశుల కెల్ల మొదలిపురి యయ్యె నృపా ! 26

తరల. పసుపు లాడి యురోజ కుంకుమ పంక శోభిత లై లస
ద్వసన లై కచభార చంపకదామ లై సులలామ లై
పసిఁడిమాడల కాంతు లట్టులఁ బర్వఁ దేరులమీఁదఁ బెం
పెసఁగఁ బాడిరి వ్రేత లా హరి పేల లింపగు నేలలన్. 27

బలరామకృష్ణుల వర్ణనము

సీ. తలలెత్తి మెల్లనఁ దడవి యాడెడువేళ
పన్నగాధీశుల పగిదిఁ దాల్తు
రంగసంమృష్ట పంకాంగరాగంబుల
నేనుఁగుగున్నల యెత్తువత్తు
రసమంబు లైన జవాతిరేకంబుల
సింగంపుఁ గొదమల సిరి వహింతు
రాననంబుల కాంతు లంతంత కెక్కఁగ
బాలార్కచంద్రుల పగిదిఁ దోఁతు

తే. రెలమి తల్లుల చన్నుఁబా లెల్లఁ ద్రావి
పరమ యోగోద్భవామృత పానలీల
సోలి యోగులవిధమున సొంపుగందు
రా కుమారులు జనమనోహరు లగుచు. 28

తనువున నంటిన ధరణీపరాగంబు
పూసిన నెఱి భూతిపూఁత గాఁగ

ముందట వెలుఁగొందు ముక్తాలలామంబు
తొగలసంగడికాని తునుక గాఁగ
ఫాలభాగంబుపైఁ బరగు గావలిబొట్టు
కాముని గెల్చిన కన్ను గాఁగ
కంఠమాలికలోన ఘన నీలరత్నంబు
కమనీయ మగు మెడకప్పు గాఁగ

ఆ. హారవల్లు లురగహారవల్లులు గాఁగ
బాలులీల ప్రౌఢబాలకుండు
శివునిపగిది నొప్పె శివునికిం దనకును
వేఱులేమిఁ దెలుప వెలయునట్లు. 29

ఉ. చప్పుడు సేయకుండు మని జంకె యొనర్చిన నల్గి పోవఁగా
నప్పుడు బార సాచి తన నవ్వుల విందులు వచ్చి రంచు న
వ్వొప్పుఁగఁ జీరు తల్లిదెస కొత్తిలి కృష్ణుఁడు రంతు సేయుచు
న్నప్పుడు వచ్చి చన్గుడుచు నవ్వొలయన్ మొలగంట మ్రోయఁగన్. 30

క. వల్లవగృహ నవనీతము
లెల్లను భక్షించి వచ్చి యెఱుఁగని భంగిన్
దల్లిఁ గదిసి చిట్టాడుచు
నల్లన చను బువ్వఁ బెట్టు మవ్వా ! యనుచున్. 31

గోపికలు శ్రీకృష్ణుని అల్లరి చేష్టలను యశోదతో చెప్పుట

మత్తకోకిల. పుట్టి పుట్టఁడు నేఁడు దొంగిలబోయి మా ఱులు సొచ్చి తా
నుట్టి యందక ఱోలుఁ బీఁటలు నొక్కప్రో విడి యెక్కి చే
పెట్టఁజాలక కుండ క్రిం దొక పెద్దతూఁ టొనరించి మీ
పట్టి మీఁగడ పాలు చేరలఁ బట్టి త్రావెఁ దలోదరీ ! 32

క. ఓ యమ్మ! నీ కుమారుఁడు
మా యిండ్లను బాలు పెరుఁగు మననీఁ డమ్మా!
పోయెద మెక్కడి కైనను
మా యన్నల సురభు లాన మంజులవాణీ! 33

క. కడు లచ్చి గలిగెనేనియుఁ
గుడుతురు గట్టుదురు గాక కొడుకుల నగుచున్
బడుగుల వాడలపైఁ బడ
విడుతురె రాకాంత లెందు విమలేందుముఖీ! 34

శ్రీకృష్ణుడు తననోట యశోదకు విశ్వరూపము చూపుట

క. మ న్నేటికి భక్షించెదు
మ న్నియమము లేల నీవు మన్నింపవు నీ
యన్నయు సఖులును జెప్పెద
రన్నా! మ న్నేల మఱి పదార్థము లేదే? 35

శా. అమ్మా! మన్ను దినంగ నే శిశువనో యాఁకొంటినో వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరి మాటలు మది న్న న్నీవు కొట్టంగ వీ
రి మ్మార్గమ్ము ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీ యాస్య గం
ధ మ్మాఘ్రాణమ్ము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే. 36

విశ్వరూప దర్శనంతో యశోద పొందిన స్థితి

మ. కలయో వైష్ణవ మాయయో యితర సంకల్పార్థమో సత్యమో
తలపన్నేరక యున్నదాననొ యశోదాదేవిఁ గానో పర

స్థలమో బాలకుఁ డెంత యీతని ముఖస్థం బై యజాండంబు ప్ర
జ్వల మై యుండుట కేమి హేతువొ మహాశ్చర్యంబు చింతింపఁగన్. 37

ఆ. బాలమాత్రుఁ డగు సలీలుని ముఖమందు
విశ్వ మెల్ల నెట్లు వెలసి యుండు
బాలుభంగి నితఁడు భాసిల్లుఁ గాని స
ర్వాత్ముఁ డాదివిష్ణుఁ డగుట నిజము. 38

యశోదానందుల ధన్యత

ఆ. జగ దధీశ్వరునకుఁ జన్నిచ్చు తల్లిగా
నేమినోము నోఁచె నీ యశోద
పుత్రుఁ డనుచు నతనిఁ బోషించు తండ్రిగా
నందుఁ డేమి చేసె నందితాత్మ ! 39

క. ప్రబ్బిన భక్తిని హరిపైఁ
గబ్బంబులు సెప్పి కవులు కైవల్య శ్రీ
కబ్బుదు రఁట హరిపోషణ
మబ్బిన తలిదండ్రు లెచటి కబ్బుదురొ తుదిన్.

యశోద కృష్ణుని కట్ట ప్రయత్నించుట

క. గజ్జెలు ఘల్లని మ్రోయఁగ,
సజ్జలు ద్రొక్కుటలు మాని యతిజవమున యో
షిజ్జనములు నగఁ దల్లియుఁ,
బజ్జం జనుదేర నతఁడు పరువిడె నధిపా ! 40

మ. స్తనభారంబున డస్సి క్రుస్సి యస దై జవ్వాడు మధ్యంబుతో
జనితస్వేదముతోఁ జలత్కబరితో స్రస్తోత్తరీయంబుతో
వనజాతేక్షణ కూడఁబాఱి తిరిగెన్ వారించుచున్ వాకిటన్
ఘన యోగీంద్రమనంబులున్ వెనుకొనంగా లేని లీలారతున్. 41

సీ. స్తంభాదికంబులు దనకు నడ్డం బైన
నిట్టట్టు చని పట్టనీనివాని
నీ తప్పు సైరింపు మింక దొంగిలఁబోవ
నేనని మునుముట్ట నేడ్చువానిఁ
గాటుక నెఱయంగఁ గన్నులు నులుముచు
వెడలు కన్నీటితో వెగచువాని
నేదెస వచ్చునో యిది యని పలుమాఱు
సురుఁగుచుఁ గ్రేఁగంటఁ జూచువాని

ఆ. గూడఁబాఱి పట్టుకొని వెఱపించుచుఁ
జిన్ని వెన్నదొంగ చిక్కె ననుచు
నలిగి కొట్టఁ జేతు లాడక పూఁబోణి
కరుణతోడ బాలుఁ గట్టఁ దలఁచి 42

క. వీ రెవ్వరు శ్రీకృష్ణులు
గారా! యెన్నఁడును వెన్న గానరఁట కదా!
చోరత్వం బించుకయును
నేరరఁట, ధరిత్రి నిట్టి నియతులుఁ గలరే. 43

క. పట్టినఁ బట్టుపడని నినుఁ
బట్టెద మని చలము కొనినఁ బట్టుట బెట్టే

పట్టువడ వండ్రు పట్టి,
పట్టుకొనఁ నాకుఁ గాక పరులకు వశమే. 44

ఆ. పట్టి యలరుఁబోఁడి పట్టి యూతం డని
గట్టితలఁపుతోడఁ గట్టెఁ గాక
పట్టి కడుపు పెక్కు బ్రహ్మాండములు పట్టు
టెఱిఁగెనేని తల్లి యేలకట్టు. 45

ఆ. ఒడలఁ జెమట లెగయ నుత్తరీయము జాఱ
వీడియున్న తుఱుమువిరులు రాల
గట్టరాని తన్నుఁ గట్టెద నని చింతఁ
గట్టుకొన్న తల్లిఁ గరుణఁ జూచి. 46

క. బంధవిమోచనుఁ డీశుఁడు
బంధింపఁ బెనంగు జనని పాటోర్చి సుహృ
ద్బంధుఁడు గావున జననీ
బంధంబునఁ గట్టువడియెఁ బాటించి నృపా! 47

క. సంగడిఁ దిరిగెడు శంఖుఁడు
సంగాశ్రయ యైన సిరియు నాత్మజుఁడై యు
ప్పొంగెడు పద్మజుఁడును
గోపాంగనప్రకియఁ గరుణపడయ రఖిలేశ్వరుచేన్. 48

క. చిక్కఁడు సిరికౌఁగిటిలోఁ
జిక్కఁడు సనకాది యోగి చిత్తాబ్జములన్
జిక్కఁడు శ్రుతిలతికావళిఁ
జిక్కె నతఁడు లీలఁ దల్లిచేతన్ ఱోలన్. 49

క. జ్ఞానులచే మౌనులచే
దానులచే యోగ సంవిధానులచేతన్
బూని నిబద్ధుం డగునే
శ్రీనాథుఁడు భక్తియుతులచేతం బోలెన్. 50

శ్రీకృష్ణుని బృందావన విహారము

ఉ. నంద తపఃఫలంబు సుగుణంబుల పుంజము గోపకామినీ
బృందము నోముపంట సిరివిందు దయాంబుధి యోగిబృందముల్
డెందములందుఁ గోరెడి కడింది నిధానము చేరవచ్చెనో
సుందరులార ! రండు చని చూతము కన్నులకోర్కె తీరఁగన్. 51

ఉ. ఎన్నఁడు నైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయున్
గన్నలఁ గాన రట్టిహరిఁ గౌఁగిటఁ జేర్చుచుఁ జెట్టఁబట్టుచున్
దన్నుచు గ్రుద్దుచు న్నగుచుఁ దద్దయుఁ బై పడి కూడి యాడుచున్
మన్ననసేయు వల్లవకుమారుల భాగ్యము లింత యొప్పునే. 52

గోపాలకులతో చద్దులు తినుట

సీ. కడుపున దిండుగాఁ గట్టిన వలువలో
లాలిత వంశనాళంబుఁ జొనిపి
విమల శృంగంబును వేత్రదండంబును
జాఱి రానీక డాచంక నిఱికి
మీఁగడ పెరుఁగుతో మేళవించిన చల్ది
ముద్ద డాపలిచేత మొనయ నునిచి
చెలరేఁగి కొసరి తెచ్చిన యూరుఁగాయలు
వ్రేళ్ళసందులను దా వెలయ నిఱికి

ఆ. సంగడీల నడుమఁ జక్కనఁ గూర్చుండి
నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణుఁ డమరులు వెఱఁగంద
శైశవంబు మెఱసి చల్దిఁ గుడిచె. ౭౩

సీ. మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు
నూరుఁగాయలు దినుచుండు నొక్కఁ
డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి
చూడు లేదని నోరు చూపు నొక్క
డేగు రార్గురి చల్దు లెలమిఁ బన్నిదమాడి
కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ
డిన్నియుఁ దగఁ బంచి యిడుట నెచ్చెలితన
మనుచు బంతెనగుండు లాడు నొకఁడు

ఆ. కృష్ణుఁ జూడు మనుచుఁ గికురించి పరు మ్రోలి
మేలి భక్ష్యరాశి మెసఁగు నొకఁడు
నవ్వు నొకఁడు సఖుల నవ్వించు నొక్కఁడు
ముచ్చటాడు నొకఁడు మురియు నొకఁడు. ౭౪

బ్రహ్మ దర్శించిన శ్రీ కృష్ణుడు

శా. కర్ణాలంబిత కాకపక్షములతో గ్రైవేయ హారాళితో
స్వర్ణభ్రాజిత వేత్రదండకముతో సత్పింఛ దామంబుతోఁ
బూర్ణోత్సాహముతో ధృతాన్న కబళోత్ఫుల్లాబ్జ హస్తంబుతోఁ
దూర్ణత్వంబున నేగె లేఁగలకు నై మహాటవీవీథికిన్. ౭౫

సీ. శంపాలతికతోడి జలదంబు కైవడి
మెఱుఁగు టొల్లియతోడి మేనివానిఁ
గమనీయ మృదులాన్నకబళ వేత్ర విషాణ
వేణుచిహ్నంబుల వెలయువానిఁ
గుంజావినిర్మిత కుండలంబులవాని
శిఖిపింఛ వేష్టిత శిరమువాని
వనపుష్ప మాలికావ్రాత కంఠమువాని
నళినకోమల చరణములవానిఁ

ఆ. గరుణ గడలుకొనిన కడకంటివాని గో
పాలబాలు భంగిఁ బరఁగువాని
నగుమొగంబువాని ననుఁ గన్నతండ్రిని
నిను భజింతు మ్రొక్కి నీరజాక్ష! 56

శ్రీ కృష్ణుడు గోవుల గాయుట

సీ. వేదాంతవీథుల విహరించు విన్నాణి
విహరించుఁ గాంతార వీథులందు
ఫణిరాజ శయ్యపైఁ బవళించు సుఖభోగి
పల్లవశయ్యలఁ బవ్వళించు
గురుయోగి మానసగుహలఁ గ్రుమ్మరు మేటి
గ్రుమ్మరు నద్రీంద్ర గుహలలోనఁ
గమలతోడఁ బెనంగి కడు దయ్యు చతురుఁ డా
భీరజనులతోడఁ బెనఁగి డయ్యు

ఆ. నఖిలలోకమునకు నాశ్రయుం డగు ధీరుఁ
డలసి తరులనీడ నాశ్రయించు

యాగ భాగచయము లాహరించు మహాత్ముఁ
డడవిలోని ఫలము లాహరించు. 57

సీ. రా పూర్ణచంద్రిక ! రా గౌతమీగంగ !
రమ్ము భగీరథరాజ తనయ !
రా సుధాజలరాశి ! రా మేఘమాలికా !
రమ్ము చింతామణీ ! రమ్ము సురభి !
రా మనోహారిణి ! రా సర్వమంగళ !
రా భారతీదేవి ! రా ధరిత్రి
రా శ్రీమహాలక్ష్మి! రా మందమారుతి !
రమ్ము మందాకిని ! రా శుభాంగి !

ఆ. యనుచు మఱియుఁ గలుగు నాఖ్యలు గల గోవు
లడవిలోన దూర మందు మేయ
ఘన గభీరభాషఁ గడు నొప్పఁ జీరు నా
భీరజనులు బొగడఁ బెంపు నెగడ. 58

కాళియ మర్దనము

సీ. ఘన యమునానదీ కల్లోల ఘోషంబు
సరస మృదంగ ఘోషంబు గాఁగ
సాధు బృందావన వర చంచరీక గా
నంబు గాయక సుగానంబు గాఁగఁ
గలహంస సారస కమనీయ మంజు శ
బ్దంబులు తాళశబ్దములు గాఁగఁ
దివినుండి వీక్షించు దివిజ గంధర్వాది
జనులు సభాసీన జనులు గాఁగఁ

తే. పద్మరాగాది రత్న ప్రభాసమాన
మహిత కాళియఫణి ఫణామంటపమున
నళినలోచన విఖ్యాత నర్తకుండు
నిత్య నైపుణ్యమునఁ జేర్చి నృత్యమాడె. 59

ఉ. ఎట్టితపంబు చేసెనొకొ యెట్టిసుకర్మము లాచరించెనో
యెట్టి నిజంబు బల్కెనొకొ యీ ఫణి పూర్వభవంబునందు ము
న్నెట్టి మహానుభావులకు నెన్నఁడు జేరవ గాని నీవు నేఁ
డిట్టి వినోదలీలఁ దల లెక్కి నటించెద వీ ఫణీంద్రు పై. 60

ఉ. ఒల్లరు నిర్జరేంద్రపద మొల్లరు బ్రహ్మపదంబు నొందఁగా
నొల్లరు చక్రవర్తి పద మొల్లరు సర్వరసాధిపత్యము
న్నొల్లరు యోగసిద్ధి మఱి యొండు భవంబుల నొంద నీని నీ
సల్లలి తాంఘ్రిరేణువుల సంగతి నొందిన ధన్యు లెప్పుడున్. 61

గోవర్ధనోద్ధరణము

క. కిరి యై ధర యెత్తిన హరి
కరి సరసిజముకుళ మెత్తుగతిఁ ద్రిభువన శం
కరకరుఁ డై గోవర్ధన
గిరి యెత్తెం బక్కనొక్క కేలన్ లీలన్. 62

అక్రూరుని ఉత్సాహము

మ. అలకభ్రాజిత మై సుధాంశు నిభ మై హాస ప్రబోద్దామ మై
జలజాక్షం బయి కర్ణకుండల విరాజ ద్గండ మై యున్న యా
జలజాతాక్షు ముఖంబుఁ జూడఁ గలుగున్ సత్యంబు వో నాకు నా
పల డి క్కేగుచునున్న వీ వనమృగ వ్రాతంబు లీ త్రోవలన్. 63

అక్రూరుడు శ్రీకృష్ణుని స్తుతించుట

శా. కంటిన్ మున్ను రథంబుపై జలములోఁ గంటిన్ మదిన్ గ్రమ్మఱన్
గంటిన్ దొంటి రథంబుమీఁద నివె యీ కల్యాణచారిత్రు లే
వెంటన్ దోఁచిరి రెండుదిక్కుల మనోవిభ్రాంతియో నీటిలో
నుం టాశ్చర్యము చూతు నంచు మఱియు న్స్నాహించి మగ్నాంగుఁడై. 64

క. నీలోన లేని చోద్యము
లే లోకమునందుఁ జెప్ప కేశ్వర ! నీట
న్నేలం నింగిని నున్నవె
నీలోఁ జోద్యంబు లెల్ల నెగడు మహాత్మా ! 65

క. ఏ మధురయందుఁ బ్రియమున
శ్రీమన్నారాయణుండు చెలఁగును నిత్యం
బా మధుర సకలయాదవ
భూమీశుల కెల్ల మొదలిపురి యయ్యె నృపా ! 66

సీ. ఆసక్తి కృష్ణముఖావలోకనమంద
హరి పాదసేవనమంద చింత
వెఱపు నారాయణ విముఖ కార్యములంద
పారవశ్యము విష్ణుభక్తియంద
బాష్పనిర్గతి చక్రి పద్యసంస్తుతులంద
పక్షపాతము శార్ఙ్గి భక్తులంద
లేమి గోవిందాన్య లీలాచరణమంద
శ్రమము గోవింద పూజనములంద

తే. బంధ మచ్యుతేతర దుష్టపథములంద
జ్వరము మాధవవిరహిత క్షణములంద
మత్సరము లేశ కైంకర్య మతములంద
నరవరోత్తమ ! వినుము తన్నాగరులకు. 67



మహాభాగవత కల్పకుసుమమాల

నవమ గుచ్ఛము

(రుక్మిణీ కల్యాణము)

శా. కల్యాణాత్మక మైన విష్ణుకథ లాకర్ణింపుచున్ ముక్త వై
కల్యుం డెవ్వఁడు తృప్తు డౌ, నవి వినంగాఁ గ్రొత్త లౌచుండు సా
కల్యం బేర్పడ భూసురోత్తమ! యెఱుంగం బల్కవే రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్. 1

క. భూషణములు సెవులకు బుధ
తోషణము లనేక జన్మ దురితౌఘ విని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమను గుణ భాషణముల్. 2

మ. ఖగనాథుం డమరేంద్రుఁ గెల్చి సుధ మున్ గైకొన్న చందంబునన్
జగతీనాథులఁ జైద్య పక్షచరులన్ సాళ్వాదులం గెల్చి భ
ద్రగుఁ డై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
భగవత్యంశభవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్. 3

రుక్మిణీ వర్ణనము

క. బాలేందు రేఖ దోఁచిన
లాలితయగు నపరదిక్కు లాగున ధరణీ
పాలుని గేహము మెఱసెను
బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్. 4

సీ. పేర్వేర బొమ్మల పెండ్లిండ్లు సేయుచు
సఖులతోడ వియ్యంబు లందు
గుజ్జనగూళ్ళను గోమరొప్ప వండించి
చెలులకుఁ బెట్టించుఁ జెలువమెఱయ
రమణీయ మందిరారామ దేశంబులఁ
బువ్వుఁదీఁగెలకును బ్రోదిసేయు
సదనముల మణిమయ సౌధభాగంబుల
లీలతో ధర్మదోలికల నూఁగు

తే. బాలికలతోడఁ జెలరేఁగి బంతులాడు
శారికా కీర పంక్తికిఁ జదువుచెప్పు
బర్హిసంఘములకు మురిపములు గఱపు
మదమరాళంబులకుఁ జూపు మందగతులు. 5

సీ. దేవకీసుతు కోర్కె తీఁగెలు వీడంగ
వెలఁదికి మైదీఁగె వీడఁ దొడఁగెఁ
గమలనాభుని చిత్తకమలంబు వికసింపఁ
గాంతి నింతికి ముఖకమల మొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ
బొలఁతికిఁ జనుదోయి పొడుపుసూపె
శౌరికి ధైర్యంబు సన్నమై దయ్యంగ
జలజాక్షి మధ్యంబు సన్న మయ్యె

ఆ. హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁ గేశ
బంధ మధిక మగుచు బాల కమరెఁ

బద్మనయను వలనఁ బ్రమదంబు నిండార
నెలఁత యౌవనంబు నిండియుండె. 6

శ్రీ రుక్మిణీకృష్ణులు అన్యోన్యానురక్తులగుట

క. తన తండ్రి గేహమునకుం
జనుదెంచుచునున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణుని రూప బల గుణాదులు
విని కృష్ణుఁడు దనకు దగినవిభుఁ డని తలఁచెన్. 7

క. ఆ లలన రూపు బుద్ధియు
శీలము లక్షణము గుణముఁ. జింతించి తగన్
బాలారత్నముఁ దన కి
ల్లాలుగఁ జేకొందు ననుచు హరియుం దలఁచెన్. 8

ఉ. బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి దు
స్సంధుఁడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్త పు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై. 9

రుక్మిణీదేవి శ్రీ కృష్ణుని కడకు బ్రాహ్మణుని పంపుట

ఉ. అన్న తలఁపుఁ దా నెఱిఁగి యన్నవనీరజగంధి లోన నా
పన్నత నొంది యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి గర్వసం
ఛన్నుఁడు రుక్మి నేఁడు ననుఁ జైద్యున కిచ్చెద నంచు నున్నవాఁ
డెన్నివిధంబులం జని బుధేశ్వర ! చక్రికి విన్నవింపవే ! 10

నవమ గుచ్ఛము

రుక్మిణీదేవి సందేశము

సీ. ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
దేహతాపంబులు దీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల
కఖిలార్థలాభంబు గలుగుచుండు
నే నీ చరణసేవ లే ప్రొద్దు చేసిన
భువనోన్నతత్వంబుఁ బొందఁగలుగు
నే నీ లసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ
దడవిన బంధసంతతులు వాయు

తే. నట్టి నీయందు నా చిత్త మనవరతము
నచ్చియున్నది నీ యాన నానలేదు
కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీ చిత్తచోర! 11

శా. ధన్యున్ లోకమనోభిరాముఁ గుల విద్యా రూప తారుణ్య సౌ
జన్య శ్రీ బల దాన శౌర్య కరుణా సంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు? కోరదే మును రమా కాంతాలలామంబు రా
జన్యానేకప సింహ! నావలననే జన్మించెనే మోహముల్. 12

ఉ. శ్రీయుతమూర్తి! యో పురుషసింహమ! సింహము పాలి సొమ్ము గో
మాయువు గోరు చందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయిని యైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డా యధమాధముం డెఱుఁగఁ డద్భుత మైన భవత్ప్రతాపమున్. 13

మ. వ్రతముల్ దేవ గురు ద్విజన్మ బుధ సేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితి నేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌగాక ని
ర్జితు లై పోదురు గాక సంగరములోఁ జేదీశముఖ్యాధముల్. 14

ఉ. అంకిలి సెప్పలేదు చతురంగ బలంబులదోడనెల్లి యో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులున్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్య మే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్. 15

సీ. లోపలి సౌధంబులోన వర్తింపంగఁ
దేవచ్చువే నిన్నుఁ దెత్తునేని
గావలివారలఁ గల బంధువులఁ జంపి
కాని తేరా దని కమలనయన!
భావించితేని నుపాయంబు చెప్పెద
నాలింపు కులదేవయాత్రఁజేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ
బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు

తే. నెలమి మావారు పంపుదు రేను నట్లు
పురము వెలువడి యేతెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమునకు
వచ్చి కొనిపొమ్ము నన్ను సవార్యచరిత! 16

మ. ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశమర్యాద నె
వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ

యనుకంపన్ విలసింప నేని వ్రతచర్యన్ నూఱు జన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా! 17

సీ, ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
కర్ణరంధ్రంబుల కలిమి యేల
పురుషరత్నమ! నీవు భోగింపఁగా లేని
తనులతవలని సౌందర్య మేల
భువనమోహన! నిన్నుఁ జూడగాఁగా లేని
చక్షురింద్రియముల సత్త్వ మేల
దయిత! నీ యధరామృతం బానఁగా లేని
జిహ్వకు ఫలరససిద్ధి యేల

ఆ. నీరజాతనయన! నీ వనమాలికా
గంధ మబ్బలేని ఘ్రాణ మేల
ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని
జన్మమేల యెన్ని జన్మములకు. 18

రుక్మిణీదేవి సౌందర్య వర్ణనము

సీ. పల్లవ వైభవాస్పదములు పదములు
కనకరంభా తిరస్కారు లూరు
లరుణప్రభా మనోహరములు కరములు
కంబుసౌందర్య మంగళము గళము
మహిత భావాభావ మధ్యంబు మధ్యంబు
చక్షు రుత్సవదాయి చన్నుదోయి
పరిహాసి శార్దేందు పటలంబు నిటలంబు
జిత మత్తమధుకర శ్రేణి వేణి

ఆ. భావజాశుగముల ప్రాపులు చూపులు
కుసుమశరుని వింటి కొమలు బొమలు
చిత్తతోషణములు చెలువభాషణములు
జలజనయనముఖము చంద్రసఖము. 19

ఉ. ఆ యెలనాఁగ నీకు దగు నంగనకుం దగు దీవు మా యుపా
ధ్యాయుల యాన పెండ్లి యగుఁ దప్పదు జాడ్యము తేల నీవు నీ
తోయమువారుఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తుగాని వి
చ్చేయుము శత్రులన్ నుఱుము సేయుము సేయుము శోభనం బిలన్.20

శ్రీ కృష్ణుని నిర్ణయము

క. వచ్చెద విదర్భభూమికిఁ,
జొచ్చెద భీష్మకుని పురము సురుచింలీలన్
దెచ్చెద బాలన్ ప్రేల్మిడి
వచ్చెద నడ్డంబు రిపులువచ్చినఁ బోరన్. 21

రుక్మిణీదేవి విచారము

శా. లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలా రాఁడు గోవిందుఁ డు
ద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె నా యత్నంబు సిద్ధించునో
భగ్నం బై చనునో విరించి కృత మెబ్భంగిన్ బ్రవర్తించునో ! 22

మ. ఘనుఁ డా భూసురుఁ డేగెనో నడుమ మార్గశ్రాంతుఁ డై చిక్కెనో
విని కృష్ణుం డిది తప్పుగా దలఁచెనో విచ్చేసెనో యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలపఁడో యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో నా భాగ్య మె ట్లున్నదో. 23

నవమ గుచ్ఛము

విరహవర్ణనము

ఉ. చెప్పదు తల్లికిం దలఁపుఁ జిక్కఁ దిశల్ దరహాస చంద్రికన్
గప్పదు వక్త్రతామరస గంధసమాగత భృంగసంఘమున్
రొప్పదు నిద్రఁ గైకొన దురోజ పరస్పరసక్త హారముల్
విప్పదు కృష్ణమార్గగత వీక్షణపంక్తులఁ ద్రిప్ప దెప్పుడున్. 24

చ. తుడువదు కన్నులన్ వెడలు తోయకణంబులు కొప్పుఁ జక్కఁగా
ముడువదు నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జన దన్న మేమియున్
గుడువదు నీరమున్ గొనదు కూరిమి కీరముఁ జేరి పద్యమున్
నొడువదు వల్లకీగుణ వినోదము సేయదు డాయ ధన్యులన్. 25

సీ. మృగనాభి యలఁదదు మృగరాజమధ్యమ
జలముల నాడదు జలజగంధి
ముకురంబుఁ జూడదు ముకురసన్నిభముఖి
పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁణి
వనకేళిఁగోరదు వనజాతలోచన
హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికా లలితదేహ
తొడవులు దొడవదు తొడవుతొడవు

ఆ. తిలక మిడదు నుదుటఁ దిలకినీతిలకంబు
గమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన
మాలి రాఁడు తగవుమాలి యనుచు. 26

బ్రాహ్మణుడు శుభవార్త చెప్పుట

ఉ. మెచ్చె భవద్గుణోన్నతి కమేయ ధనామల నిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిన నైన రాక్షసవివాహమునన్ గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా! 27

రుక్మిణీదేవి కృతజ్ఞత

మ. జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి నన్
నిలువం బెట్టితి నీ కృపం బ్రతికితిన్ నీయట్టి పుణ్యాత్మకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిన్ గావింపఁగానేర నం
జలి గావించెద భూసురాన్వయమణీ! సద్బంధు చింతామణీ! 28

జనవాక్యము

మ. తగు నీ చక్రికి విదర్భరాజ సుతకున్ దథ్యంబు వైదర్భియుం
దగు నీ చక్రికి నింత మంచి దగునే దాంపత్య మీ యిద్దఱిం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా దర్పాహతారాతి యై
మగఁ డౌఁ గావుతఁ జక్రి యీ రమణికిన్ మా పుణ్య మూలంబునన్. 29

రుక్మిణీ గౌరీదేవిని కొలుచుట

ఉ. నమ్మితి నా మనంబున సనాతను లైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ! మేటి పె
ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతిసేయుమమ్మ! నిన్
నమ్మిన వారి కెన్నఁటికి నాశము లేదు గదమ్మ! యీశ్వరీ! 30

రుక్మిణీ హరణము

మ. అళినీలాలకఁ బూర్ణ చంద్రముఖి నేణాక్షిం బ్రవాళాధరన్
గలకంఠిన్ నవపల్లవాంఘ్రియుగళన్ గంధేభకుంభస్తనిన్
బులినశ్రోణి నిభేంద్రయాన నరుణాంభోజాతహస్తన్ మహో
త్పలగంధిన్ మృగరాజమధ్యఁ గని విభ్రాంతాత్ములై రందఱున్. 31

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండల ముఖుం గంఠీరవేంద్రావల
గ్ను నవాంభోజదళాక్షుఁ జారుతర వక్షున్ మేఘసంకాశ దే
హు నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం జక్రిఁ బీతాంబరున్
ఘన భూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్. 32

వీరులు ఒకరినొకరు పురికొల్పుట

మ. ఘన సింహంబుల కీర్తి నీచమృగముల్ గైకొన్న చందంబునన్
మన కీర్తుల్ గొని బాలఁ దోడ్కొనుచు నున్మాదంబుతో గోపకుల్
చనుచున్నారదె శౌర్య మెన్నఁటికి మీ శస్త్రాస్త్రముల్ గాల్పనే
తనుమధ్యన్ విడిపింపమేని నగరే ధాత్రీజనుల్ గ్రంతలన్. 33

బంధువులు శిశుపాలు నూరడించుట

మ. తమకుం గాలము మంచి దైన మనలం ద్రైలోక్యవిఖ్యాత వి
క్రములం గెల్చిరి యాదవుల్ హరి భుజాగర్వంబునన్ నేఁడు కా
లము మేలై చనుదెంచె నేని మనమున్ లక్షించి విద్వేషులన్
సమరక్షోణి జయింత మింత పనికై శంకింప నీ కేటికిన్. 34

ఆ. బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండిన
బ్రతుకు గలిగెనేని భార్య గలుగు

బ్రతికి తీవు భార్యపట్టు దైవ మెఱుంగు
వగవవలదు చైద్య! వలదు వలదు. 35

రుక్మి అహంకారము

సీ. మాసరివాఁడవా మాపాపఁ గొనిపోవ
నేపాటి గలవాఁడ వేది వంశ
మెందు జన్మించితి వెక్కడఁ బెరిఁగితి
వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాద లెఱుఁగవు
మాయఁ గైకొనికాని మలయరావు
నిజరూపమున శత్రునివహంబు పైఁ బోవు
వసుధేశుఁడవు గావు వావి లేదు

ఆ. కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువవేని విలయకాల
శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల
గర్వమెల్లఁ గొందుఁ గలహమందు. 36

అన్నను కాపాడుమని రుక్మిణి కృష్ణుని ప్రార్థించుట

మత్తకోకిల. నిన్ను నీశ్వరు దేవదేవుని నిర్ణయింపఁగ లేక యో
సన్నుతామర! కీర్తిశోభిత! సర్వలోక శరణ్య! మా
యన్న యీతఁడు నేఁడు చేసె మహాపరాధము నీయెడన్
సన్ను మన్నన చేసి కావు మనాథనాథ! దయానిధీ! 37

మత్తకోకిల. కల్ల లేదని విన్నవించుట గాదు వల్లభ యాతనిన్
బ్రల్లదుం దెగఁజూచి తేనియు భాగ్యవంతుల మైతి మే
మల్లుఁ డయ్యె ముకుందుఁ డీశ్వరుఁ డంచు మోదితులైన మా
తల్లిదండ్రులు పుత్రశోకముఁ దాల్చి చిక్కరదు రీశ్వరా! 38

శ్రీకృష్ణుడు రుక్మిణిని పెండ్లియాడుట

క. రాజీవలోచనుఁడు హరి
రాజసమూహములఁ గెల్చి రాజస మొప్పన్
రాజిత యగు తనపురికిని
రాజాననఁ దెచ్చె బంధురాజి నుతింపన్. 39

మ. ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజ చేతోహారిణిన్ మాన వై
భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం
ధవ సత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్
సువిభూషాంబర ధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్. 40

క. సతులుం దారును బౌరులు
హితమతిఁ గానుకలు దెచ్చి యిచ్చిరి కరుణో
న్నత వర్ధిష్ణులకును మా
నిత రోచిష్ణులకు రుక్మిణీకృష్ణులకున్. 41

ఆ. అనఘ ! యాదిలక్ష్మి యైన రుక్మిణితోడఁ
గ్రీడ సలుపుచున్న కృష్ణుఁ జూచి
పట్టణంబులోని ప్రజ లుల్లసిల్లిరి
ప్రీతు లగుచు ముక్త భీతు లగుచు. 42

క. కువలయ రక్షాతత్పర !
కువలయదళ నీలవర్ణ కోమలదేహా !
కువలయనాథ శిరోమణి !
కువలయజన వినుత విమలగుణ సంఘాతా ! 43

మాలిని. సరసిజనిభ హస్తా! సర్వలోక ప్రశస్తా!
నిరుపమ శుభమూర్తీ! నిర్మలారూఢ కీర్తీ!
పరహృదయ విదారీ! భక్త లోకోపకారీ!
గురు బుధజన పోషీ! ఘోర దైతేయ శోషీ! 44



మహాభాగవత కల్పకుసుమమాల

దశమ గుచ్ఛము

(నరకాసుర సంహారము)

క. ఎప్పుడు ధర్మక్షయ మగు
నెప్పుడు పాపంబు పొడము నీ లోకములో
నప్పుడు విశ్వేశుఁడు హరి
దప్పక విభుఁ డయ్యుఁ దన్నుఁ దా సృజియించున్. 1

సత్యభామ కృష్ణుని పెండ్లియాడుట

ఉ. తామరసాక్షుఁ డచ్యుతుఁ డుదార యశోనిధి పెండ్లియాడె నా
నా మనుజేంద్ర వందిత గుణస్థితి లక్షణ సత్యభామ ను
ద్దామ పతివ్రతాత్వ నయధర్మ విచక్షణతా దయా యశః
కామను సత్యభామను ముఖద్యుతి నిర్జిత సోమ నయ్యెడన్. 2

సత్యభామ ప్రార్థన

శా. దేవా! నీవు నిశాటసంఘముల నుద్దీపించి చెండాడ నీ
ప్రావీణ్యంబులు చూడఁగోరుదుఁ గదా ప్రాణేశ! మన్నించి నన్
నీ వెంటం గొనిపొమ్ము నేఁడు కరుణన్ నేఁ జూచి యేతెంచి నీ
దేవీ సంఘము కెల్లఁ జెప్పుదు భవద్దీప్త ప్రతాపోన్నతుల్. 3

సత్యాకృష్ణుల సంవాదము

సీ. సమద పుష్పంధయ ఝుంకారములు గావు
భీషణ కుంభీంద్ర బృంహితములు
వాయు నిర్గత పద్మవన రేణువులు గావు
తురగ రింఖా ముఖోద్ధూత రజము
లాకీర్ణ జలతరంగాసారములు గావు
శత్రు ధనుర్ముక్త సాయకములు
కలహంస సారస కాసారములు గావు
దనుజేంద్ర సైన్య కదంబకములు

తే. కమల కల్హార కుసుమ సంఘములు గావు
చటులరిపు శూల ఖడ్గాది సాధనములు
కన్య! నీవేడ రణరంగ గమన మేడ
వత్తు వేగమ నిలుపుము వలదు వలదు. 4

ఉ. దానవు లైననేమి మఱి దైత్యసమూహము లైన నేమి నీ
మానిత బాహుదుర్గముల మాటున నుండఁగ నేమి శంక నీ
తో నరుదెంతు నంచుఁ గరతోయజముల్ ముకుళించి మ్రొక్కె న
మ్మానిని దన్ను భర్త బహుమాన పురస్సరదృష్టిఁ జూడఁగన్. 5

కృష్ణుడు తన చేతి విల్లును సత్యాదేవికిచ్చుట

క. జన్యంబున దనుజుల దా
ర్జన్యము లుడుపంగఁ గోరి చనుదెంచిన సౌ
జన్యవతిఁ జూచి యదురా
జన్యశ్రేష్ఠుండు సరస సల్లాపములన్. 6

క. తేమా! దనుజులఁ గెలువఁగ
తేమా నీ వేల గడఁగి లేచితి విటు రా
లే మాను మాన వేనిఁ
లేమా విల్లందుకొనుము లీలం గేలన్. 7

సత్యభామ రణోద్యోగ వర్ణనము

శా. ఆ విల్లంది బలంబు నొంది తపగణ్యానంత తేజోవిశే
షావిర్భూత మహాప్రతాపమున వీరాలోక దుర్లోక యై
తా వేగన్ సగుణంబు చేసె ధనువుం దన్వంగి దైత్యాంగనా
గ్రీవాసంఘము నిర్గుణంబుగ రణక్రీడా మహోత్కంఠతోన్. 8

శా. వేణిం జొల్లెము వెట్టి సంఘటిత నీవీబంధ యై భూషణ
శ్రేణిం దాల్చి ముఖేందుమండల మరీచీజాలముల్ పర్వఁగాఁ
బాణిం బయ్యెదఁ జక్కఁగాఁ దుఱిమి శుంభద్వీరసంరంభ యై
యేణీలోచన లేచి నిల్చెఁ దన ప్రాణేశాగ్ర భాగంబునన్. 9

సీ. సౌవర్ణ కంకణ ఝణఝణ నినదంబు
శింజినీరవముతోఁ జెలిమి సేయఁ
దాటంక మణిగణ ధగధగ దీప్తులు
గండమండల రుచుల్ గప్పికొనఁగ
ధవళతరాపాంగ ధళధళ రోచులు
బాణజాల ప్రభాపటలి నణఁప
శరపాత ఘుమఘుమ శబ్దంబు పరిపంథి
సైనిక కలకల స్వనము లుడుప

తే. వీర శృంగార భయ రౌద్ర విస్మయములు
గలసి భామిని యయ్యెనో కాక యనఁగ
నిషువుఁ దొడుగుట విడుచుట యేయు టెల్ల
నెఱుఁగరాకుండ నని సేసె నిందువదన. 10

శా. జ్యావల్లీ ధ్వని గర్జనంబుగ సురల్ సారంగయూథంబుగా
నా విల్లింద్రశరాసనంబుగ సరోజాక్షుండు మేఘంబుగాఁ
దా విద్యుల్లతభంగి నింతి సురజి ద్దావాగ్ని మగ్నంబుగాఁ
బ్రావృట్కాలము సేసె బాణచయ మంభ శ్శీకరశ్రేణి గాన్ 11

సీ. రాకేందుబింబ మై రవిబింబ మై యొప్పు
నీరజాతేక్షణ నెమ్మొగంబు
కందర్పకేతు వై ఘన ధూమకేతు వై
యలరుఁ బూఁబోణి చేలాంచలంబు
చాపజు పతిథి యై ప్రళయార్క పరిధి యై
మెఱయు నాకృష్ణ మై మెలఁత చాప
మమృతప్రవాహ మై యనల సందోహ మై
తనరారు నింతి సందర్శనంబు

ఆ. హర్షదాయి యై మహారోష దాయి యై
పరఁగు ముద్దరాలి బాణవృష్టి
హరికి నరికిఁ జూడ నందంద శృంగార
వీరరసము తోలి విస్తరిల్ల. 12

మ. పరుఁ జూచున్ బరుఁ జూచు నొంప నలరింపన్ రోష రాగోదయా
పరిత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్

జరగన్ గన్నులఁ గెంపు సొంపు బరఁగన్ జండాస్త్ర సందోహమున్
సరసాలోక సమూహమున్ నెఱపుచున్ జంద్రాస్య హేలాగతిన్. 13

మ. అలినీలాలక చూడ నా ప్పెసఁగెఁ బ్రత్యాలీఢ పాదంబుతో
నలికస్వేద వికీర్ణకాలకలతో నాకర్ణికానీత స
ల్లలిత జ్యా నఖపుంఖ దీధితులతో లక్ష్యావలోకంబుతో
వలయాకార ధను ర్విముక్త విశిఖ వ్రాతాహతారాతి యై. 14

సీ. బొమ్మపెండ్లింట్లకుఁ బో నొల్ల నను బాల
రణరంగమున కెట్లు రాఁ దలంచె
మగవారిఁ గనినఁ దా మఱుఁగు కేగెడు నింతి
పగవారి గెల్వ నేపగిదిఁ జాలెఁ
బసిఁడి యుయ్యల లెక్క భయమందు భీరువు
ఖగపతి స్కంధ మే కడిఁది నెక్కె
సఖుల కోలాహల స్వనము లోర్వని కన్య
పటహ ఝాంకృతుల కెబ్భంగి నోర్చె

ఆ. నీలకంఠములకు నృత్యంబుఁ గఱపుచు
నలసి తలఁగిపోవు నలరుఁబోఁడి
యేవిధమున నుండె నెలమి నాలీఢాది
స్థానములను రిపుల మాన మణఁప. 15

సీ. వీణెఁ జక్కఁగఁ బట్ట వెర వెఱుంగని కొమ్మ
బాణాసనం బెట్లు పట్టనేర్చె
వ్రేఁకున దీఁగెఁ గూర్పంగ నేరని లేమ
గుణము నేక్రియ ధనుష్కోటిఁ గూర్చె

సరము ముత్యము ద్రుగువ్వఁజాలని యబల నే
నిపుణత సంధించె నిశితశరము
చిలుకకుఁ బద్యంబు చెప్పనేరని తన్వి
యస్త్రమంత్రము లెన్నఁ డభ్యసించెఁ
ఆ. బలుకు మనినఁ బెక్కు పలుకని ముగుద యే
గతి నొనర్చె సింహగర్జనముల
ననఁగ మెఱసెఁ ద్రిజగదభిరామ గుణధామ
చారు చికురసీమ సత్యభామ. 16

భూదేవి శ్రీకృష్ణుని స్తుతించుట

సీ. అంభోజనాభున కంభోజనేత్రున
కంభోజ నిలయా సమన్వితునకు
నంభోజపదున కనంతశక్తికి వాసు
దేవునకును దేవదేవునకును
భక్తులు గోరినభంగి నే రూపైనఁ
బొందువానికి నాదిపురుషునకును
నఖిలనిదాన మై యాపూర్ణ విజ్ఞాన
మైనవానికిఁ బరమాత్మునకును
ఆ. ధాతఁ గన్న మేటితండ్రికి నజునికి
నీకు వందనంబు నే నొనర్తు
నఖిల భూతరూప ! నిరుపమ ! యీశ ! ప
రాపరాత్మ మహిత ! యమితచరిత ! 17
మ. సిరి చాంచల్యము తోడి దయ్యుఁ దనకుం జిత్తేశ్వరుం డంచు నే
పురుష శ్రేష్ఠు వరించె నట్టి పరమున్ బుద్ధిన్ విలోకంబులన్
గరయుగ్మంబులఁ గౌఁగిలించిరి సతుల్ గల్యాణ బాష్పంబు లా
భరణ శ్రేణులుగాఁ బ్రతీక్షణ నవప్రాప్తానురాగంబులన్. 18



మహాభాగవత కల్పకుసుమమాల

ఏకాదశ గుచ్ఛము

(నానావిషయ వర్ణనము)

పుణ్యదేశము

క. హరియందు జగము లుండును
హరిరూపము సాధుపాత్ర మం దుండు శివం
కర మగు పాత్రము గలిగిన
సరయుఁగ నది పుణ్యదేశ మనఘచరిత్రా! 1

గురువు ప్రాధాన్యము

శా. ఉర్విన్ మానవు లెవ్వ రైన గురు వాక్యోద్యుక్తు లై కాని త
త్పూర్వారంభము సేయఁ బోల దనుచున్ బోధించు చందంబునన్
సర్వజ్ఞత్వముతో జగద్గురువు లై సంపూర్ణు లై యుండియున్
గుర్వంగీకరణంబు సేయఁ జని రా గోవిందుఁడున్ రాముఁడున్. 2

గుణవంతుడైన కుమారుడు

ఆ. బుద్ధిమంతుఁ డైన బుధుఁడు పుత్రుం డైన
మేను పెంచి రాజు మిన్నుముట్టె
బుద్ధిగల సుతుండు పుట్టినచోఁ దండ్రి
మిన్ను ముట్టి కేల మిన్నకుండు. 3

వర్షర్తు వర్ణనము

సీ. పూర్వవాయువులు ప్రభూతంబులై వీచెఁ
బడమట నింద్రచాపంబు దోఁచె
పరివేషయుక్తమై భానుమండల మొప్పె
మెఱుము టుత్తరదిశ మెఱవఁదొడఁగె
దక్షిణగాము లై తనరె మేఘంబులు
జలచరానీకంబు సంతసించెఁ
జాతకంబుల పిపాసలు కడపలఁ జేరెఁ
గాంతారవహ్నుల గర్వ మడఁచె

ఆ. నిజ కరాళివలన నీరజబంధుండు
దొల్లి పుచ్చుకొన్న తోయ మెల్ల
మరల నిచ్చుచుండె మహి కర్షకానంద
కంద మైన వాన కిందు వందు. 4

గ్రీష్మర్తు వర్ణనము

సీ. దినము లంతంతకు దీర్ఘంబులై తోఁచె
దిననాథుఁ డుత్తరదిశఁ జరించె
నాఁడు నాఁటికి నెండ నవ్యమై ఘన మయ్యె
వెచ్చని గాడ్పులు విసరఁ జొచ్చె
మేదినీరేణువుల్ మింట సంకుల మయ్యె
నేఱులుఁ గొలఁకులు నిగిరిపోయెఁ
బానీయశాలలఁ బథికసంఘము నిల్చెఁ
జప్పరంబుల భోగిచయము డాఁగెఁ

ఆ. దరులు లతలుఁ గుసుమదళములతో వాడె
మిథునకోటికి రతి మెండు దోఁచె
నఖిలజంతు భీష్మ మైన గ్రీష్మము రాకఁ
గీలి యడవులందుఁ గేలి సలిపె. 5

చంద్రోదయ వర్ణనము

సీ. ప్రాచీదిశాంగనా ఫాలతలంబున
దీపించు సిందూరతిలక మనఁగ
దర్పించి విరహుల ధైర్యవల్లులు ద్రెంప
దర్పకుం డెత్తిన దాత్ర మనఁగ
నలిగి కాలకిరాతుఁ డంధకారమృగంబు
ఖండింప మెఱయించు ఖడ్గమనఁగ
గగన తమాల వృక్షము తూర్పు కొమ్మను
లలితమై మెఱయు పల్లవ మనంగఁ

ఆ. దొగలు సంతసిల్ల దొంగలు భీతిల్లఁ
గడలి మిన్నుముట్టి కడలు కొనఁగఁ
బొడిచె శీతకరుఁడు భూరి చకోరక
ప్రీతికరుఁడు జార భీతికరుఁడు. 6

స్త్రీ మహిమ

ఆ. పొలఁతి దానవహ్ని పురుషు డాజ్యఘటంబు
కరఁగ కేల యుండుఁ గదిసె నేని
బ్రహ్మ యైన కూఁతుఁ బట్టక మానఁడు
వడుగు కింటిపొత్తు వలదు వలదు. 7

ఆ. కాము గెలువవచ్చుఁ గాలారి గావచ్చు
మృత్యుజయము గలిగి మెఱయవచ్చు
నాఁడువారి చూపు టంపఱ గెలువంగ
వశముగాదు త్రిపురవైరి కైన. 8

ఊర్వశి వర్ణనము

ఉ. భావజు కోలయో మొగులువాసి వెలుంగు మెఱుంగొ మోహినీ
దేవతయో నభోరమయొ దీని కరగ్రహణంబు లేనిచో
జీవన మేటి కంచు మరుచేఁ జిగురాకడిదమ్ము జిమ్ములం
దా వడఁకెన్ బురూరవుఁడు తామరపాకు జలంబు కైవడిన్. 9

కర్మ సంగతి

ఆ. జల ఘటాదులందుఁ జంద్ర సూర్యాదులు
గానఁబడుచు గాలిఁ గదలుభంగి
నాత్మ కర్మనిర్మితాంగంబులను బ్రాణి
గదలుచుండు రాగకలితుఁ డగుచు. 10

క. కావున పరులకు హింసలు
గావింపఁగ వలదు తనకుఁ గల్యాణముగా
భావించి పరుల నొంచినఁ
బోవునె తత్ఫలము పిదపఁ బొందకయున్నే. 11

క. కర్మములు మేలు నిచ్చును
గర్మంబులు కీడు నిచ్చు కర్తలు దనకున్
గర్మములు బ్రహ్మ కైనను
గర్మగుఁడై పరులఁ దడపఁగా నేమిటికిన్. 12

క. కర్మమునఁ బుట్టు జంతువు
కర్మమునన్ వృద్ధిఁ బొందుఁ గర్మమునఁ జెడున్
గర్మమె జనులకు దేవత
కర్మము సుఖదుఃఖములకుఁ గారణ మధిపా ! 13

క. కర్మములకుఁ దగు ఫలములు
కర్మకులకు నిడఁగ రాజు గాని సదా ని
ష్కర్ముఁ డగు నీశ్వరుండును
గర్మవిహీనునికి రాజు గాఁడు మహాత్మా ! 14

రాజనీతి - యుద్ధనీతి

క. రాజ్యంబు పాపమూలము
రాజ్యముతో నొడ లెఱుంగ రాదు సుమతియున్
రాజ్యమునఁ బూజ్యు నెఱుఁగడు,
రాజ్యము గీజ్యంబు ముక్తిరతులకు నేలా. 15

క. పగవారు శరణుచొచ్చిన
మగతనములు నెఱపఁ దగదు మగవారలకున్
దగు సమయ మెఱుఁగవలదే
మగఁటిమి పాటింపవల దమర్త్యులతోడన్ 16

క. పరు గెలువవలయు నొండెను
సరి పోరఁగవలయు నొండెఁ జావలె నొండెన్
సరి గెలువు మృతియు దొరకమి
సరసంబుగ మున్నె తొలఁగి చనవలె నొండెన్. 17

క. ఎప్పుడు దనకును సత్త్వము
చొప్పడు నందాఁక రిపులఁ జూచియుఁ దన మైఁ
గప్పికొని యుండవలయు
న్నొప్పుగ నహి మూషకమున కొదిఁగిన భంగిన్.

ద్వారక

మ. జలజాతాక్షుఁడు శౌరి డగ్గఱె మహాసౌధాగ్ర శృంగారకన్
గలహంసావృత హేమపద్మ పరిఖా కాసారకన్ దోరణా
వళి సంఛాదిత తారకన్ దరు లతా వర్గానువేలోదయ
త్ఫల పుష్పాంకుర కోరకన్ మణిమయ ప్రాకారకన్ ద్వారకన్. 19

తాపసులు

సీ. ఆలరు జొంపములతో నభ్రంకషంబులై
బ్రతుకవే? వనములఁ బాదపములు
ఖాదన మేహనాకాంక్షలఁ బశువులు
జీవింపవే? గ్రామ సీమలందు
నియతిమై నుచ్ఛ్వాస నిశ్శ్వాస పవనముల్
ప్రాపింపవే? చర్మ భస్త్రికలును
గ్రామసూకర శునక శ్రేణు లింటింటఁ
దిరుగవే! దుర్యోగ దీనవృత్తి

తే. నుష్ట్రఖరములు మోయవే యురుభరములు
పుండరీకాక్షు నెఱుఁగని పురుషపశువు
లడవులందు నివాసములందుఁ బ్రాణ
విషయ భర వృత్తితో నుంట విఫల మధిప! 20

ఏకాదశ గుచ్ఛము

సీ. కమనీయ భూమి భాగములు లేకున్నవే
పడియుండుటకు దూది పఱుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే
భోజన భాజన పుంజ మేల?
వల్కలాశాజినావళులు లేకున్నవే
కట్ట దుకూల సంఘాత మేల?
గొనకొని వసియింప గుహలు లేకున్నవే
ప్రాసాద సౌధాది పటల మేల?

తే. ఫల రసాదులు గురియవే పాదపములు?
స్వాదు జలముల నుండవే సకలనదులు?
బొసఁగ భిక్షయుఁ బెట్టరే పుణ్యసతులు?
ధనమదాంధుల కొలువేల తాపసులకు? 21

అవధూత

సీ. ప్రతినిమేషము పరబ్రహ్మంబు వీక్షించి
మదిఁ జొక్కి వెలుపల మఱచువాఁడు
కమలంబు మీఁది భృంగములకై వడి మోము
పై నెఱపిన కేశపటలివాఁడు
గిఱివ్రాసి మాయ నంగీకరించనిభంగి
వసనంబు గట్టక వచ్చువాఁడు
సంగి గాఁడని వెంటఁ జాటు భూతములు నా
బాలుర హాసశబ్దములవాఁడు

తే. మహిత పద జాను జంఘోరు మధ్య హస్త
బాహు వక్షో గళానన ఫాల కర్ణ

నాసికా గండమస్తక నయనయుగళు
డైన యవధూతమూర్తి వాఁడరుగుదెంచె. 22

సంసారము

మ. కనియెం దాపస పుంగవుం డఖిల లోకఖ్యాత వర్ధిష్ణు శో
భన భాస్వత్పరిపూర్ణ యౌవన కళా భ్రాజిష్ణు యోగీంద్ర హృ
ద్వన జాతైక చరిష్ణుఁ గౌస్తుభ ముఖోద్య ద్భూషణాలంకరి
ష్ణు నిలింపాహిత జిష్ణు విష్ణుఁ బ్రభవిష్ణుం గృష్ణు రోచిష్ణునిన్. 23

మ. అవివేకానుగత స్వకార్య జలపూరాకీర్ణమై మిత్ర బం
ధు వధూ పుత్ర జలగ్రహోగ్రయుతమై దుర్దాంత మై నట్టి దు
ర్భవ పాథోధిఁ దరించు వారె హరి సంబంధ క్రియా లోల భా
గవతానుగ్రహ నావ లేని యధముల్ కల్యాణ సంధాయకా! 24

మాట చమత్కారము

శా. అక్రూరుం డని పేరు పెట్టుకొని నేఁ డస్మన్మనోవల్లభుం
జక్రిన్ మాకడఁ బాపికొంచు నరుగన్ జర్చించి యేతెంచి నాఁ
డక్రూరుం డఁట క్రూరుఁ డీతఁడు నిజం బక్రూరుఁ డౌనేని ని
ర్వక్రత్వంబునఁ గృష్ణుఁ బెట్టి తనత్రోవం బో విచారింపఁడే. 25

పతివ్రతా లక్షణము (చంద్రోదయవర్ణనము)

ఆ. కళలు గలుగుఁగాక కమల తోడగుఁగాక
శివుని మౌళిమీఁదఁ జేరుఁగాక
నన్యు నొల్లఁ దపనుఁ డైన మత్పతి యని
సాధ్వివంగి కమలజాతి మొగిడె. 26

ప్రద్యుమ్న వర్ణనము

సీ. చక్రనివారల చక్రదనంబున
కుపమింప నెవ్వఁడు యోగ్యుఁ డయ్యె
మిక్కిలి తపమున మెఱయు నంబికకు నై
శంకరు నెవ్వఁడు సగము సేసె
బ్రహ్మత్వమును బొంది పరఁగు విధాతను
వాణికై యెవ్వఁడు వాఁడి చెఱచె
వేయు డాఁగులతోడి విబుధలోకేశుని
మూర్తికి నెవ్వఁడు మూల మయ్యె

తే. మునులతాలిమి కెవ్వఁడు ముల్లుసూపు
మగల మగువల నెవ్వఁడు మరులుకొలుపు
కుసుమధనువున నెవ్వఁడు గొను విజయము
చిగురువాలున నెవ్వండు చిక్కపఱుచు. 27

అనిరుద్ధుని వర్ణనము

సీ. కనియె శుభోపేతుఁ గందర్పసంజాతు
మానితదేహు నాజానుబాహు
మకరకుండల కర్ణు మహితప్రభాపూర్ణుఁ
జిరయశోల్లాసుఁ గౌశేయవాసుఁ
గస్తూరికా లిప్తు ఘన కాంతి కుముదాప్తు
హార శోభిత వక్షు నంబుజాక్షు
యదువంశ తిలకు మత్తాళి నీలాలకు
నవపుష్పచాపుఁ బూర్ణప్రతాపు

తే. నభినవాకారు నక్షవిద్యా విహారు
మహిత గుణవృద్ధు మన్మథ మంత్రసిద్ధుఁ
గలిత పరిశుద్ధు నఖిల లోకప్రసిద్ధుఁ
జతురు ననిరుద్ధు నంగనాజన నిరుద్ధు. 28

యయాతి వర్ణనము

శా. సప్తాంభోనిధి మేఖలావృత మహాసర్వంసహా కన్యకా
ప్రాప్త్యోద్య ద్వర దక్ష దక్షిణకర ప్రాలంబమునుం జేసి ప్రో
క్షిప్తం జేసె యయాతి కట్టుకొనఁ బై చేలంబు మున్నిచ్చి ప
ర్యాప్త స్వేదజలాంగి నాశిసముదాయ స్వర్గవిన్ భార్గవిన్. 29

మహర్షులు

శా. ప్రాప్తానందులు బ్రహ్మబోధన కళాపారీణు లాత్మప్రభా
లుప్తాజ్ఞానులు మీర లార్యులు దయాయుత్వాభిరాముల్ మనో
గుప్తంబుల్ సకలార్థజాలములు మీకుం గానవచ్చుం గదా!
సప్తాహంబుల ముక్తి కేఁగెడు గతిన్ జర్చించి భాషింపరే. 30

నానావిధ సంభాషణారీతులు

శా. అన్నా! ఫల్గున! భక్తవత్సలుఁడు బ్రహ్మణ్యుండు గోవిందుఁ డా
పన్నానీక శరణ్యుఁ డీశుఁడు జగద్భద్రానుసంధాయి శ్రీ
మన్నవ్యాంబుజ పత్రనేత్రుఁడు సుధర్మామధ్య పీఠంబునం
దున్నాఁడా! బలభద్రుఁగూడి, సుఖియై, యుత్సాహియై ద్వారకన్. 31

ఉ. అన్నవు నీవు చెల్లెలికి నక్కట! మాడలు చీరె లిచ్చుటో
మన్నన సేయుటో మధుర మంజుల భాషల నాదరించుటో

మిన్నుల మ్రోఁతలే నిజము మే లని చంపకు మన్న! మాని రా
వన్న! సహింపు మన్న! దగదన్న! వధింపకు మన్న! వేఁడెదన్. 32

మత్తకోకిల. వావిఁ జెల్లెలు గాని కూఁతురువంటి యుత్తమురాలు సం
భావనీయచరిత్ర భీరువు బాల నూత్నవివాహ సు
శ్రీవిలాసిని దీనకంపితచిత్త నీ కిదె మ్రొక్కెదన్
గావవే కరుణామయాత్మక! కంస! మానవవల్లభా! 33

మ. హరిఁ జూడన్ నరుఁ డేఁగినాఁడు నెల లే దయ్యెం గదా! రారు కా
లరు లెవ్వారును, యాదవుల్ సమద లోలస్వాంతు లేవేళ సు
స్థిరులై యుండుదురా? మురారి సుఖియై సేమంబుతో నుండునా?
యెరవై యున్నది చిత్త మీశ్వరకృతం బెట్లో కదే? మారుతీ! 34

తృప్తి

క. వ్యాప్తిం బొందక వగవక,
ప్రాప్తం బగు లేశ మైనఁ బదివే లనుచున్
దృప్తిం జెందని మనుజుఁడు,
సప్తద్వీపముల నైనఁ జక్కంబడునే. 35

ఆశ

శా. ఆశాపాశము దాఁ గడు న్నిడుపు లే దంతంబు రాజేంద్ర! వా
రాశిప్రావృత మేదినీవలయ సామ్రాజ్యంబు చేకూడియుం
గాసిం బొందిరి గాక వైన్య గయ భూకాంతాదులు న్నర్థ కా
మాశన్ బాయఁగనేర్చిరే మును నిజాశాంతంబులం జూచిరే. 36

కుశస్థలి

ఉ. మంగళతూర్య ఘోషము లమందగతిం జెలఁగంగ మత్తమా
తంగ తురంగ సద్భట కదంబముతోఁ జని కాంచె నంత నా
రంగ లవంగ లుంగ విచర న్మదభృంగ సురంగనాద సం
సంగ తరంగిణీ కలిత సంతత నిర్మల నా కుశస్థలిన్. 37

గంగానది

ఇంద్రవజ్రము. చెల్లన్ మది న్నిన్ను భజింతు గంగన్
పుల్లాంతరంగన్ బహుపుణ్యసంగన్
గల్లోలలక్ష్మీ జితకాశమల్లిన్
దల్లిన్ సుధీ కల్పలతా మతల్లిన్. 38

యమున

ఉ. ముందటఁ గాంచె నంత బుధముఖ్యుఁడు హల్లక పుల్ల పద్మ ని
ష్యంద మరంద పాన విలస న్మదభృంగఁ జలత్తరంగ, మా
కంద లవంగ లుంగ లతికాచయ సంగ, సురాంగనాశ్రితా
నందిత పుణ్య సంగ, యమునన్, భవ భంగ, శుభాంగ నర్మిలిన్. 39

స్వర్గము

మ. కనియెన్ బుణ్యజనౌకమున్ విగత రోగ స్వప్న పీడాన్నఖా
దన సంశోకముఁ బుష్ప పల్లవ ఫలోద్దామ ద్రుమానీకమున్
స్వనితోద్ధూత పతాకమున్ బ్రవిచర ద్వ్యోమాని కానీకమున్
ఘన గంగా సలిలైకమున్ మఘవయుక్త శ్రీకమున్ నాకమున్. 40

కోరికలు

క. ముదిసెను దంతావళియును
ముదిసెను కేశములుఁ దనువు ముదిసెం దనకున్
ముదియనివి రెండు చిక్కెను
బ్రదికెడి తీపియును విషయపక్ష స్పృహయున్. 41

క. కడ లేదాశాలతకును
గడఁ జూడఁగఁ గానరాదు కడఁ గనిరేనిన్
గడఁ ముదమున సంసారము
గడఁ గందురు తత్త్వవిదులు కమలదళాక్షీ ! 42

క. మండన హాటక పశు వే
దండాశ్వ వధూ దుకూల ధాన్యాదులు పె
క్కుండియు నాశాపాశము
ఖండింపఁగ లేవు మఱియుఁ గడమయ చుమ్మీ ! 43

కా. కామోపభోగ సుఖములు
వేమాఱును బురుషుఁ డనుభవింపుచు నున్నం
గామంబు శాంతిఁ బొందదు
ధూమధ్వజుఁ డాజ్యవృష్టిఁ బ్రుంగుడువడునే. 44

ముదిమి

శా. కాంతాహేయము దుర్వికారము దురాకండూతి మిశ్రంబు హృ
చ్చింతామూలము పీనసాన్వితము ప్రస్వేద ప్రవణాకంపన
భ్రాంతి స్ఫోటక యుక్త మీ ముదిమి వాంఛం దాల్చి నానా సుఖా
పాంతం బైన వయోనిధాన మిది యయ్యా! తేర యీ వచ్చునే. 45

ద్రౌపది అశ్వత్థామతో

క. భూసురుఁడవు బుద్ధి దయా
భాసురుఁడవు శుద్ధవీర భటసందోహా
గ్రేసరుఁడవు శిశుమారణ
మాసురకృత్యంబు ధర్మమగునే తండ్రీ ! 46

శా. ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం
చిద్ద్రోహంబును నీకుఁ జేయరు బలోత్సేకంబుతోఁ జీఁకటిన్
భద్రాకారులఁ జిన్నపాపల రణప్రౌఢక్రియా హీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా ! నీ చేతు లెట్లాడెనో ! 47

విదురుడు ధృతరాష్ట్రునితో 47

శా. పుట్టంధుండవు, పెద్దవాఁడవు, మహాభోగంబులా లేవు, నీ
పట్టెల్లంజెడిపోయె, దుస్సహ జరాభారంబు పైఁ గప్పె, నీ
చుట్టా లెల్లను బోయి రాలు మగఁడున్ శోకంబునన్ మగ్నులై
కట్టా ! దాయలపంచ నుండఁ దగవే, కౌరవ్యవంశాగ్రణీ ! 48

క. కనియెదవో బిడ్డల నిఁక
మనియెదవో తొంటికంటె మనుమలమాటల్
వినియెదవో యిచ్చెద ర
మ్మనియెదవో దానములకు నవనీసురులన్. 49

ధర్మజుఁడు అర్జునునితో

క. ఓడితివో శత్రువులకు
నాడితివో సాధు దూషణాలాపంబుల్

గూడితివో పరసతులను
పీడితివో మానధనము పేదల నడుమన్. 50

క. తప్పితివో యిచ్చెద నని
చెప్పితివో కపటసాక్షి చేసిన మేలుం
దెప్పితివో శరణార్థుల
రొప్పితివో ద్విజులఁ బసుల రోగుల సతులన్. 51

క. అడిచితివో భూసురులను
గుడిచితివో బాల వృద్ధ గురువులు వెలిగా
విడిచితివో యాశ్రితులను
ముడిచితివో పరుల విత్తముల లోభమునన్. 52

క. మన సారథి మన సచివుఁడు
మన వియ్యము మన సఖుండు మన బాంధవుఁడున్
మన విభుఁడు గురువు
దేవర మనలను డిగనాడి చనియె మనుజాధీశా ! 53

శ్రీకృష్ణుడు గోపికలతో

సీ. తిలక మేటికి లేదు ? తిలకింపు తిలకను !
పువ్వులు దుఱుమవా ? పువ్వుఁబోఁడి !
కస్తూరి యలఁదవా ? కస్తూరికాగంధి !
తొడవులు తొడవవా ? తొడవు తొడవ !
కలహంసఁ బెంపవే ? కలహంస గామిని !
కీరంబుఁ జదివింతె ? కీరవాణి !

లతలఁ బోషింతువా ? లతికా లలితదేహ
సరసి నోలాడుదె ? సరసిజాక్షి ?
ఆ. మృగికి మేఁతలిడుదె ? మృగశాబలోచన !
గురుల నాదరింతె ? గురువివేక !
బంధుజనులఁ బ్రోతె ? బంధుచింతామణి !
యనుచు సతుల నడిగె నచ్యుతుండు. 54

త్రిపురసంహారి

మ. శరి యై కార్ముకియై మహాకవచి యై సన్నాహి యై వాహియై
సరథుం డై సనియంత యై సబలుఁ డై సత్కేతన చ్ఛత్రుఁడై
పరమేశుం డొక బాణమున్ విడిచెఁ దద్బాణానల జ్వాలలన్
బురము ల్గాలెఁ జటచ్చట ధ్వని నభో భూమధ్యము న్నిండగఁన్. 55

శ్రీ మహావిష్ణువు

సీ. మేఘంబు మీఁద గ్రొమ్మెఱుఁగు కైవడి మేని
పై నున్న పచ్చని పటమువాఁడు
గండ భాగంబులఁ గాంచన మణిమయ
మకరకుండల కాంతి మలయువాఁడు
శరపహ్నా నణఁగించు సంరంభమునఁ జేసి
కన్నుల నునుఁగెంపు గలుగువాఁడు
బాలార్క మండల ప్రతిమాన రత్న హా
టక విరాజిత కిరీటంబువాఁడు
తే. గంకణాంగద వనమాలికా విరాజ
మానుఁ డసమానుఁ డంగుష్ఠమాత్రదేహుఁ

డొక్కఁగదఁ జేతఁదాల్చి నేత్రోత్సవముగ
విష్ణుఁ డావిర్భవించె న వ్వేళ యందు. 56

సీ. క్షాళితాఖిల కల్మషవ్రజామరనదీ
జనక కోమల పదాబ్జములవాని
నఖిల సంప త్కార ణాపాంగ లక్ష్మి వి
లాసిత వక్షస్స్థలంబు వానిఁ
బద్మమిత్రామిత్ర భాసిత కరు ణాత
రంగిత చారు నేత్రములవాని
భువన నిర్మాణ నైపుణ భవ్య నిజ జన్మ
కారణ నాభి పంకజము వాని

తే. నహిహితాహిత శయన వాహముల వాని
సేవితామర తాపస శ్రేణి వాని
నఖిల లోకంబులకు గురుం డైన వానిఁ
గాంచెఁ బరమేష్ఠి కన్నుల కఱవు దీఱ. 57

మ. జలజాతాక్షుఁడు సూడ నొప్పె ధవళ చ్ఛత్రంబుతోఁ జామరం
బులతో బుష్పపిశంగ చేలములతో భూషామణి స్ఫీతుఁడై
నలినీబాంధవుతో శశిద్వయముతో నక్షత్రసంఘంబుతో
బలభిచ్చాపముతోఁ దటిల్లతికతో భాసిల్లు మేఘాకృతిన్. 58

భుజంగ ప్రయాతము. హరించుం గలిప్రేరి తాఘంబు లెల్లన్
భరించున్ ధరన్ రామభద్రుండు వోలెన్
జరించున్ సదా వేదశాస్త్రాను వృత్తిన్
పరించున్ విశేషించి వైకుంఠ భక్తిన్. 59



మహాభాగవత కల్పకుసుమమాల

ద్వాదశ గుచ్ఛము

శ్రీకృష్ణ మహిమాభివర్ణనము

క. ప్రియురాలివలన వార్తలు
ప్రియజనులకు నెల్లప్రొద్దుఁ బ్రియ మగు భంగిన్
బ్రియుఁ డగు హరిచరితంబులు
ప్రియభక్తుల కెల్లయెడలఁ బ్రియములు గావే. 1

ఆ. మంచివారి కెల్ల మంగళప్రద మయ్యుఁ
గల్లరులకు మేలు గానియట్టి
తనువు లెన్నియైనఁ దాల్చి లోకములకు
సేమ మెల్లప్రొద్దు సేయు దీవు. 2

శా. నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్
నీ పేరం బనిసేయు హస్తయుగమున్ నీ మూర్తిపైఁ జూపులున్
నీ పాదంబులపొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపైఁ జిత్తముల్
నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజపత్త్రేక్షణా ! 3

శా. ఏలా బ్రహ్మపదంబు ? వేదములకున్ వీక్షింపఁగా రాని ని
న్నీ లోకంబున నీ వనాంతరమునం దీ మందలోఁ గృష్ణ యం
చాలాపించి సమస్తభావములు నీయందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాదరేణువులపై వేష్టించినం జాలదే. 4

క. నీవారై నీ దెసఁ దమ
భావంబులు నిలిపి ఘనులు భయవిరహితులై
యే విఘ్నంబులఁ జెందక,
నీ వరయఁగ మెట్టిపోటి నెగడుదు రీశా! 5

క. నీ పాదకమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును,
దాపసమందార! నాకు దయసేయఁగదే! 6

సీ. నళినాక్ష! సత్త్వగుణంబు నీ గాత్రంబు
గాదేని విజ్ఞానకలిత మగుచు
నజ్ఞాన భేదకం బగుటెట్లు గుణముల
యందుల వెలుఁగ నీ వనుమతింపఁ
బడుదువు సత్త్వరూపంబు సేవింపంగ
సాక్షాత్కరింతువు సాక్షివగుచు
వాఙ్మనంబులకు నవ్వల యైన మార్గంబు
గలుగు నీ గుణజన్మ కర్మరహిత

తే. మైన రూపును పేరు నత్యనఘబుద్ధు
లెఱుఁగుదురు నిన్నుఁ గొల్చి నూహించుకొనుచు
వినుచుఁ దలఁచుచుఁ బొగడుచు వెలయువాఁడు
భవము నొందఁడు నీ పాదభక్తుఁ డనఘ. 7

ఉ. పుట్టువులేని నీ కభవ! పుట్టుట క్రీడయె కాక పుట్టుచే
యెట్టనుడున్ భవాది దశ లెల్లను జీవులయం దవిద్యఁ దాఁ

జుట్టుచు నుండుఁ గాని నినుఁ జుట్టనదిం బలెఁ బొంత నుండియుం
జుట్టఁగలేమిఁ దత్క్రియలఁ జొక్కని యెక్కటి వౌదు వీశ్వరా! 8

మ. గురు పాఠీనమ వై జలగ్రహ మవై కోలంబ వై శ్రీనృకే
సరి వై భిక్షుఁడ వై హయాననుఁడ వై క్ష్మాదేవతా భర్తవై
ధరణీనాథుఁడ వై దయాగుణ గణోదారుండ వై లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెద మిలాభారంబు వారింపవే! 9

భ్రమర గీతలు

చ. ఎఱుఁగుదు మేము నిన్ను వనజేక్షణు మిత్రుఁడ వీవు కూరిమిన్
మెఱయుచుఁ దల్లిదండ్రులకు మే లెఱిగింపఁ బ్రియుండు పంపఁగా
వఱలెడు భక్తి వచ్చితివి వారల నైన మనంబులోపలన్
మఱవఁడు శౌరి మేలు మఱి మాన్యులు రాజున కెవ్వ రిచ్చటన్. 10

మ. భ్రమరా! దుర్జనమిత్ర! ముట్టకుము మా పాదాబ్జముల్ నాగర
ప్రమదాళీ కుచకుంకు మాంకిత లస త్ప్రాణేశ దామ ప్రసూ
న మరం దారుణి తాననుండ పగుటన్ నాథుండు మన్నించుఁగా
క మము న్నేపుచుఁ బౌరకాంతల శుభాగారంబులన్ నిత్యమున్. 11

మ. ఒక పుష్పందలి తేనె త్రావి మధుపా! యుత్సాహి వై నీవు వే
ఱొకటిం బొందెడి భంగి మ మ్మధరపీయూషంబునం దేల్చి మా
యకలం కోజ్జ్వల యౌవనంబుఁ గొని యన్యాసక్తుఁ డయ్యెన్ విభుం
డకటా! యాతని కెట్లు దక్కె సిరి మిథ్యాకీర్తి నమ్మెన్ జుమీ. 12

శా. భృంగా! కృష్ణుఁడు మంచివాఁ డనుచు సంప్రీతిన్ బ్రసంగించె దీ
సంగీతంబున మేము సొక్కుదుమె తచ్చారిత్రముల్ వింతలే

యంగీకారము గావు మాకుఁ బురకాంతాగ్ర ప్రవేశంబులన్
సంగీతం బొనరింపు వా రిడుదు రోజన్ నీకు నిష్టార్థముల్. 13

మ. సమదాశీశ్వర! చూడు ముజ్జ్వలిత హాస భ్రూ విజృంభంబులన్
రమణీయుం డగు శౌరిచేఁ గరఁగరే రామల్ త్రిలోకంబులన్
బ్రమదారత్నము లక్ష్మి యాతని పదాబ్జాతంబు సేవించు ని
క్కము మే మెవ్వర మా కృపాజలధికిన్ గారుణ్యముం జేయఁగన్. 14

శా. రోలంబేశ్వర! నీకు దూత్యము మహారూఢంబు నీ నేరుపుల్
చాలున్ మచ్చరణాబ్జముల్ విడువు మస్మన్నాథ పుత్రాదులన్
లీలం బాసి పరంబు డించి తనకున్ లీనత్వమున్ బొందు మ
మ్మేలా వాసె విభుండు ధార్మికులు మున్నీ చందమున్ మెత్తురే. 15

సీ. కాంచన రత్న సంఘటిత సౌధంబులే
మా కుటీరంబులు మాధవునకు
వివిధ నరేంద్ర సేవిత రాజధానియే
మాపల్లె యదువంశ మండనునకు
సురభిపాదప లతాశోభి తారామమే
మా యరణ్యము సింహమధ్యమునకుఁ
గమనీయ లక్షణ గజ తురంగంబులే
మా ధేనువులు కంసమర్దనునకు

రూపవిభ్రమ నైపుణ్య రూఢ లైన
మగువలమె మేము మన్మథమన్మథునకు
నేల చింతించు మముఁ గృష్ణుఁ డేల తలఁచుఁ
బృథివి నధిపులు నూతన ప్రియులు గారె. 16

గోపికాగీతలు

సీ. ఈ చరణంబులే యిందునిభానన !
సనకాదిముని యోగసరణి నొప్పు
నీ పాదతలములే యెలనాఁగ ! శ్రుతివధూ
సీమంతవీథులఁ జెన్ను మిగులు
నీ పదాబ్జంబులే యిభకులోత్తమయాన !
పాలేటిరాచూలి పట్టుకొమ్మ
లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ !
ముక్తికాంతా మనోమోహనంబు

ఆ. లీ యడుగుల రజమె యింతి ! బ్రహ్మేశాది
దివిజవరులు మౌళిదిశలఁ దాల్తు
రనుచుఁ గొంద ఱబల లబ్జాక్షుఁ దేగిన
క్రమముఁ గనియు నతనిఁ గాన రైరి. 17

ఆ. విషజలంబువలన విషధర దానవు
వలన గాలివానవలన వహ్ని
వలన మిగులువానివలనను రక్షించి
కుసుమశరుని బారిఁగూర్పఁదగునె. 18

మ. ఘన లక్ష్మీయుత మై మహాశుభద మై కామాది విధ్వంసి యై
సనకాది స్తుత మై నిరంతర తప స్స్వాంత ప్ర పున్నాగ జీ
వన మై యొప్పెడు నీ కథామృతము ప్రాపంగల్గునే భూరి దా
న నిరూఢత్వము లేని వారలకు మానారీ మనోహారకా ! 19

ఉ. నీ వడవిన్ బవల్ దిరుగ నీ కుటిలాలక లాలితాస్య మి
చ్ఛావిధిఁ జూడకున్న నిమిషంబులు మాకు యుగంబు లై చనుం
గావున రాత్రు లైన నినుఁ గన్నుల నెప్పుడుఁ జూడకుండ ల
క్ష్మీవర! ఱెప్ప లడ్డముగఁ జేసె నిదేల విధాత క్రూరుఁ డై. 20

రాసక్రీడలు

ఆ. పరమ యోగిహృదయ భద్రపీఠంబుల
నుండి మేటి వ్రజవధూత్తరీయ
పీఠమున వసించి పెంపారెఁ ద్రిభువన
దేవలక్ష్మి మేనఁ దేజరిల్ల. 21

చ. ప్రమద యొకర్తె మాధవుఁడు పాడ విపంచి ధరించి కేల సం
భ్రమమునఁ దంత్రి మీటుచుఁ దిరంబుగ తాయము చేసి యొక్క రా
గము తగ నాలపించి సుభగ స్వరజాతులు వేఱు వేఱకా
సమరఁగఁ బాడె దన్ రమణుఁ డౌ నన దారువు లంకురింపఁగన్. 22

మ. ఘను లై యెవ్వని పాదపంకజ పరాగ ధ్యానసంప్రాప్త యో
గ నిరూఢత్వముచే మునీంద్రులు మహాకర్మంబులన్ బాసి బం
ధ నిరోధంబులు లేక విచ్చలవిడిం దర్పింతు రా నిత్యశో
భనుఁ డె ట్లుండిన నుండెఁ గాక కలవే బంధంబు లుర్వీశ్వరా ! 23

ఆ. గోపజనములందు గోపికలందును
సకల జంతులందు సంచరించు
నా మహాత్మునకుఁ బరాంగన లెవ్వరు
సర్వమయుఁడు లీల సలిపెఁ గాక. 24

గోపికల మధురభక్తి

ఆ. బాంధవమున నైనఁ బగనైన పగనైనఁ
ప్రీతి నైనఁ బ్రాణభీతి నైన
భక్తి నైన హరికిఁ బరతంత్రులై యుండు
జనులు మోక్షమునకుఁ జనుదు రధిప ! 25

సీ. నీ పాదకమలంబు నెమ్మి డగ్గఱఁ గాని
తరలి పోవంగఁ బాదములు రావు
నీ కరాబ్జంబులు నెఱి నంటితివఁ గాని
తక్కిన పనికి హస్తములు చొరవు
నీ వాగమృతధార నిండఁ గ్రోలఁగఁ గాని
చెవు లన్యభాషలఁ జేరి వినవు
నీ సుందరాకృతి నియతిఁ జూడఁగఁ గాని
చూడ వన్యంబులఁ జూడ్కికవలు

ఆ. నిన్నెకాని పలుకనేరవు మా జిహ్వ
లొల్ల ననుచుఁ బలుక నోడ వీవు
మా మనంబు లేల మఱపి దొంగిలితివి
యేమి సేయువార మింకఁ గృష్ణ ! 26

సీ. పున్నాగ! కానవే పున్నాగవందితుఁ
దిలకంబ! కానవే తిలకనిటలు
ఘనసార! కానవే ఘనసారశోభితు
బంధూక! కానవే బంధుమిత్రు

మన్మథ! కానవే మన్మథాకారుని
వంశంబ! కానవే వంశధరునిఁ
జందన ! కానవే చందనశీతలుఁ
గుందంబ! కానవే కుందరదను

తే. నింద్రభూజమ! కానవే యింద్రవిభవుఁ
గువలవృక్షమ! కానవే కువలయేశుఁ
బ్రియకపాదప! కానవే ప్రియవిహారు
ననుచుఁ గృష్ణుని వెదకి ర య్యబ్జముఖులు. 27

ఉ. నల్లనివాఁడు పద్మ నయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబు దెచ్చె నో
మల్లియలార! మీ పొదలమాటున లేఁడు గదమ్మ! చెప్పరే. 28

ఉ. అంగజు నైనఁ జూడ హృదయంగముఁ డై కరఁగించువాఁడు శ్రీ
రంగ దురంబువాఁడు మధురం బగు వేణురవంబువాఁడు మ
మ్మంగజు పువ్వుఁదూపులకు నగ్గము చేసె లవంగ లుంగ నా
రంగములార! మీకడకు రాఁడుగదా! కృప నున్నఁ జూపరే. 29

తే. పొగడఁ దగువానిఁ గానరే పొగడలార!
యీ తెఱుంగని విభుఁ జూపుఁ డీడెలార!
మొల్ల మగు కీర్తివాఁ డేఁడి మొల్లలార!
శుకనిగదితునిఁ జెపుఁడు కింశుకములార! 30

మ. మమతన్ మోములు మీఁది కెత్తుకొని రోమంథంబు సాలించి హృ
త్కమలాగ్రంబులఁ గృష్ణు నిల్పి మురళీ గానామృత శ్రేణి క

ర్ణములన్ గ్రోలుచు మేఁత మాని గళితాసంధాశ్రు లై చిత్రితో
పమ లై గోవులు చూచుచున్న వదిగో పద్మాక్షి ! వీక్షించితే. 31

మ. జగతీజంబుల శాఖ లెక్కి మురళీ శబ్దామృత స్యందముల్
మిగులన్ వీనులఁ ద్రావి వ్రేఁగుపడు నెమ్మిం గృష్ణరూపంబు చి
త్తగ మై యుండఁగ నడ్డపెట్టి క్రియ నేత్రంబు ల్దగన్ మూసి యీ
ఖగముల్ సొక్కెడిఁ జూచితే మునిజనాకారంబులం గామినీ ! 32

మ. క్రమ మొప్పన్ నదులెల్ల వంశరవ మాకర్ణించి సంజాత మో
హములన్ మన్మథసాయక క్షత విశాలావర్త లై హంసవా
క్యములం జీరి తరంగ హస్తముల నాకర్షించి పద్మోపహా
రములన్ గృష్ణ పదార్చనంబు సలిపెన్ రామా ! విలోకించితే. 33

మునిపత్నులు అన్నము గొనివచ్చి కృష్ణుని చూచుట

సీ. ఒక చెలికానిపై నొకచెయ్యి చాఁచి వే
ఱొక చేత లీలాబ్జ మూఁచువానిఁ
గొప్పున కందని కొన్ని కుంతలములు
చెక్కుల నృత్యంబు సేయువానిఁ
గుఱుచ చుంగులు పుచ్చి కొమరారఁ గట్టిన
పసిఁడివన్నెలు గల పటమువానిఁ
నొదలఁ దిరిగిరా నలవఁడ జుట్టిన
దట్టంపుఁ బింఛపు దండవాని

తే. రాజితోత్పల కర్ణపూరములవాని
మహిత పల్లవ పుష్పదామములవాని

భువనమోహన నటవేష భూతివానిఁ
గనిరి కాంతలు కన్నుల కఱవు దీఱ. 34

ఋషులు శ్రీకృష్ణుని పరమేశ్వరునిగా గ్రహించుట

క. పరమేశ్వరార్పణంబుగఁ
బరజనులకు భిక్ష మిడినఁ బరమ పదమునన్
బరఁగెద రఁట తుది సాక్షా
త్పరమేశ్వరు భిక్ష సేయు ఫల మెట్టిదియో. 35

చ. కటకట ! మోసపోయితిమి కాంతలపాటియు బుద్ధి లేదు నే
డిట హరిఁ గానబో నెఱుఁగ మేము దురాత్ముల మేము కల్మషో
ద్భటులము విష్ణుదూరగుల ప్రాజ్ఞతలేల తపంబు లేల ? ప
ర్యటనము లేల శీలములు యాగములున్ మఱి యేల కాల్పనే. 36

క. జప హోమాధ్యయనంబులు
తపములు వ్రతములును లేని తరుణులు హరి స
త్కృప వడసి రన్ని గలిగియుఁ
జపలతఁ బొందితిమి భక్తి సలుపమి నకటా ! 37

మ. క్రతువుల్ ధర్మము మంత్ర తంత్ర ధనముల్ కాలంబు దేశంబు దే
వతయున్ వహ్నులు మేదినీసురులు నెవ్వాఁ డట్టి సర్వేశుఁ డీ
క్షితి రక్షింప జనించినాఁ డెఱుఁగ మా శ్రీభర్తకుం గర్తకుం
గుతలోద్ధర్తకు మేము మ్రొక్కెదము రక్షోనాథ సంహర్తకున్. 38

క. పాపాత్ముల పాపములం
బాపంగా నోపునట్టి పద్మాక్షునిపైఁ

బాపము గల దని నొడివిన
పాపాత్ముని పాపమునకుఁ బారము గలదే. 39

గోపాలుని మోహనమూర్తి వర్ణనము

సీ. విశ్వమోహన మైన వేణునినాదంబు
సరస గంభీర గర్జనము గాఁగ
మహనీయ నిర్మల మందహాసద్యుతి
లలిత సౌదామినీ లతిక గాఁగఁ
దలచుట్టు బాగునఁ దనతు పింఛపుదండ
శైలభేదను శరాసనము గాఁగఁ
గరుణా కటాక్షవీక్షణ సుధావర్షంబు
సలిలధారా ప్రవర్షంబు గాఁగ

తే. జాడ నేతెంచు గోపాలజన మునీంద్ర
చాతకంబుల దురవస్థఁ జక్కఁజేసి
కృష్ణమేఘంబు బహుతర కీర్తి నొప్పె
విమల బృందావ నాకాశవీథియందు. 40

సీ. కర్ణావతంసిత కర్ణికార ప్రభ
గండభాగద్యుతిఁ గడలుకొలుప
భువనమోహన మైన భ్రూ విలాసంబుతో
వామభాగానత వదన మొప్ప
నపసవ్యకర మృదులాంగుళీ చాతురీ
షడ్జధ్వనికి మర్మసరణిఁ జూప
డాకాలిమీఁద నడ్డము సాచి నిల్పిన
పద నఖద్యుతి భూమిఁ బ్రబ్బికొనఁగ

తే. మౌళిపింఛము కంఠదామమును మెఱయ
విలసిత గ్రామముగ నొక్క వేణువందు
బ్రహ్మగాంధర్వ గీతంబు పరగఁ జేసెఁ
జతురనటమూర్తి గోపాల చక్రవర్తి. 41

మ. శ్రవణోదంచిత కర్ణికారములతో స్వర్ణాభ చేలంబుతో
నవతంసాయిత కేకి పింఛకముతో నంభోజ దామంబుతో
స్వవశుండై మధురాధరామృతముచే వంశంబుఁ బూరింపుచు
న్నవిదా! మాధవుఁ డాలవెంట వనమం దొప్పారెడిం జూచితే. 42

శా. రావే సుందరి! యేమె బోటి! వినవే రాజీవనేత్రుండు బృం
దావీథిన్ దగ వేణు వూఁదుచు లస త్స్వాన్యాసనతాస్యంబుతో
భ్రూవిన్యాసము లంగుళీక్రమములం బొల్పార షడ్జంబుగాఁ
గావించెన్ నటుభంగి బ్రహ్మమగు తద్గాంధర్వ సంగీతమున్. 43

శా. నా మోసంబున కెద్ది మేర విన వే నా పూర్వజన్మంబులన్
లేమా! నోములు నోఁచచో నకట! కాళిందీతటిన్ వేణువై
భూమిన్ బుట్టెద నంచు గోరఁ దగదే బోధిల్లి యట్లైన నీ
జామం దిప్పుడు మాధవాధర సుధాపానంబు గల్గుం గదే. 44

శ్రీకృష్ణుని వేణుగాన మహిమ

ఉ. తల్లుల చన్నుఁబాలు మును ద్రావు తటిన్ దమ కర్ణవీథులన్
వల్లభ మైన మాధవుని వంశ రవామృతధార చొచ్చినన్
ద్రుళ్ళక పాలురాఁ డివక దూఁటక మానక కృష్ణుమీఁద దృ
గ్వల్లులు చేర్చి నిల్చె నదె వత్సము లంగనలార! కంటిరే. 45

నగరకాంతల భావన

మత్తకోకిల. కన్నులారఁగ నిత్యమున్ హరిఁ గాంచుచున్ మనువారల
య్యున్నవీన కుతూహలోత్సవయుక్తి నాగరకాంతల
త్యున్నతోన్నత హర్మ్యరేఖలనుండి చూచిరి నిక్క చే
సన్నలం దమలోనఁ దద్విభు సౌకుమార్యము సూపుచున్. 46

సీ. వీఁడఁటే! రక్కసి విగతజీవగఁ జన్నుఁ
బాలు ద్రావిన మేటి బాలకుండు
వీఁడఁటే! నందునివెలఁదికి జగమెల్ల
ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు
వీఁడఁటే! మందలో వెన్నలు దొంగిలి
దర్పించి మెక్కిన దాఁపరీఁడు
వీఁడఁటే! యెలయించి వ్రేతలమానంబు
చూఱలాడిన లోకసుందరుండు

తే. వీఁడు లేకున్న పుర మటవీస్థలంబు
వీనిఁ బొందని జన్మంబు విగతఫలము
వీనిఁ బలుకని వచనంబు విహగరుతము
వీనిఁ జూడని చూడ్కులు వృథలు వృథలు. 47

ఉ. ఈ కమలాక్షు నీ సుభగు నీ కరుణాంబుధిఁ బ్రాణనాథుగాఁ
జేకొని వేడ్కఁ గాఁపురము సేయుచునుండెడి రుక్మిణీముఖా
నేక పతివ్రతల్ నియతి నిర్మలమానసలై జగన్నుతా
స్తోక విశేష తీర్థములఁ దొల్లిటిబాముల నేమి నోఁచిరో! 48

మ. తరుణీ! యాదవరాజు గాఁడితఁడు వేదవ్యక్తుఁడై యొక్కఁడే
వరుసన్ లోకభవస్థితి ప్రళయముల్ వర్తింపఁగాఁజేయు దు
స్తర లీలారతుఁడైన యాపఁ డితనిన్ దర్శించితిం బుణ్యభా
సుర నేనంచు నటించె నొక్కతె మహా శుద్ధాంతరంగంబునన్. 49

శ్రీకృష్ణవల్లభల భావన

మ. కని రా రాజకుమారికల్ పరిమళ త్కౌతూహలాక్రాంత లై
దనుజాధీశ చమూవిదారు నతమందారున్ శుభాకారు నూ
తన శృంగారు వికారదూరు సుగుణాధారున్ మృగీలోచనా
జన చేతోధన చోరు రత్నమకుట స్ఫారున్ మనోహారునిన్. 50

సీ. వనజాక్షి ! నేఁగన్న వైజయంతిక నైనఁ
గదిసి వ్రేలుదుఁ గదా కంఠమందు
బింబోష్ఠి ! నేఁగన్న పీతాంబరమ నైన
మెఱసి యుండుదుఁ గదా మేనునిండఁ
గన్నియ ! నేఁగన్న కౌస్తుభమణి నైన
నొప్పు చూపుదుఁ గదా యురమునందు
బాలిక ! నేఁగన్న పాంచజన్యము నైన
మొనసి చొక్కుదుఁ గదా మోవిఁ గ్రోలి

ఆ. పద్మగంధి! నేను బర్హదామము నైన
చిత్రరుచుల నుందు శిరమునందు
ననుచుఁ బెక్కుగతుల నాడిరి కన్యలు
గములు గట్టి గరుడగమనుఁ జూచి. 51

శా. భూనాథోత్తమ కన్యకల్ పదుస నంభోజాతనేత్రుండు న
న్నే నవ్వెన్ దగఁ జూచె డగ్గఱియె వర్ణించెన్ వివేకించె స
న్మానించెన్ గరుణించెఁ బే రడిగె సన్మార్గంబుతోఁ బెండ్లియా
నేనే చక్రికి దేవి నంచుఁ దమలో నిర్ణీతలై రందఱున్. 52

శా. ఎన్నే భంగుల యోగమార్గముల బ్రహ్మేంద్రాదు లీక్షింపుచున్
మున్నే దేవునిఁ జూడఁ గానక తుదిన్ మోహింతు రా మేటి కే
విన్నాణంబుననో సతుల్ గృహిణులై విఖ్యాతి సేవించి ర
చ్ఛిన్నాలోకన హాస భాషణ రతి శ్లేషానురాగంబులన్. 53

శ్రీకృష్ణుని దివ్యలీలలు

శా. నన్నే పాయఁడు రాత్రులం దివములన్ నన్నే కృపం జెందెడిన్
నన్నే దొడ్డగఁ జూచు వల్లభలలో నాథుండు నా యింటనే
యున్నాఁ డంచుఁ బదాఱువేలుఁ దమలో నూహించి సేవించి రా
యన్నుల్ గాఢ పతివ్రతాత్వపరిచర్యా భక్తి యోగంబులన్. 54

మ. పతి నా యింటికి మున్ను వచ్చె నిదె నా ప్రాణేశుఁ డస్మద్గృహా
గతుఁ డయ్యెన్ మును సేరెఁ బో దొలుత మత్కాంతుండు నా శాల కే
నితరాలభ్య శుభంబు గంటి నని తా రింటింట నర్చించి ర
య్యతివల్ నూఱుఁ బదాఱువేలు నెనమం డ్రవ్వేళ నాత్మేశ్వరున్. 55

మ. ఒక భామాభవనంబు మున్ను సొర వేఱొక్కర్తు లోఁ గుందునో!
సుకరాలాపము లాడదో! సొలయునో! సుప్రీతి నీక్షింపదో!
వికలత్వంబున నుండునో! యనుచు నవ్వేళన్ వధూగేహముల్
ప్రకటాశ్చర్య విభూతిఁ జొచ్చె బహురూప వ్యక్తుఁడై భార్గవా! 56

మత్తకోకిల. పంచబాణుని నీఱుచేసిన భర్గునిం దనవిల్లు వ
ర్జించి మూర్ఛలఁ జేయఁజాలు విశేష హాస విలోకనో
దంచితాకృతు లయ్యుఁ గాంతలు దంభచేష్టల మాధవున్
సంచలింపఁగఁ జేయ నేమియుఁ జాలరైరి బుధోత్తమా! 57

కుంతీకృత కృష్ణస్తుతి

మ. నినుఁ జింతించుచుఁ బాడుచుం బొగడుచు న్నీ దివ్య చారిత్రముల్
వినుచుం జూతురుగాక లోకు లితరాన్వేషంబులం జూతురే
ఘన దుర్జన్మ పరంపరా హరణ దక్షంబై మహాయోగి వా
గ్వినుతంబైన భవత్పదాబ్జ యుగమున్ విశ్వేశ! విశ్వంభరా! 58

శా. శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!
లోకద్రోహి నరేంద్రవంశ దహనా! లోకేశ్వరా! దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!
నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ! 59

భీష్మకృత కృష్ణస్తుతి

మ. త్రిజగన్మోహన నీలకాంతి తను వుద్దీపింపఁ బ్రాభాత నీ
రజబంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజ సంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడు వన్నెలాఁడు మది నావేశించు నెల్లప్పుడున్. 60

సీ. కుప్పించి యెగసినఁ గుండలంబులఁ గాంతి
గగనభాగం బెల్లఁ గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న
జగముల వ్రేఁగున జగతి గదలఁ

జక్రకంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చని పటము జాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయక
మన్నింపు మని క్రీడి మఱలఁ దిగువఁ

తే. గరికి లంఘించు సింహంబుకరణి మెఱసి
నేఁడు భీష్ముని జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున! యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు. 61

మైత్రేయకృత కృష్ణస్తవము

మత్తకోకిల. కంటిఁ గంటి భవాబ్ధి దాఁటఁగఁ గంటి నాశ్రిత రక్షకున్
గంటి యోగి జనంబు డెందముఁ గంటిఁ జుట్టముఁ గంటి ము
క్కంటికిం గనరాని యెక్కటిఁ గంటిఁ దామరకంటిఁ జే
కొంటి ముక్తి నిధానముం దలకొంటి సౌఖ్యము లందఁగన్. 62

నాగరకులు కృష్ణుని కొలుచుట

శా. నీ పాదాబ్జము బ్రహ్మపూజ్యము గదా! నీ సేవ సంసార సం
తాపధ్వంసిని యౌఁగదా! సకల భద్రశ్రేణులం బ్రీతితో
నాపాదింతు గదా! ప్రపన్నులకుఁ గాలాధీశ! కాలంబు ని
ర్వ్యాపారంబు గదయ్య! చాలరు గదా! వర్ణింప బ్రహ్మాదులున్. 63

క. ఉరు సంసార పయోనిధి
తరణంబులు పాపపుంజ దళనంబులు శ్రీ
కరణంబులు ముక్తి సమా
చరణంబులు బాలకృష్ణ సంస్మరణంబుల్. 64

శ్రీ. శుభమస్తు

